PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 241 | విజయవాడ, శుక్రవారం 4 ఏప్రిల్ 2025 | 10 + 8 పేజీలు | వెల : 5.50

Vol No | Vijayawada, Friday 4 April 2025 | Rs

బయోగ్యాస్ ప్లాంట్లపై వాస్తవాలు చెప్పాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

2



కోల్‌కతా పై పైకి...
- వరుణ్, వైభవ్‌కు మూడేసి వికెట్లు
- సన్‌రైజర్స్‌పై 80పరుగుల తేడాతో గెలుపు

8

డీ లిమిటేషన్‌తో సమతుల్యతకు ముప్పు

- రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికత్వ పరిరక్షణకు పిడికిలి బిగిద్దాం
- సెక్యులర్ శక్తులు ముందుకు రావాలి
- 'ఫెడరలిజం-ప్రిన్సిపుల్ ఆఫ్ ఇండియా' సదస్సులో కేరళ, తమిళనాడు సిఎంలు పినరయి విజయన్, ఎమ్‌కె స్టాలిన్ పిలుపు

మదురై నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం చెబుతున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్ విభజన(డీ లిమిటేషన్)తో దేశంలోని రాష్ట్రాల మధ్య సమతుల్యత దెబ్బతింటుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు సిఎం ఎమ్‌కె స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ సర్కార్ విధానాలతో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకికత్వానికి ముప్పు పొంచి ఉందని వారు హెచ్చరించారు. వాటి పరిరక్షణకు పిడికిలి బిగించాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం దేశంలోని లౌకిక శక్తులు, పార్టీలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని గురువారం తమిళనాడులోని మదురైలోగల రాజా ముత్తయ్య హాల్‌లో 'ఫెడరలిజం, ప్రిన్సిపుల్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.బాలకృష్ణన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు సిఎం ఎమ్‌కె స్టాలిన్ ముఖ్య వక్తలుగా ప్రసంగించారు. సిపిఐ (ఎం) పొలిట్ బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ కీలకోపన్యాసం చేశారు. కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎమ్‌సి సుధాకర్ కూడా పాల్గొని ప్రసంగించారు.

తొలుత ప్రకాశ్ కరత్ మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను ఏ విధంగా హరిస్తుందనే విషయాన్ని కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ప్రత్యక్షంగా చవి చూశాయని తెలిపారు. బ్రిటీష్ పాలనలో వైస్రాయ్‌ల మాదిరిగా గవర్నర్ల వ్యవస్థను అడ్డు పెట్టుకుని కేంద్రం... రాష్ట్ర ప్రభుత్వాలను ఏ విధంగా ఇబ్బంది పెడుతుందో అందరికీ తెలుసునని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పదకొండేళ్ల కాలంలో సహకార సమాఖ్య వ్యవస్థపై ఒక పద్ధతి ప్రకారం దాడి జరుగుతోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు, అందుకు సంబంధించి రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాలను మోడీ సర్కార్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని విమర్శించారు. తద్వారా ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలను ఆర్థికంగా, రాజకీయంగా, అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతున్నారని హెచ్చరించారు. భారతదేశం అనేది రాష్ట్రాలతో కూడిన సమాఖ్య వ్యవస్థ అంటూ రాజ్యాంగం నొక్కి చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. నిధులు, గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయాల విషయంలో బీజేపీయేతర రాష్ట్రాలకు కేంద్రం మొండి చేయి చూపిస్తోందని కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు, వరదలు, విపత్తులు సంభవించిన సందర్భాల్లో ఈ విషయం సుస్పష్టమవుతోందని తెలిపారు. పునరావాసం, రోడ్లు, భవనాల పునర్ నిర్మాణం విషయంలో అనేక రాష్ట్రాల్లో ఇదే జరిగిందని గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు సమాఖ్య వ్యవస్థకే కాదు.. రాజ్యాంగానికి కూడా విరుద్ధమేనని వ్యాఖ్యానించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు అందరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

పినరయి విజయన్ మాట్లాడుతూ... గత ఏడు దశాబ్దాలుగా, రాజకీయ ఆర్థికపరంగా మిగతా 2లో



'ఫెడరలిజం-ప్రిన్సిపుల్ ఆఫ్ ఇండియా' సదస్సుకు హాజరైన తమిళనాడు సిఎం ఎమ్‌కె స్టాలిన్‌కు స్వాగతం పలుకుతున్న పినరయి విజయన్, ప్రకాశ్ కరత్ తదితరులు



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

'మిట్టల్' స్టీల్ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం

- వైజాగ్ ప్లాంట్ వద్ద రాష్ట్ర పోలీసులు
- స్టార్ హోటళ్లలో బార్ లైసెన్స్ ఫీజు తగ్గింపు
- జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మెస్సర్స్ ఆర్సెలర్ మిట్టల్ నిస్సాన్ స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లాలోని మిట్టల్ కంపెనీ కోరినట్లు డిఎల్‌పురం వద్ద 2.9 కిలోమీటర్ల వాటర్ ఫ్రంట్‌తో ఒక క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. క్యాప్టివ్ పోర్టు అనుమతి కోసం కాకినాడ గేట్వే పోర్టు లిమిటెడ్ (కెజిపిఎల్)కు సంబంధించిన పోర్టు రాయితీ ఒప్పందంలోని క్లాజు నెం 30.1.1 (ఇండియన్ పోర్టు యాక్ట్-1908)ను సవరించినట్లు మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎటువంటి అడ్డంకులూ లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారని వెల్లడించారు. తమ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా చూడటమే కాక, కరెంట్ బిల్లు రూ.2,400 కోట్లను ఈక్విటీగా మార్చేందుకు ఒప్పుకున్నట్లు తెలిపారు. అందువల్లే స్టీల్ ప్లాంట్ మార్చిలో లాభాలను ఆర్జించిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ పోలీసింగ్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వ పోలీసులను స్టీల్‌ప్లాంట్ వద్ద సెక్యూరిటీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. రాష్ట్రంలో తీరప్రాంతంలో అవకాశం ఉన్నచోట పోర్టులు, ఫిషింగ్ హార్బర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పర్యాటకులకు ఈ ఐదేళ్లలో దాదాపు 50 వేల గదులను నిర్మించాలనే లక్ష్యంతో పర్యాటకశాఖ ఉందన్నారు. రాష్ట్రంలోని 3 స్టార్ అంతకంటే ఎక్కువ కేటగిరి హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజును రూ.66 లక్షల నుంచి రూ.25 లక్షలకు తగ్గించడానికి యువజన, సర్వీసులు, పర్యాటక, సాంస్కృతికశాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని అతిథ్య రంగాభివృద్ధికి తగిన అనుకూల వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. చాలా ఏళ్ల తరువాత ఉగాది మిగతా 6లో

ట్రంప్ టారిఫోన్మాదం

- 50 దేశాలపై సుంకాలు విధింపు
- భారత్ సరఫరాలపై 26 శాతం టారిఫ్



వాషింగ్టన్/న్యూఢిల్లీ : అనుకున్నంతా అయింది. భారత్ నుండి దిగుమతి అవుతున్న వస్తువులు, ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 26 శాతం సుంకం విధించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ గొప్ప వ్యక్తి అని, మంచి స్నేహితుడని ప్రశంసిస్తూనే ప్రతీకార చర్యలకు పాల్పడ్డారు. అయితే ఇతర ఆసియా ఎగుమతిదారులైన చైనా (34 శాతం), వియత్నాం (46 శాతం), థాయ్‌లాండ్ (36 శాతం), తైవాన్ (32 శాతం), ఇండోనేషియా (32 శాతం)తో పోలిస్తే భారత్‌పై విధించిన టారిఫ్ కొంత తక్కువేనని చెప్పాలి. కాగా భారత్‌తో పోలిస్తే ఆసియా దేశాలైన దక్షిణ కొరియా (25 శాతం), జపాన్ (24 శాతం), మలేసియా (24 శాతం)పై విధించిన సుంకం తక్కువగా ఉండడం గమనార్హం. యాభై దేశాలపై విధించిన సుంకాలకు సంబంధించిన వివరాలను వైట్‌హౌస్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'విమోచన దినోత్సవ ప్రతీకార సుంకాలు' పేరిట ఈ సమాచారాన్ని అందించింది. ఇప్పటి వరకూ వివిధ దేశాలు తమపై విధించిన సుంకాల నుండి ఊరట పొందినందున ఈ రోజును విమోచన దినం (లిబరేషన్ డే)గా జరుపుకుంటామని మిగతా 6లో

భారత్‌కు టారిఫ్‌ల ముప్పు
- ఎగుమతులకు దెబ్బ
- జిడిపి అర శాతం పడిపోవచ్చు
- వ్యవసాయంపైనా ప్రభావం
- మార్కెట్లకు నష్టాలు

6

ఎసిబికి చిక్కిన డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, గుజరాతీపేట

తమ శాఖలోనే పనిచేస్తున్న వికలాంగ ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ శ్రీకాకుళం జిల్లా డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ తెన్నేటి బాలమురళీకృష్ణ గురువారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లి పిహెచ్‌సి సీనియర్ అసిస్టెంట్ ఆదివరపు కాంతమ్మ పలు కారణాలతో గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది జనవరి వరకు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆమెకు తిరిగి మూవ్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని డిఎం అండ్ హెచ్‌ఒను ఈ ఏడాది ఫిబ్రవరిలో రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) ఆదేశించారు. దీనిని అమలు చేయడానికి రూ.20 వేలు ఇవ్వాలని వికలాంగురాలైన కాంతమ్మను డిఎం అండ్ హెచ్‌ఒ డిమాండ్ చేశారు. దీంతో, ఆమె ఎసిబిని ఆశ్రయించారు. కాంతమ్మ నుంచి డబ్బులు తీసుకొని వాటిని లెక్కపెట్టాలని తన సిసి సురేష్‌కు డిఎం అండ్ హెచ్‌ఒ ఇచ్చారు. ఎసిబి అదికారులు దాడి చేసి ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. డిఎం అండ్ హెచ్‌ఒను, ఆయన సిసిని అదుపులోకి తీసుకున్నారు.

'విశ్వ గురువు' పెదవి విప్పాలి!

- ట్రంప్ టారిఫ్ బాంబు'పై బృందా కరత్
- వక్ఫ్ బిల్లును ప్రతిఘటిస్తాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బృందాకరత్

సీతారాం ఏచూరి నగర్ నుండి ప్రజాశక్తి ప్రతినిధి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మన దేశంపై అమానుషంగా వేసిన టారిఫ్ బాంబుపై 'విశ్వగురువు'గా చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎందుకు నోరుమెదపడం లేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ ప్రశ్నించారు. సిపిఎం అఖిలభారత 24వ మహాసభ సందర్భంగా మదురైలోని సీతారాం ఏచూరి నగర్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ట్రంప్ విధించిన టారిఫ్‌ల భారంపై మోడీ పెదవి విప్పాలని డిమాండ్ చేశారు. అమెరికా దిగుమతులు చేసుకునే భారతీయ ఉత్పత్తులపై 26% అదనపు పన్ను విధించడం ద్వారా ట్రంప్ ప్రభుత్వం భారతదేశంపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించినట్టైంది ని ఆమె అన్నారు. దేశంపై తీవ్ర ప్రభావం చూపే ఈ చర్యపై ఏం చేయనుందో కేంద్రప్రభుత్వం ప్రకటించాలని ఆమె కోరారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై మోడీ ప్రభుత్వం ఇదే రకమైన యుద్ధం చేస్తోందని, ఈ చర్యలను ఆ దేశాల ప్రభుత్వాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని చెప్పారు. నామమాత్రపు చర్చకూడా జరపకుండా, పూర్తి ఏకపక్షంగా ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యపై 'ఎందువల్ల...' విశ్వగురువు నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఎందుకు పెదవి విప్పడం లేదని ఆమె ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ మౌనం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని చెప్పారు. తమను తాము జాతీయవాదులుగా చెప్పుకునే బిజెపి ప్రభుత్వ పెద్దలు ఆచరణలో అమెరికాకు అడుగడుగునా దాసోహం అంటున్నారనడానికి ఇదొక నిదర్శనమని అన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ అసలు రంగు ట్రంప్ టారిఫ్‌లతో దేశ ప్రజల ముందు బట్టబయలైందని చెప్పారు. ఈ అంశంతో పాటు లోక్‌సభలో ఉన్న మంద బలంతో మోడీ ప్రభుత్వం బలవంతంగా ఆమోదింపచేసుకున్న వక్ఫ్ సవరణ బిల్లు అంశం కూడా మహాసభలో చర్చకు వచ్చినట్లు చెప్పారు. ఈ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆమె తెలిపారు. మోడీ ప్రభుత్వ ఈ చర్య రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనన్నారు. ముస్లిం మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకునేంతవరకు తాము నిరంతరం పోరాటం చేస్తామని ఆమె చెప్పారు. లోక్‌సభలో తమ పార్టీ సభ్యులు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడారని, పలు ఇతర పార్టీల సభ్యులు కూడా వ్యతిరేకించారని అయినా మంద బలంతో ప్రభుత్వం ఆమోదింపచేసుకుందని చెప్పారు. రాజ్యసభలో ఏం జరగనుందో చూడాలని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రాల స్థాయిలో కూడా తాము పోరాటం చేస్తామని, ఇతర పార్టీలు కూడా కలిసి రావాలని కోరారు.

మహాసభ గురించి...

మహాసభకు దేశ నలుమూలల నుంచి 729 మంది ప్రతినిధులు, 79 మంది పరిశీలకులు హాజరైనట్లు బృందాకరత్ చెప్పారు. అయిదు రోజుల పాటు జరిగే ఈ మహాసభలో రాజకీయ సమీక్షా నివేదిక, రాజకీయ తీర్మానం, వాటికి ప్రతినిధుల నుంచి వచ్చిన సవరణలపై చర్చ జరుగుతుందన్నారు. గత మూడు సంవత్సరాల్లో పార్టీ అమలు చేసిన రాజకీయ వ్యూహాలు, రాబోయే మూడేళ్లలో పాటించాల్సిన వ్యూహాల గురించి ఈ సమావేశాల్లో ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిని, మిగతా 2లో

రాజ్యసభలోనూ నిరసనల హోరు

- వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని నినదించిన ప్రతిపక్షాల సభ్యులు
- బిజెడి, వైసిపి సైతం నిరసన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముస్లింల హక్కులను కాలరాస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగారుస్తూ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల బిల్లుపై రాజ్యసభలోనూ ప్రతిపక్షాల సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సవరణలపై అనేక అభ్యంతరాలను తెలిపినా మోడీ సర్కార్ పట్టించుకోలేదు. బుధవారం రాత్రి లోక్‌సభలో ఆమోదించిన ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ చేపట్టారు. లౌకికవాదం, మత స్వేచ్ఛను దెబ్బతీసేలా ఉన్న ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పాటు చర్చ జరిగినా..తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల మాట్లాడుతున్న సందర్భంగా అధికార బిజెపి సభ్యులు పదేపదే ఆటంకాలు సృష్టించారు. రాజ్యసభలో నల్ల దుస్తులు ధరించి ప్రతిపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. డిఎంకె, సిపిఎం, ఆర్‌జెడి తదితర పార్టీలు సభ్యులు నల్ల దుస్తులతో నిరసన తెలిపారు. నిరసనకు చిహ్నంగా నల్ల చొక్కాలు ధరించి సిపిఎం జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్, వి శివదాసన్ చర్చలో పాల్గొన్నారు.

గురువారం రాజ్యసభలో వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో వివిధ పార్టీలకు చెందిన 27 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వైసిపి, బిజెడి, బిఆర్‌ఎస్‌లు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా రిజిజు మాట్లాడుతూ ముస్లీం మహిళలకు సాధికారత కల్పించడం, హక్కులను రక్షించడం లక్ష్యంగానే ఈ బిల్లు తీసుకొచ్చినట్లు తెలిపారు. 2004లో 4.9 లక్షల వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని, ఇప్పుడు అవి 8.72 లక్షలకు పెరిగాయని అన్నారు.

వైసిపి ఎంపి వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లులో ముస్లీంల అభ్యంతరాలను పట్టించుకోలేదన్నారు. ఈ బిల్లు మత స్వేచ్ఛను హరించేలా ఉందన్నారు. ఏపిలో 50 లక్షల మంది ముస్లింలు ఉన్నారని, వారి ప్రయోజనాలను, వక్ఫ్ ఆస్తులను రక్షించడంలో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. వక్ఫ్ బిల్లుకు టిడిపి మద్దతు ఇచ్చి నిజ స్వరూపాన్ని బయటపెట్టిందని పేర్కొన్నారు. ఈ బిల్లు చెల్లదని ఆర్టికల్ 13 స్పష్టం చేస్తోందని, మైనార్టీ ఆస్తుల వ్యవహారంలో ప్రభుత్వాల జోక్యం అనవసరమని తెలిపారు.

ఇది రాజ్యాంగ విరుద్ధం : కాంగ్రెస్ ఎంపి నసీర్ హుస్సేన్

కాంగ్రెస్ ఎంపి సయ్యద్ నసీర్ హుస్సేన్ మాట్లాడుతూ వక్ఫ్ (సవరణ) బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిం సమాజాన్ని లక్ష్యంగానే తీసుకొచ్చారని విమర్శించారు. బిజెపి తన ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవడానికి సమాజంలో మత ఉద్రిక్తత రేకెత్తించడానికి ప్రతిపాదిత చట్టాన్ని ఉపయోగిస్తోందని విమర్శించారు. అధికారం బిజెపి దేశాన్ని తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తోందన్నారు. గత 6 నెలలుగా కేంద్ర పెద్దలు తప్పుడు సమాచారంతో దుష్ప్రచారం చేస్తున్నారని, బిజెపి ఒక ఫేక్ కర్మాగారంగా మారిపోయిందన్నారు. దేశంలో ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా పరిగణించాలనే కుట్రలో మిగతా 2లో

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిన బిల్లు
- క్రైస్తవుల పేరుతో మొసలి కన్నీరు : సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

6

ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు

- బెంగాల్‌లో 24 వేల నియామకాల రద్దు
- తృణమూల్ సర్కార్‌కు సుప్రీం చీవాట్లు

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో 2016లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది నియామకాల ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకోవడం సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 24 వేల టీచర్ల, నాన్ టీచింగ్ నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ నియామకాల కోసం నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కొల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగిన కారణంగా 23,123 నియామకాలను రద్దు చేస్తూ గతేడాది ఏప్రిల్ 22న హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును మమత ప్రభుత్వం ఆశ్రయిం చింది. పలువురు అభ్యర్థులు కూడా పిటిషన్లు దాఖలు చేశారు.

వీటిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా మిగతా 6లో



ఉపాధి రక్షణ యాత్ర నిర్వహిస్తున్న స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు (ఫైల్ ఫొటో)

కొనసాగుతున్న ఉద్వాసనలు

- తాజాగా మరో 1,503 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు
- విశాఖ స్టీల్ ప్లాంట్‌లో రెండు నెలల క్రితం 644 మందిపై వేటు
- దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడే విఆర్‌ఎస్!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల ఉద్వాసన పర్వం కొనసాగుతోంది. రెండు నెలల క్రితం 644 మందిపై వేటు వేసిన ప్లాంట్ యాజమాన్యం ఏప్రిల్ ఒకటి నుంచి మరో 1,503 మందిని తొలగించింది. దీంతో, మొత్తం 2,147 మంది ఉపాధి కోల్పోయారు. వయసు, మెడికల్ టెస్ట్ ల పేరుతో తొలగింపులకు పాల్పడుతోంది. దీనిపై కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను స్టీల్ ప్లాంట్ యాజమాన్యం అమలు చేస్తోంది. దీంతో, ప్లాంట్ భవితవ్యంపై ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి.

నిబంధనలతో ప్యాకేజీ

5,600 మందిని తొలగించాలని షరతు!

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.14,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. 2025 జనవరి నుంచి మార్చి, ఏప్రిల్ నుంచి జూన్, జులై నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నుంచి మిగతా 6లో

బల్క్ డ్రగ్స్ పరిశ్రమకు సదుపాయాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లాలోని గోర్లపూడి గ్రామంలో లారెస్ ల్యాబ్స్ సంస్థ ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్స్ పరిశ్రమకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని ఆ సంస్థ ఇసిఒ చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ నర్సింహారావు గురువారం కలిశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ విధానమని చెప్పిన సిఎం, భూ కేటాయింపులతో పాటు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, సాధ్యమైనంత త్వరగా క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించాలని కోరారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఏర్పాటుకు త్వరితగతిన భూములు కేటాయించినందుకు సత్యనారాయణ, నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ బిల్లులో టిడిపి ప్రతిపాదనలు ఆమోదం : టిడిపి ఎమ్మెల్యే నజీర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌చట్ట సవరణ బిల్లులో టిడిపి ప్రతిపాదించిన మూడు సవరణలు జెపిసి ఆమోదించిందని ఆ పార్టీ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య బాధ్యత తీసుకున్నారన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిల్లులోని అభ్యంతరాలను తాము నిర్మొహమాటంగా జాయింట్ పార్లమెంట్ యాక్షన్ కమిటీ (జెపిసి)కి సిఫార్సు చేయాల్సిన బాధ్యతను తమ పార్టీ తీసుకుందన్నారు. ముస్లిముల మనోభావాలను గౌరవిస్తూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లులో మూడు సవరణలను తమ పార్టీ పెట్టిందన్నారు. ముస్లిమేతరులను వక్ఫ్‌బోర్డులో నియమించే ప్రక్రియకు సవరణలు చేసిందన్నారు. కలెక్టర్ స్థాయి కంటే ఉన్నత స్థాయి అధికారిని నియమించి చట్ట ప్రకారం సంబంధించిన అంశాలను పరిష్కరించాలని తమ ఎంపిలు పార్లమెంట్‌లో లేవనెత్తారని తెలిపారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడానికి ఒక పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి కాపాడాలని ప్రతిపాదించామని చెప్పారు. ముస్లిముల పక్షపాతి అని చెప్పుకునే వైసిపి అధినేత వైఎస్ జగన్ సవరణ బిల్లుపై ఎందుకు ప్రతిపాదనలు చేయలేదని ప్రశ్నించారు.

రాజ్యసభలోనూ నిరసనల హోరు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగానే ఈ బిల్లు రుద్దుతున్నారని తెలిపారు. మరో కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గఢి మాట్లాడుతూ 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి, వక్ఫ్ ఆస్తులను లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని అన్నారు. ముస్లింలకు న్యాయం అందించడం గురించి వారు మాట్లాడుతున్నారని, కానీ లోక్‌సభలో ఒక్క ముస్లిం ఎంపి కూడా బిజెపికి లేరని విమర్శించారు. మరో ఎంపి అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను లాక్కోవడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

టారిఫ్‌ల దృష్టి మళ్లించేందుకే..

అమెరికా విధిస్తున్న సుంకాలను నుంచి దృష్టి మళ్లేందుకే మోడీ సర్కార్ ఈ బిల్లును తీసుకొచ్చారని శివసేన (ఠాక్రే) ఎంపి సంజయ్ రౌత్ విమర్శించారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని టిఎంసి ఎంపి నదిముల్ హక్ అన్నారు. "ఒక వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాంను ఆచరించిన తర్వాత మాత్రమే వక్ఫ్‌ను పేర్కొనగలరని షరతును ఈ బిల్లు పేర్కొంది. ఒక వ్యక్తి ముస్లిం అని ఎవరు సర్టిఫికేట్ ఇస్తారు? ఇది రాజ్యాంగ విరుద్ధం. ఆర్టికల్ 14కు విరుద్ధం" అని విమర్శించారు.

వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం ఇవ్వలేదు : హెచ్.డి. దేవెగౌడ

మాజీ ప్రధాని, జెడిఎస్ అధినేత హెచ్.డి. దేవెగౌడ మాట్లాడుతూ, 'నేను ప్రధానమంత్రిని అభినందించాలి. ఎందుకు? పేర్కొన్న ఆస్తుల విలువ దాదాపు రూ.1.2 లక్షల కోట్లు. ఈ ఆస్తులను ప్రభుత్వం ఇవ్వలేదు, దాతలు ఇచ్చారు. అవి దుర్వినియోగమవుతుంటే, స్వార్థ ప్రయోజనాలకు ఉంటే ప్రధాని మోడీ దానిపై చట్టం చేస్తున్నారు' అని అన్నారు. కేంద్ర మంత్రి జె.పి. నడ్డా మాట్లాడుతూ ఈ బిల్లు ప్రాథమిక లక్ష్యం వక్ఫ్ ఆస్తిని నిర్వహించడమన్నారు.

ఆప్కాస్‌పై ఉప సంఘం

- ఇకపై స్వర్ణ గ్రామం
- అవుట్‌సోర్సింగ్ నియామకాలపై కొత్త విధానం
- పాస్టర్ మృతిపై సక్రమంగానే దర్యాప్తు
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆప్కాస్ వ్యవస్థపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర మంత్రివర్గ భేటీలో ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలోనే ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసి సక్రమంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అదేవిధంగా మరోసారి పల్లెనిద్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టనున్నారు. ఇకపై అధికారులంతా నెలకు మూడు రోజులపాటు నిద్ర చేయాలని నిర్ణయించారు. దీనికి కొత్తగా స్వర్ణ గ్రామం పేరును పెట్టాలని నిర్ణయించారు. పల్లె వెలుగు, పల్లె నిద్ర పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు తెలిసింది. మంత్రివర్గ సమావేశం ముగిసిన తరువాత మంత్రులతో సిఎం చంద్రబాబు విడిగా భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ఈ సమయంలోనే గ్రామాలకు అధికారులు వెళ్లే అంశంపై కూడా నిశితంగా చర్చ జరిగినట్లు తెలిసింది.



అవుట్‌సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

అవుట్‌సోర్సింగ్ విధానంలో చేసిన ఉద్యోగ నియామకాల్లో గత ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని సిఎం ఆరోపించారు. దీనిపై మంత్రులు కూడా ఏకీభవించినట్లు సమాచారం. ఆప్కాస్ వ్యవస్థను నిర్వీర్యం చేసి విచ్చలవిడిగా నియామకాలు చేపట్టారని చర్చ జరిగింది. అందుకే ఆప్కాస్ వ్యవస్థపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేయాలని భేటీలో ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలోనే ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసి సక్రమంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ప్రధానంగా ఇటీవల అనుమానాస్పదంగా మరణించిన పాస్టర్ ప్రవీణ్ ఘటనపైనా విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిసింది. కొంతమంది దీనిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని, వాస్తవానికి పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. ఈ మిస్టరీని ఛేదించడంలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇతర కీలక కేసుల్లో కూడా సిసి కెమెరాల ద్వారా అనేక సాక్ష్యాలు లభిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఘటనలు చోటుచేసుకుంటున్న సమయంలో అప్రమత్తంగా లేకపోతే బాబాయ్ గొడ్డలిపోటు, కోడి కత్తి, గులకరాయి వంటి ఘటనల తరహాలోనే ప్రత్యర్థులు మనపైనే నిందలు వేస్తారన్నారు. ఇటువంటి వాటిపై మంత్రులు అప్రమత్తంగా ఉండి వాస్తవాలను ప్రజలకు వివరించి చెప్పాలని సూచించారు. అయితే మనం చేసిన మంచిని చెప్పుకోలేపోతున్నామని, మంచి భావనతో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుంటే, కొంతమంది వాటిని వక్రీకరించి చూపిస్తున్నారని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కుట్రలను తప్పి కొట్టాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

రిషికొండకు మంత్రులు

రిషికొండ భవనాలను ఏమిచేయాలన్నదానిపైనా మంత్రులతో చంద్రబాబు చర్చించారు. ఈ భవనాలను ఎలా వినియోగించుకోవాలన్నదానిపై రిషికొండ ప్యాలెస్‌ను మంత్రులు సందర్శించి వారి అభిప్రాయాలు వెల్లడించాలని సూచించారు. అలాగే విజన్ 2047 అమలుపైనా మంత్రులతో చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కన్నా మన రాష్ట్రంలో నాలుగు రెట్లు ఎక్కువగా పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అచ్చెన్నాయుడుతో కేరళ మంత్రి భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడుతో కేరళ వ్యవసాయశాఖ మంత్రి పి ప్రసాద్ గురువారం భేటీ అయ్యారు. విజయవాడలో ఒక హోటల్‌లో ఇరువురు మంత్రులు ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై చర్చించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో ధ్రువీకరణ ముఖ్యమన్నారు. త్వరలోనే కేరళలో పర్యటించనున్నట్లు తెలిపారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి విజయకుమార్, కేరళ వ్యవసాయశాఖ డైరెక్టర్, అదనపు డైరెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు, కేరళ వ్యవసాయశాఖ మంత్రి పి ప్రసాద్

కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలి
మంత్రి అచ్చెన్నను కోరిన రైతు సంఘాలు

కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులను ఆదుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడును వివిధ రైతు సంఘాల నాయకులు కోరారు. మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో సచివాలయంలో గురువారం ఈ అంశంపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొల్లు రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేయాలని, అన్ సీజన్ గింజలు వెంటనే కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలని కోరారు. తోటలు కౌలుకు తీసుకున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు మాత్రం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను మోసం చేస్తున్నాయని తెలిపారు. విదేశీ గింజల దిగుమతులు ఆపాలని, దేశీయంగా రైతుల నుంచి గింజలు కొనుగోలు చేయాలని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చేలా, అన్ సీజన్ గింజలు కొనుగోలు చేసేలా కంపెనీలు తమ నిర్ణయాన్ని ఈ నెల 7వ తేదీలోపు తెలియజేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే తగు నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, డిఎను విడుదల చేయాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల్లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, పురపాలకశాఖ మంత్రి పి నారాయణకు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. అనేక మున్సిపాల్టీల్లో నేటికీ జిపిఎఫ్ ఖాతాలు ప్రారంభించలేదన్నారు. ప్రభుత్వ క్వార్టర్లు శిథిలమవుతున్నా మరమ్మతులు చేయించడం లేదని తెలిపారు. ఇళ్లు లేని కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు టిడ్కో, జగన్న కాలనీల్లో ఇళ్లు కేటాయించినట్లు చెప్పారే తప్ప నేటికీ కేటాయింపు జరగలేదని తెలిపారు. ఈ ఇళ్ల కోసం అప్పులు తెచ్చి డబ్బు చెల్లించిన కార్మికులు ప్రతినెలా రూ.వేలల్లో వడ్డీలు చెల్లిడంతోపాటు, ఇంటి అద్దె కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

బయోగ్యాస్ ప్లాంట్లపై వాస్తవాలు చెప్పాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రిలయన్స్ కంపెనీ పెట్టనున్న 500 బయోగ్యాస్ ప్లాంట్లపై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్లాంట్లతో 2.5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని తెలిపారని, దీనికోసం ఐదు లక్షల ఎకరాల భూమి సేకరించనున్నారని తెలిపారు. ఈ ప్లాంట్ల కంపెనీకి వచ్చే లాభమెంత, అందులో రైతులకు దక్కేది ఎంత వంటి వివరాలను ప్రభుత్వం సమగ్రంగా ప్రకటించాలని కోరారు. లీజుల పేరుతో రైతుల నుండి భూములు తీసుకునే యాజమాన్యానికి భద్రత ఉందా? దీనికి చట్టబద్ధత ఏమిటి? వాటిపై ఆధారపడి జీవిస్తున్న పశువుల పెంపకందార్లు, వ్యవసాయ కూలీల పరిస్థితి ఏమిటో చెప్పాలని కోరారు. ఈ ప్లాంట్లలో తయారయ్యే మిథేన్, కార్బన్‌డైయాక్సైడ్ వల్ల ఉత్పన్నమయ్యే అనర్థాల నుండి ఇరుగు పొరుగు గ్రామాలకు భద్రత ఏమిటని ప్రశ్నించారు. కనిగిరి నియోజకవర్గంలో పెట్టే ప్లాంటుకు మూడేళ్లలో మొత్తం తిరిగి వస్తుందని, తర్వాత కంపెనీకి 100 శాతం లాభాలు వస్తాయని, రైతులకు ఇచ్చే లీజు పెరుగుతుందా లేదా చెప్పాలని కోరారు. ప్రభుత్వ భూములకు తక్కువ లీజు ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. రిలయన్స్ కంపెనీ బయోగ్యాస్ ప్లాంటుకు ఇస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు ఏమిటో చెప్పాలని, కంపెనీ తయారు చేసే గ్యాస్, ఎరువులను భూములు కోల్పోయిన రైతులకు ఉపాధిలేని ప్రజలకు ఉచితంగా ఇస్తారా? రాష్ట్ర ప్రజలకు సబ్సిడీపై గ్యాస్ అందిస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. బీడు భూముల్లో పంటలు పండటం లేదన్న నెపంతో రైతుల భూములను కంపెనీ పరం చేయడం అన్యాయం, చట్ట విరుద్ధమని తెలిపారు. పి4 పేరుతో అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అంటే వారి ఆస్తులను కొల్లగొట్టి కార్పొరేట్ల పరం చేయడమేనా? అని ప్రశ్నించారు. భూసేకరణ చేయకుండా కొద్దిమొత్తంలో లీజు చెల్లించి భూములపై ఆధిపత్యం చేయడం తప్ప మరొకటి కాదని తెలిపారు. రిలయన్స్ కంపెనీ కృష్ణపట్నంలో 20 సంవత్సరాల క్రితం 2,500 ఎకరాలు తీసుకుని ఏ ప్రాజెక్టు పెట్టలేదని, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో గ్యాస్ తవ్వితీస్తున్నా రిలయన్స్ స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించ లేదని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తోడ్పడలేదని, ప్రజలు కాలుష్యంతో నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్యాస్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్న రిలయన్స్ రాష్ట్రానికి ఉచితంగా అందించవచ్చని, అది కూడా చేయడం లేదని చేస్తే ప్రభుత్వానికి భారం లేకుండా ప్రజలకు ఉచితంగా గ్యాస్ అందించవచ్చని పేర్కొన్నారు. భూములు తీసుకుంటున్న నేపథ్యంలో ఎంతమందికి ఉద్యోగాలు ఇస్తారో అదన్నా చెప్పాలని, రాష్ట్ర వనరులను కొల్లగొట్టి రిలయన్స్‌కు లాభాలు కట్టబెట్టడం ఏ మాత్రమూ న్యాయంగా లేదని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల కళ్లు కప్పకుండా పూర్తి వాస్త వాలు ప్రకటించాలని, అనంత్ అంబానీకి ఇచ్చిన మాటను 30 రోజుల్లో నిలబెట్టుకుంటున్న లోకేష్.. ప్రజలకిచ్చిన వాగ్దానాలను 300 రోజులు అవుతున్నా ఎందుకు అమలు జరపలేదో చెప్పాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలు వెల్లడించి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

డీ లిమిటేషన్‌తో సమతుల్యతకు ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ స్థాయిల మధ్య అధికారాలను పునర్ వ్యవస్థీకరించాలనే స్థిరమైన డిమాండ్లు దేశంలో ఉన్నాయని గుర్తు చేశారు. 1980ల్లోనూ, 2000వ దశాబ్దంలో, కేంద్ర ప్రభుత్వం సర్కారియా, పూంచి కమిషన్లను నియమించిందని తెలిపారు. ఈ కమిషన్లు అనేక విలువైన సిఫార్సులు చేశాయని అన్నారు. కానీ, వాటిలో అనేకం అమలులోకి రాలేదని చెప్పారు. అయినప్పటికీ, కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయని వివరించారు. మన రాజ్యాంగాన్ని అసాధారణ పరిస్థితుల్లో రూపొందించారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో, దేశ విభజన అనంతరం భయంకరమైన మత కలహాలు, రక్తపాతం చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. ఈ వాతావరణం ప్రభావంతో, రాజ్యాంగంలో బలమైన కేంద్రీకరణ లక్షణాలు, అత్యవసర నిబంధనలకు చోటు కల్పించారని వివరించారు. అయితే ప్రస్తుతం దేశం ఎటుపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన ప్రమాదం ఇదేనని (ఆధిపత్య ధోరణి) వ్యాఖ్యానించారు. ఈ ధోరణిని ప్రజాస్వామికంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సామరస్యం, పరస్పర గౌరవం, రాష్ట్రాలకు రాజ్యాంగంలో కేటాయించిన శాసనాధికారాలను గుర్తించడమనేవి సమాఖ్య వ్యవస్థకు ఆధారసూత్రాలని తెలిపారు. కానీ, రాష్ట్రాలు ఇప్పుడు అసమతుల్యమైన ఆర్థిక పరిమితులను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం కూడా దీనిని స్పష్టంగా పేర్కొందని తెలిపారు. రాష్ట్రాలకు మొత్తం ఖర్చులో 62 శాతం బాధ్యతలు ఉంటే, అందుకు అవసరమైన ఆదాయం సంపాదించడానికి కేవలం 38 శాతం హక్కులు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం కేంద్రం... రాష్ట్రాల్లోని స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా, ఏకరీతి నిబంధనలతో పథకాలను రూపొందిస్తోందని విజయన్ ఈ సందర్భంగా విమర్శించారు. రాష్ట్రాలతో కలిసి నిధులను వెచ్చించినా, ఈ పథకాలను తన పథకాలుగా ప్రచారం చేయాలంటూ కేంద్రం షరతులు విధించటం శోచనీయమని అన్నారు. ఇది కేవలం సమాఖ్య వ్యవస్థకే కాదు, ప్రజాస్వామ్యానికి కూడా వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రకంగా ఆర్థిక సంబంధాల్లో ఇంత అసమతుల్యత ఉంటే, రాజకీయంగా కూడా రాష్ట్రాలకు గణనీయమైన విఘాతం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులు గవర్నర్ కార్యాలయాల్లో నెలల తరబడి నిలిచిపోతున్నాయని గుర్తు చేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు తమ హామీలను నెరవేర్చడానికి కట్టుబడి ఉంటాయనీ, అలాంటి కీలకమైన బిల్లులకు అర్థం లేని కారణాలతో అనుమతి ఇవ్వకపోవటం దారుణమని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ, రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా జరుగుతున్న దురుద్దేశపూరిత చర్యగా విజయన్ అభివర్ణించారు. ఒకేదేశం - ఒకే ఎన్నిక పేరిట రాజ్యాంగాన్ని సవరించేందుకు ఇప్పుడు కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజల వివేకాన్ని అణగదొక్కే చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనసభలు, లోక్‌సభ ఎన్నికలను ఒకే సమయానికి నిర్వహించేందుకు కేంద్రం ప్రయత్నించటం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని అన్నారు. వివిధ రాష్ట్రాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గించేందుకే జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను పునర్ వ్యవస్థీకరించబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల జనాభా నియంత్రణ విధానాలను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలు, ప్రత్యేకంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు వాటి ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాల హక్కులను రక్షించుకోవడం, స్థానిక ప్రభుత్వాలను బలపరచడం, కేంద్రీకరణ ధోరణులను అడ్డుకోవడమనేవి అత్యంత అవసరమని విజయన్ నొక్కి చెప్పారు.

స్టాలిన్ మాట్లాడుతూ... దేశ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా కొనసాగుతున్న బిజెపి పాలన ముగిసినప్పుడే సమాఖ్య వ్యవస్థ వికసిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ఐక్య పోరాటాల ద్వారా కేంద్ర విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికత్వ పరిరక్షణకు అందరం నడుం బిగించాల్సిన అవసరముందని సూచించారు. అయితే మార్పు అనేది ఒక్క రోజులో రాదనీ, అది ఒక సుదీర్ఘ ప్రక్రియని తెలిపారు. అయితే బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడటంలో భాగంగా 2019 నుంచి తమ రాజకీయ కూటమి పటిష్టంగా ముందుకెళుతోందని గుర్తు చేశారు. అయితే ఈ కూటమిలో చీలికలు తెచ్చేందుకు కాషాయ పార్టీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. అవన్నీ విఫలమయ్యాయనీ, కూటమిలోని ఏ ఒక్కరూ వెనకడుగు వేయబోరని స్పష్టం చేశారు. బిజెపి పాలకులకు ఫెడరలిజం అంటే ఎలర్జీ అని వ్యాఖ్యానించారు. భారతదేశం అనేది వివిధ రాష్ట్రాలతో కూడిన సమాఖ్య అంటూ రాజ్యాంగం స్పష్టం చేసిందని వివరించారు. అందుకే తాను 'కేంద్ర ప్రభుత్వం అని కాకుండా, కేంద్ర పాలన' అని సంబోధిస్తానని తెలిపారు. రాష్ట్రాల హక్కులను హరించి వేస్తోన్న మోడీ సర్కార్... కేరళ, తమిళనాడుకు చిల్లిగవ్వ కూడా ఇవ్వటం లేదని విమర్శించారు. తనతోపాటు కేరళ సిఎం పినరయి విజయన్ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనా సంస్థలను కేంద్రం డమ్మీగా మార్చి, దేశాన్ని ఫాసిస్టు పాలన వైపు నడిపిస్తోందని హెచ్చరించారు. ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చటం, పార్టీల మధ్య చీలికలు తేవటం దానికి రివాజుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలన్నింటినీ దేశ ప్రజానీకం నిశితంగా గమనిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వీటిని సహించబోదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఐక్య పోరాటాల ద్వారా బిజెపి దొరల పాలన నుంచి దేశాన్ని విముక్తం చేయాలని స్టాలిన్ పిలుపు నిచ్చారు. ఇందుకోసం కమ్యూనిస్టు మిత్రులు తమ శక్తినంతా ఉపయోగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'విశ్వ గురువు' పెదవి విప్పాలి!

(మొదటిపేజీ తరువాయి)

అకస్మాత్తుగా చోటుచేసుకున్న ఆయన మరణం గురించి ఆమె ప్రస్తావించారు. నిరంతరాయంగా ఏచూరి చేసిన కృషి వల్ల ప్రతినిధులు పార్టీని బలోపేతం చేయడానికి సృజనాత్మకంగా. అంకితభావంతో చర్చిస్తున్నారని చెప్పారు. పార్టీ ప్రధాన కార్యదర్శి లేకుండా మహాసభ జరగడం ఇదే మొదటిసారని, ఆయన స్ఫూర్తితో పార్టీ నాయకత్వంతోపాటు శ్రేణులన్నీ కొంత కాలంగా మహాసభ విజయవంతం చేయడానికి కృషి చేశారని తెలిపారు. సిపిఎం పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేసే పార్టీ అని, అందుకే మహాసభ ప్రారంభానికి రెండు నెలల ముందే పార్టీకి చెందిన అన్ని స్థాయిల్లో రాజకీయ, వ్యూహాత్మక ఎత్తుగడల తీర్మానం పై చర్చలు జరిగాయని ఈ తీర్మానానికి 3,424 సవరణలు, 84 అభిప్రాయాలు వచ్చాయని, వాటిలో 133 సవరణలను ఆమోదించినట్లు చెప్పారు.

ఆదివాసీలపై...

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అనేక రాష్ట్రాల్లో ఆదివాసీలపై దాడులను పెంచుతోందని బృందాకరత్ చెప్పారు. ఒకరకంగా ఆదివాసీలపై యుద్ధం జరుగుతోందన్నారు. అడవి బిడ్డల జీవనాధారాన్ని నాశనం చేసి, కార్పొరేట్లకు, అంతర్జాతీయ సంస్థలకు భూములను కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులను కూడా ఆదివాసీల భూములను కబ్జా చేయడానికి వాడుకుంటున్నారని అన్నారు.

మతోన్మాదంతో పాటు కులతత్వం కూడా...

హిందుత్వ శక్తులు, కార్పొరేట్ సంస్థల సహాయంతో బిజెపి దేశ ప్రజలను విభజించే కుట్ర చేస్తోందని బృందా కరత్ అన్నారు. మూడు పర్యాయాలు కేంద్రంలో అధికారంలో ఉండటంతో మతోన్మాదంతోపాటు, ప్రభుత్వ యంత్రాంగంలో కులతత్వాన్ని కూడా పెంచుతోందని చెప్పారు. మను స్మృతిని ప్రాతిపదికగా చేసుకుని పాలన సాగించేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమగ్ర పోరాటం అవసరమని చెప్పారు. ఈ శక్తులను ఓడించేందుకు కేవలం ఎన్నికల పోరాటం చేయడంతో సరిపోదని, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లోనూ పోరాడాల్సిన అవసరం ఉందని బృందాకరత్ చెప్పారు. దీనికోసం దేశవ్యాప్తంగా వామపక్ష శక్తులు బలపడటంతోపాటు, సిపిఎం సొంత బలాన్ని గణనీయంగా పెంచుకోవాల్సి ఉందని అన్నారు. మే 20న కేంద్ర కార్మిక సంఘాలు చేస్తున్న ఒక్కరోజు సమ్మెకు మద్దతు తెలపడంతో, ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, సంఘ్ పరివార్ చేస్తున్న మతోన్మాద దాడులకు వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయాలని కోరుతూ చేసిన తీర్మానాలను గురువారం నాడు మహాసభ ఆమోదించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్, తమిళనాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. కనకరాజ్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చేయాలి

- ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో సంస్కరణల్లో భాగంగా నిలిచిపోయిన కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ చేపట్టాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ కోరింది. క్రమబద్ధీకరణ కాకపోవడంతో లెక్చరర్లు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిఎస్‌ఆర్ శర్మ, బిజె గాంధీ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రం 2000వ సంవత్సరంలో కాంట్రాక్టు లెక్చరర్లుగా తమను నియమించారని తెలిపారు. అనేక పోరాటాలు చేసి జిఓ 114 ద్వారా క్రమబద్ధీకరణ సాధించుకున్నామని పేర్కొన్నారు. అన్ని శాఖల్లో జరిగిన క్రమబద్ధీకరణ విద్యాశాఖలో మాత్రం నిలిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు ప్రభుత్వం, అధికారులకు ప్రాతినిధ్యాలు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెండుసార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయని తెలిపారు. క్రమబద్ధీకరణ అంశాన్ని చర్చకు వచ్చిన సమయంలో ఎజి వద్ద దగ్గర ఉందనే సమాధానం ఆర్థికశాఖ మంత్రి చెప్పారని పేర్కొన్నారు. ఎంతకాలం ఎజి వద్ద ఉంటుందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో క్రమబద్ధీకరణ జరిగి రెండేళ్లు అయ్యిందని, రాష్ట్రంలో మాత్రం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్ విద్యలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నా క్రమబద్ధీకరణపై చొరవ తీసుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచకపోవడంతో ఇప్పటికే చాలామంది ఉద్యోగ విరమణ చేశారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకొని క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

వక్ఫ్ చట్ట సవరణపై బాబుది ద్వంద్వ వైఖరి

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు తెలపడం సిఎం చంద్రబాబు ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ముస్లిములు వ్యతిరేకిస్తున్న ఈ చట్టానికి ఒకవైపు మద్దతు ఇస్తూ.. మరోవైపు మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని ఇఫ్తార్ విందులో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లుకు సవరణ చేసి బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందన్నారు. బోర్డు అధికారాలు ప్రత్యేక అధికారికి ఇవ్వడం, బోర్డులో ముస్లిమేతరులను నియమించడానికి అవకాశం కల్పించడం వంటి చర్యలు వక్ఫ్ బోర్డు ఆస్తులు కాజేసే కుట్రలో భాగమన్నారు. పేపర్లు లేనంత మాత్రాన వక్ఫ్ బోర్డు భూములు ఆ బోర్డుకు చెందకుండా పోతాయా? అని ప్రశ్నించారు. ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిల్లు సవరణను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు.

తాను అందుబాటులో లేనేది అవాస్తవం, మెడికల్ లీవ్ అనుకోవచ్చు అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. శైలజానాథ్ వైసిపిలో చేరడంపై స్పందిస్తూ.. ఆ పార్టీకి అధికారం లేదు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించిన డబ్బు మాత్రమే ఉంది, అందుకే వెళ్లొండొచ్చన్నారు. అవినాష్ రెడ్డి బెయిల్‌పై బయట తిరుగున్నారు కాబట్టే సాక్ష్యాలను తారుమారు చేస్తున్నారని తెలిపారు. సునీత ప్రాణాలకు భద్రత ఉందా అంటూ భావోద్వేగానికి గురయ్యారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై స్పందిస్తూ రాష్ట్రంలో మతాల మధ్య చిచ్చు పెట్టాలని బిజెపి కుట్ర చేస్తోందని, ఇంకా అటువంటి పరిస్థితి రాలేదన్నారు. ప్రవీణ్‌ది హత్య అని ఆధారాలు దొరికితే తానే వారి పక్షాన డిజిపిని కలుస్తానని చెప్పారు.



మార్చురీ వద్ద ఆందోళన చేపట్టిన మహిళా, ప్రజా సంఘాల నాయకులు

ఉన్మాది నవీన్‌ను కఠినంగా శిక్షించాలి

- విశాఖలో మహిళా సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పెళ్లికి నిరాకరించిన యువతి దీపికపై దాడికి పాల్పడి, అడ్డువచ్చిన ఆమె తల్లిని దారుణంగా హత్య చేసిన నవీన్‌ను కఠినంగా శిక్షించాలంటూ ఐద్వా, మహిళా సమాఖ్య ఆధ్వర్యాన గురువారం విశాఖ కెజిహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకులు పి మణి మాట్లాడుతూ తక్షణం రాష్ట్ర హోం మంత్రి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించాలన్నారు. ఆ పేద కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. మధురవాడ ప్రాంతంలో నేరాల సంఖ్య విపరీతంగా ఉన్న నేపథ్యంలో అదనంగా నాలుగు పోలీస్ స్టేషన్లు పెట్టాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ నిమిత్తం ప్రతి ఎసిపి పరిధిలో ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఉండేలా చూడాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మద్యం విచ్చలవిడిగా దొరకడం వల్ల మహిళలపై అఘాయిత్యాలు, దారుణాలు పెరుగుతున్నాయన్నారు. ఇటీవల మధురవాడ ప్రాంతంలో ఆరేళ్ల బాలికపై వ్యాయామ ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనను మరువక ముందే అదే ప్రాంతంలో ఉన్మాది ఇంతటి దారుణానికి ఒడిగట్టాడని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎండి బేగం, దేవుడమ్మ, పుష్ప, ఐద్వా నాయకులు కొండమ్మ, సుజాత, పద్మ, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎం సుబ్బారావు, కె చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మహేష్‌బాబు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి తల్లిదండ్రులు

చిన్నారి ప్రణీక్షకు ఉచితంగా హార్ట్ సర్జరీ

- మహేష్ బాబు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి -మామిడికుదురు(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ)

మహేష్‌బాబు ఫౌండేషన్ మరో చిన్నారి ప్రాణాన్ని నిలిపింది. రూ.11 లక్షలు విలువైన హార్ట్ సర్జరీని ఉచితంగా చేయించి పేద కుటుంబం ఇంట వెలుగులు నింపింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మొగలికుదురుకు చెందిన కూర్మసాయి షణ్ముఖరావు, లక్ష్మి దంపతులు ప్రయివేటు పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. వారికి తొమ్మిది నెలల చిన్నారి పూజ్యశ్రీఫణీక్ష ఉన్నారు. ఆ పాప గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యం చేయించే స్థోమత లేక వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం మహేష్‌బాబు ఫౌండేషన్ టీమ్ సభ్యుడు హేమంత్ ప్రిన్స్‌కు తెలియడంతో చిన్నారి అనారోగ్యంపై వివరాలు సేకరించి మహేష్‌బాబు ఫౌండేషన్‌కు పంపించారు. ఫౌండేషన్ స్పందించి చిన్నారికి విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో గుండె శస్త్రచికిత్సను చేయించింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉంది. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. తమ ఇంటి దీపానికి మహేష్‌బాబు వెలుగులు నింపారన్నారు. మహేష్ బాబు ఫౌండేషన్ టీమ్‌కు, హార్ట్ సర్జరీకి అన్ని విధాల సహకరించిన మహేష్‌బాబు ఫౌండేషన్ టీమ్ మెంబర్ హేమంత్ ప్రిన్స్‌కు, తాటిపాక మహేష్ బాబు ఫ్యాన్స్‌కు ధన్యవాదాలు తెలిపారు.

2 రోజుల పాటు భిన్నమైన వాతావరణం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రెండు, మూడు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. మిగిలిన చోట్ల అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటల వరకూ కృష్ణా జిల్లా పెద అవుటుపల్లిలో 68.9 మిల్లీ మీటర్లు, ఆత్కూరులో 39 మిల్లీ మీటర్లు, ప్రకాశం జిల్లా సానికవరంలో 65.2 మిల్లీ మీటర్లు, అన్నమయ్య జిల్లా ములకల చెరువులో 57.7 మిల్లీ మీటర్లు, నంద్యాల జిల్లా పెరుసోమలలో 43.2 మిల్లీ మీటర్లు చొప్పున వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 ప్రాంతాల్లో 20 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా కమలాపురంలో 39.9 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 39.8, అనకాపల్లి జిల్లా వడ్డాది, ఎన్‌టిఆర్ జిల్లా చందర్లపాడులో 39.6 డిగ్రీలు చొప్పున, పల్నాడు జిల్లా రావిపాడులో 39.5 డిగ్రీలు, ఏలూరు జిల్లా రాజుపోతేపల్లిలో 39.4 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్

- కలెక్టర్ ఆగ్రహం
- పిజిఆర్ఎస్ వినతులపై సమీక్ష
- తూడెంలో భూవివాదంపై గ్రామస్తులతో చర్చ



తూడెంలో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో కలెక్టర్ అంబేద్కర్ గురువారం పర్యటించారు. కలెక్టర్ ముందుగా తూడెం గ్రామంలో పర్యటించి గ్రామంలో నెలకొన్న భూ వివాదంపై గ్రామస్తులను ఆరా తీశారు. భూములను పరిశీలించారు. గ్రామానికి సంబంధించిన వివాదం కావడంతో ముందుగా గ్రామ పెద్దలు, గ్రామస్తులంతా కలిసి చర్చించుకోవాలని సూచించారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే గ్రామాన్ని మరోసారి రీ సర్వే చేసి, ఎవరి భూములు వారికి అప్పగించేందుకు ప్రయత్నిస్తామ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి, రాష్ట్ర మంత్రి లోకేష్‌కు, జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన గ్రీవెన్స్ వినతులపై భోగాపురం తాహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. ఒక్కో వినతిని పరిశీలించి, సంబంధిత అర్జీదారులతో ఫోన్లో, మరికొందరితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. భూముల రికార్డులను పరిశీలిస్తుండగా ఎఫ్‌సిఒ రికార్డుల్లో కవులవాడ గ్రామానికి సంబంధించి సర్వే నెంబర్ 128కు చెందిన వివరాలతో కూడిన రెండు పేజీలు ట్యాంపరింగ్ జరిగినట్లు కలెక్టర్ గుర్తించారు. రెండు అసలు పేజీలను తొలగించి, వాటి స్థానంలో కొత్తగా రెండు పేజీలను అతికించి రికార్డుల్లోని వివరాలను మార్పు చేసి, డి-పట్టాలను జారీ చేసినట్లు గుర్తించారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సత్వర న్యాయం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటి పరిష్కారాన్ని కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ డి.కీర్తి, తాహశీల్దార్ సురేష్, ఇతర రెవెన్యూ, సర్వే సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

బెయిల్ ఇవ్వండి : వల్లభనేని వంశీ

ప్రజాశక్తి-అమరావతి : గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ తనకు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసిన పిటిషన్‌లో హైకోర్టు పోలీసులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ టి మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. గన్నవరం టిడిపి ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్ సత్యవర్ధన్‌ను కులం పేరుతో ధూషించారంటూ కేసు నమోదైంది. ఈ కేసులో వంశీ జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.

కాకాణి పిటిషన్‌పై విచారణ : క్వార్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో వైసిపి నేత కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదైన కారణంగా ఆయన ముందస్తు బెయిల్ మంజూరుకు అర్హులు కాదని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో వాదించారు. సంబంధిత ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని, అక్కడ ఫలితం లేకపోతే హైకోర్టుకు రావాలన్నారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఓ మనోహర్ రెడ్డి ప్రతివాదన చేస్తూ, ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదు చెల్లదన్నారు. బెయిల్ పిటిషన్ విచారణార్హతపై పూర్తిస్థాయిలో శుక్రవారం విచారిస్తామని జస్టిస్ టి మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు.

భూములు కోల్పోయాం... న్యాయం చేయండి

- ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

ప్రజాశక్తి- విజయనగరం

భూములు కోల్పోయిన తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు, డుంబ్రిగుడ మండలాల గిరిజనులు ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయనను విజయనగరంలోని కమిషన్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి తమ సమస్యను విన్నవించారు. పెదబయలు, డుంబ్రిగుడ మండలాల్లో ఏకలవ్య మోడల్ స్కూల్ నిర్మాణానికి తాము భూములను కోల్పోయామని, తమకు నష్టపరిహారం, ఉపాధి కల్పనలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు. దీనిపై డివిజి శంకరరావు స్పందిస్తూ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ప్రజాశక్తి - కొత్తవలస (విజయనగరం)

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ గురువారం జిల్లా జడ్జి బి.కళ్యాణ చక్రవర్తి తీర్పు చెప్పారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెం పంచాయతీ జోడిమెరక గ్రామానికి చెందిన జోడి నాగరాజు తన భార్య లక్ష్మి కనిపించడం లేదని 2022లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తవలస పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఫిర్యాది జోడు నాగరాజు తన భార్య లక్ష్మిని హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చివేయడమే కాకుండా తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని, అతడికి సహకరించిన మౌనికను అప్పటి కొత్తవలస సిఐ బాలసూర్యారావు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిని జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

సంపాదకీయం

ఇకనైనా బుద్ధొస్తుందా?

ఇళ్ళ కూల్చివేతపై భారత సర్వోన్నత న్యాయస్థానం ఈనెల 1వ తేదీన ఇచ్చిన తీర్పు ఉత్తరప్రదేశ్‌లోని బుల్డోజింగ్ ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ. ప్రయాగరాజ్‌లో ఇళ్ళ కూల్చివేత బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం ఆరు వారాల్లో చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించటం మంచి పరిణామం. "ఈ దేశంలో చట్టాలు, నియమ నిబంధనలు ఉన్నాయి. వాటిని కాలదన్ని కూల్చివేతలకు పాల్పడడం అమానవీయం. నివాస గృహాలను కూల్చివేయడం ఒక ఫ్యాషన్‌గా మారకూడదు." అని జస్టిస్ అభయ్ ఓక్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం చీవాట్లు పెట్టింది. యోగి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇలా తలంటడం ఇదే మొదటిసారి కాదు; బుల్డోజింగ్ అన్యాయాన్ని తలకెత్తుకున్న ప్రతిసారీ మొట్టికాయలు వేస్తూనే ఉంది. అయినా, బుద్ధి తెచ్చుకోని బిజెపి ప్రభుత్వం అదే అనాగరిక ధోరణిని తమ పార్టీ ఏలుబడిలో ఉన్న ఇతర రాష్ట్రాలకూ పాకించింది. దీనిపై గతంలో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే ప్రతీకార ధోరణికి స్వస్తి చెప్పాలని, అధికారులే న్యాయమూర్తుల పాత్ర పోషించటం సరైంది కాదని స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాల పట్ల వ్యవహరించాల్సిన విధివిధానాలను కూడా ప్రకటించి, అవి దేశం మొత్తానికి వర్తిస్తాయని చెప్పింది. బిజెపి పాలకులు వాటిని బేఖాతరు చేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరించటం దారుణం.

ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ నేతృత్వాన ఉన్న కాషాయ ప్రభుత్వం తొలుత ఈ బుల్డోజింగ్ విధ్వంసానికి తెర లేపింది. రాజకీయ భిన్నాభిప్రాయం కలిగి ఉన్నవారిపైనా, తమకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేసిన వారిపైనా బుల్డోజర్‌ను ఒక అధికారిక ఆయుధంగా మార్చుకుంది. 'మీ ఇళ్లపైకి బుల్డోజర్లు పంపిస్తాం.. జాగ్రత్త!' అని పలువురు బిజెపి నాయకులు నిరసనకారులను బెదిరించటం రివాజుగా మారిపోయింది! ముఖ్యంగా ఒక మతాన్ని లక్ష్యంగా పెట్టుకొని కూల్చివేతల దుర్మార్గం ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపుర, అస్సాం, మహారాష్ట్ర తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో కొనసాగుతోంది.

2021లో ప్రయాగరాజ్‌లో అతీక్ అహ్మద్ అనే గ్యాంగ్‌స్టర్‌ని ఎన్‌కౌంటర్ చేశారు. తరువాత అతడి ఆక్రమిత ఆస్తులంటూ ఒక స్థలంలో ఉన్న ఇళ్లను ఏకపక్షంగా బుల్డోజర్లతో కూల్చేశారు. బాధితులు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయిస్తే, కూల్చివేత సరైందేనంటూ బుల్డోజింగ్‌ని సమర్థించింది. దీంతో, వారు సుప్రీంకోర్టు మెట్లెక్కారు. అక్కడి ధర్మాసనం కేసును సాకల్యంగా విచారించి, బాధితులకు బాసటగా నిలిచింది.

చట్టవ్యతిరేకమైన, రాజ్యాంగ విరుద్ధమైన బుల్డోజింగ్‌ని ఒక సంస్కృతిగా మార్చే ప్రయత్నం చేస్తోంది బిజెపి. కండ కావరంతో బాధితులకు నిలువ నీడ లేకుండా చేయడమే కాదు; తన పరివార శక్తులతో ఆ బాధితులకు వ్యతిరేకంగా ద్వేషాన్ని రెచ్చగొడుతోంది. ఈ నీచ రాజకీయాన్ని విమర్శిస్తూ అనేక ప్రజాస్వామిక సంస్థలూ, పార్టీలూ నిరసన గళం వినిపిస్తున్నాయి. పార్లమెంటులో సిపిఎం సభ్యులూ, ఇతరులూ గట్టిగా మాట్లాడారు. అయినా, బిజెపి తన కక్షపూరిత విధానాన్ని వదులుకోలేదు. ఎన్‌ఆర్‌సి – సిఎఎ నిరసనల్లో పాల్గొన్న వారిని, వివిధ సందర్భాల్లో పాలకపక్షానికి వ్యతిరేకంగా ర్యాలీలు జరిపిన వారిని లక్ష్యంగా పెట్టుకొని వారి నివాసాలను కూల్చివేసింది. ఇటీవల స్టాండింగ్ కమెడియన్ కునాల్ కమ్రాపైనా కాషాయ శక్తులు ఇలాగే విరుచుకుపడ్డాయి. ఆయన కార్యక్రమాలు నిర్వహించే ముంబైలోని స్టూడియోను కూల్చివేశారు. అదే రాష్ట్రంలో ఫిబ్రవరి 23న ఒక బాలుడు తన ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తూ, పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేశాడంటూ స్థానికులు ఆరోపిస్తే, ఆగమేఘాల మీద ఆ బాలుడి తల్లిదండ్రులను పోలీసులు అరెస్టు చేశారు. వారు కస్టడీలో ఉండగానే, వారి ఇంటిని, దుకాణాన్ని కూల్చేశారు. నేరారోపణ, నిరూపణ, శిక్ష నిర్ధారణ వంటివి ఒక క్రమపద్ధతిలో జరగాలని, నేరారోపణ చేసినవాళ్లే తీర్పును వెలువరించి, శిక్షలు అమలు చేయడం నేరం అవుతుందని గత నవంబరులోనే సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. దానికి అనుగుణంగానే తాజాగా తీర్పును వెలువరించటం హర్షణీయం. భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందటమే లక్ష్యంగా బరి తెగిస్తున్న బుల్డోజింగ్ పాలకులకు ఈ తీర్పు కనువిప్పు కావాలి.

మహనీయుల మాట



నాకొక స్వప్నం ఉంది-ఈ దేశం స్వేచ్ఛా, సమానత్వాల ఆదర్శాలకు నిలయంగా మారుతుందని. నాకొక స్వప్నం ఉంది-బానిసల పిల్లలు, శ్వేత జాతీయుల పిల్లలు సోదర భావంతో కలిసిమెలిసి ఉంటారని. నాకొక స్వప్నం ఉంది-నా నలుగురు పిల్లలు చర్మం రంగుని బట్టి కాకుండా వ్యక్తిత్వాన్ని బట్టి గుర్తించడతారని.

- మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్

జననం: 15.1.1929

మరణం: 4.4.1968

స్థానిక సంస్థలను దెబ్బతీస్తున్న కూటమి ప్రభుత్వం

విశ్లేషణ




డా॥ బి. గంగారావు

చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్రంలో స్థానిక సంస్థల పట్ల వైసిపి ప్రభుత్వం అనుసరించిన వివక్షాపూరిత ఆర్థిక దౌర్జన్యాన్ని తీవ్రంగా విమర్శించారు. నిధులు ఇవ్వకపోగా స్థానిక సంస్థల కొద్దిపాటి పన్నుల ఆదాయాన్ని, కేంద్ర ఆర్థిక సంఘం నిధులను బలవంతంగా తన ఖజానాకు తరలించుకొని స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని ప్రచారం చేశారు. టిడిపి-జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని వీడి స్థానిక సంస్థల పరిధిలోని పన్ను, పన్నేతర ఆదాయాలను ఆ సంస్థలే వినియోగించుకునేలా చూస్తామని...అలాగే రాష్ట్ర బడ్జెట్ నుండి నిధులు, గ్రాంట్లు ఇచ్చి వాటిని బలోపేతం చేస్తామని వాగ్దానం చేశారు. కానీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానానికి తిలోదకాలిచ్చి స్థానిక సంస్థల ఎడల గత వైసిపి ప్రభుత్వం అనుసరించిన చర్యలనే కొనసాగించడం ఆందోళన కలిగిస్తున్నది.

ఇటీవల స్థానిక సంస్థల పరిధిలో వున్న వృత్తి పన్నును కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా రాష్ట్ర ఖజానాకు తరలించుకు పోయింది. ఇప్పటి వరకు విశాఖపట్నం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లు తమ పరిధిలో వృత్తి పన్నును అవే వసూలు చేసుకొని వినియోగించుకుంటున్నాయి. అలాగే ఇతర మున్సిపల్ నగరాలు, పట్టణాలు, గ్రామ పంచాయతీల పరిధిలోని వృత్తి పన్నును వాణిజ్య పన్నుల శాఖ వసూలు చేసి ఆ యా స్థానిక సంస్థలకు జమేస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వ కాలంలో విశాఖ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లు మినహా మిగిలిన స్థానిక సంస్థల్లో వసూలైన వృత్తి పన్నును ఆ యా సంస్థలకు తిరిగి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వమే దౌర్జన్యంగా రాష్ట్ర అవసరాలకు వినియోగించుకుంది. ఈ చర్యను ప్రతిపక్షంలో ఉండగా టిడిపి తీవ్రంగా వ్యతిరేకించింది.

గత వైసిపి ప్రభుత్వం దౌర్జన్యంగా గుంజుకున్న ఈ వృత్తి పన్నును...టిడిపి-జనసేన కూటమి ప్రభుత్వం ఇప్పుడు జీవో 63 ద్వారా చట్టబద్ధం చేసి...స్థానిక సంస్థల ఆదాయానికి గండి కొట్టింది. ముఖ్యంగా ఈ జీవోతో విశాఖ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లు వృత్తి పన్ను వసూలు చేసుకొని వినియోగించుకునే హక్కు కోల్పోతున్నాయి. దీనివల్ల విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఏడాదికి సుమారు రూ.60 కోట్లు, విజయవాడ రూ.15 కోట్లు ఆదాయాన్ని నష్టపోతున్నాయి.



నేడు రాష్ట్రంలో 13,371 గ్రామ పంచాయతీలు, 660 మండల ప్రజా పరిషత్తులు, 13 జిల్లా పరిషత్తులతోపాటు 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుండి నిధులు, గ్రాంట్లు ఇవ్వకపోవడం, ఈ సంస్థల ఆదాయాలను కూడా రాష్ట్ర పరిధిలోకి తీసుకెళ్లి వినియోగించుకోవడంతో స్థానిక సంస్థలు తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నాయి. రోజురోజుకీ వీటి ఆర్థిక పరిస్థితి దిగజారిపోతున్నది. ప్రజల కనీస సౌకర్యాలు కూడా నెరవేర్చలేని ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నాయి.

అలాగే ఇక శాశ్వతంగా స్థానిక సంస్థలకు చెందిన వృత్తి పన్ను రాష్ట్ర బడ్జెట్‌కు బదిలీ అయ్యి రాష్ట్ర ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటుంది.

వాస్తవంగా స్థానిక సంస్థల పరిధిలో ఉండే ఉద్యోగులు, వృత్తి, వ్యాపార, వాణిజ్య, కాంట్రాక్టర్లుగా ఉండే వారి నుండి వృత్తి పన్నును స్థానిక సంస్థలు వసూలు చేసుకునేవి. అయితే స్థానిక సంస్థలు ఈ పన్నును స్వతంత్రంగా వసూలు చేసుకునేందుకు అవసరమైన యంత్రాంగం లేకపోవటం వల్ల వాణిజ్య పన్నుల శాఖ వసూలు చేసి ఆ సొమ్మును స్థానిక సంస్థలకు చెల్లించేలా చేస్తున్నారు. నెలకి రూ.15 వేల నుండి రూ.20 వేల మధ్య ఆదాయం వచ్చే ఉద్యోగులకు, వృత్తి చేసుకునే వారికి నెలకు రూ.150, రూ.20 వేలు పైబడి వచ్చే వారికి రూ.200 చొప్పున వృత్తి పన్ను వసూలు చేస్తారు. అలాగే ఏడాదికి రూ.25 లక్షలకు పైబడి వార్షిక టర్నోవర్ కలిగిన వ్యాపార, వాణిజ్య, ఇతర డాక్టర్లు, లాయర్లు వంటి వారికి నెలకి రూ.2500 వృత్తి పన్ను విధిస్తున్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దీనిని రాష్ట్ర పరిధిలోకి తీసుకెళ్లడంతో పాటు వృత్తి పన్నును పెంచటంతో పాటు దీనిని అన్ని తరగతులకు, చివరికి అసంఘటిత కార్మికులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను సైతం ఈ పన్ను పరిధిలోకి తీసుకు రావటానికి ప్రయత్నం చేస్తున్నది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1000 కోట్లు పైగా ప్రజలపై భారం మోపి ఆ ఆదాయాన్ని తన అవసరాలకు వినియోగించుకోవాలన్నదే ప్రభుత్వ కుట్ర.

గడిచిన పది నెలల కాలంలో కూడా మాటలే తప్ప స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు, గ్రాంట్లు ఇవ్వలేదు. గత ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకలకు అయ్యే ఖర్చును చిన్న పంచాయతీలకు రూ.10 వేలకు, పెద్ద పంచాయతీలకు రూ.25 వేల వరకు పెంచుతూ జీవో ఇచ్చి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏదో స్థానిక సంస్థలకు నిధులిచ్చినట్లు ప్రచారం చేసుకున్నారు. పెంచిన సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం నిధుల రూపంలో మంజూరు చేస్తుందని అన్ని పంచాయతీలు ఎదురుచూశాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానా నుండి డబ్బు మంజూరు చేయలేదు. గ్రామ స్థానిక సంస్థల అకౌంట్లలో ఉండే సొంత సొమ్ములో ఈ వేడుకల నిర్వహణకు జీవోలో పేర్కొన్నట్లు ఉపయోగించుకోవచ్చని ఆదేశాలు జారీ చేశారు.

కూటమి ప్రభుత్వ వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం దగ్గరున్న స్థానిక సంస్థల సొమ్మును తిరిగి ఇవ్వకుండా గత వైసిపి ప్రభుత్వం వలే వాడుకుంటున్నది. ఉదాహరణకు భూములు, భవనాలు అమ్మకాలు కొనుగోళ్లపై వసూలు చేసే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీలపై విధించే చార్జీలను స్థానిక సంస్థలకు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బంది పెడుతున్నది. ఈ సర్ చార్జీ స్థానిక సంస్థలకు చెందినది. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన సర్‌చార్జీ సొమ్ము సుమారు రూ.85 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది వాడుకుంది. ఇలా అన్ని స్థానిక సంస్థలకు చెందిన సర్ చార్జీ సొమ్ము సుమారు రూ. 800 కోట్లు పైనే ఉంటుంది. అంతేగాక పెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌ల వివిధ పన్ను ఆదాయాలు, కేంద్ర గ్రాంట్లు, పథకాల నిధులు ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా సకాలంలో ఇవ్వడంలేదు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సర్‌చార్జీ, స్మార్ట్ సిటీ నిధులు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు, ఆస్తి పన్ను, బిల్డింగ్ లైసెన్స్ చార్జీలు వంటి ఆదాయాలు సుమారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.780 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. నేటికీ ఇవ్వలేదు. సి.ఎఫ్.ఎం.ఎస్ ని రద్దు చేశామని చెప్పినా స్థానిక సంస్థల ఆదాయాలను రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా వినియోగించుకోవడం ఆగలేదు. పైపెచ్చు 2024-25 బడ్జెట్‌లో గాని 2025-26 బడ్జెట్‌లో గాని స్థానిక సంస్థలకు తలసరి గ్రాంట్లు, అభివృద్ధి నిధులు, గ్రాంట్లు, గత రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన అరకొర నిధులను సైతం కేటాయించకుండా దుర్మార్గంగా వ్యవహరించింది.

ఒకవైపు స్థానిక సంస్థల పన్ను, పన్నేతర ఆదాయాలను తన పరిధిలోకి ఏకపక్షంగా బదిలీ చేసుకుంటూ రెండో వైపు ఆస్తి పన్నుపై ఒత్తిడి చేస్తున్నది. ఆస్తి పన్నే ప్రధాన ఆదాయ వనరుగా స్థానిక సంస్థలను పరిమితం చేస్తున్నది. అందువల్లే గత ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్ను సమీక్ష చేసి మార్పు చేస్తామని, ప్రతి ఏడాది 15 శాతం ఆస్తి పన్ను పెంచే విధానాన్ని రద్దు చేస్తామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని వమ్ము చేసింది. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆస్తి పన్ను విధానాన్నే కొనసాగిస్తూ ప్రజలపై తీవ్ర ఆస్తి పన్ను భారాన్ని మోపుతున్నది.

స్థానిక సంస్థలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం ఇచ్చే నిధులు చాలా ముఖ్యమైనది. కాని మన రాష్ట్రంలో గడిచిన 30 ఏళ్ళ నుండి పాలకులు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని సకాలంలో నియమించడంలేదు. కమిటీలు ఇచ్చిన రిపోర్టులను కూడా అమలు చేయడంలేదు. ఇదే పద్ధతిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదవ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసింది. నాల్గవ ఆర్థిక సంఘం ఇచ్చిన అరకొర సిఫార్సులను కూడా అమలు చేయకుండా నిరాకరించింది. హైకోర్టు జోక్యంతో ఐదవ ఆర్థిక సంఘాన్ని నియమించాల్సి వచ్చింది. ఈ కమిటీ కాల పరిమితి 2024 సెప్టెంబర్ 30 నాటికి రిపోర్టు ఇవ్వాలి. కానీ నేటికీ సిఫార్సులు చేయలేదు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగా ఆర్థిక సంఘాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. అందుకే రాష్ట్ర ఆర్థిక సంఘం కమిటీ కాలపరిమితి ముగిసినప్పటికీ రిపోర్టు ఇవ్వమని కోరటంలేదు. వాస్తవంగా 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో స్థానిక సంస్థలకు ఐదవ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలు చేయాలి. ఐదవ ఆర్థిక సంఘం సిఫార్సులు నేటికీ ఇవ్వకపోవడంతో స్థానిక సంస్థలు తీవ్రంగా నష్టపోతున్నాయి.

నేడు రాష్ట్రంలో 13,371 గ్రామ పంచాయతీలు, 660 మండల ప్రజా పరిషత్తులు, 13 జిల్లా పరిషత్తులతోపాటు 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నుండి నిధులు, గ్రాంట్లు ఇవ్వకపోవడం, ఈ సంస్థల ఆదాయాలను కూడా రాష్ట్ర పరిధిలోకి తీసుకెళ్లి వినియోగించుకోవడంతో స్థానిక సంస్థలు తీవ్ర ఆర్థిక సమస్యలతో సతమతం అవుతున్నాయి. రోజురోజుకీ వీటి ఆర్థిక పరిస్థితి దిగజారిపోతున్నది. ప్రజల కనీస సౌకర్యాలు కూడా నెరవేర్చలేని ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నాయి.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఈ సమస్యలకు పరిష్కారం చూపకపోగా కేంద్ర బిజెపి స్థానిక సంస్థల్లో ప్రవేశపెట్టిన హానికర సంస్కరణలన్నింటిని రాష్ట్రంలో వేగంగా అమలు చేసేందుకు పూనుకున్నది. పెద్దపెద్ద నగరాలను వివిధ ప్రాజెక్టుల పేర అప్పుల ఊబిలోకి దించబోతున్నది. అలాగే పౌర సేవలకు రకరకాల యూజర్ చార్జీలు విధించటానికి సిద్ధమవుతున్నది. వయబుల్ ఫండ్ గ్యాప్ పథకం పేర మంచినీరు, పారిశుధ్యం, పార్కులు, కళ్యాణ మండపాలు, రోడ్లు, క్రీడా మైదానాలు, ఖాళీ స్థలాలు తదితర వాటిని ప్రైవేట్‌పరం చేయబోతున్నారు. వైసిపిని విమర్శిస్తూనే ఈ ప్రమాదకర విధానాలను రాష్ట్ర కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నది. వీటిని అడ్డుకోకపోతే స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, పౌరసేవలను కాపాడుకోలేం. కనుక స్థానిక సంస్థలను బలహీనపర్చి ప్రైవేట్ శక్తుల గుత్తాధిపత్యాన్ని పెంచే ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడటమే ప్రజల ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

అమెరికా విముక్తి పేరుతో ప్రపంచంపై దాడి!

వ్యాఖ్య



ఎప్పటి నుంచో అమెరికా వైపు నుంచి ఇలాంటి బెదిరింపులు వెలువడుతున్న కారణంగా అనేక దేశాలు తమ ఎగుమతులకు వేరే మార్కెట్లను చూసుకుంటున్నాయి. చైనా వద్ద భారీ మొత్తంలో వాణిజ్య మిగులు పేరుకుపోతున్న కారణంగా దాని వద్ద డాలరు నిల్వలు కూడా ఏ దేశం వద్దా లేనన్ని ఉన్నాయి. అందువలన అది ట్రంప్ దాడిని తట్టుకోగలదు, మన వంటి దేశాల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. ట్రంప్ ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. కెనడాపై పన్నులు విధించడాన్ని వ్యతిరేకిస్తూ సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో నలుగురు అధికారపక్ష సెనెటర్లతో సహా మెజారిటీ 51 మంది ఒక తీర్మానాన్ని ఆమోదించారు. మిత్రులు, శత్రువులు అని లేకుండా అందరి మీద యుద్ధం ప్రకటించిన అమెరికా ఈ విషయంలో ఒంటరైంది. అన్ని దేశాలూ కలసి దాని మెడలు వంచుతాయా లేదా రాజకీయాలకు తెర లేపుతాయా అన్నదే ప్రపంచం ముందున్న సమస్య.

అదిరింపులు, బెదిరింపులతో దారికి తెచ్చుకోవాలని చూశాడు. వాటితో ఒరిగేదేమీ లేదు. మాకెంత నష్టమో మీకూ అంతే నష్టం తప్పదంటే పోరుకు సిద్ధమే అంటూ ఒక్క దేశమూ లొంగలేదు. చివరికి తొడగొట్టి బస్తీమే సవాల్ అంటూ 50 దేశాల మీద డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి దిగాడు. పన్ను అస్త్రాన్ని ప్రయోగించాడు. అమెరికాలో ఆర్థిక అత్యవసర పరిస్థితి చట్టానికి దుమ్ము దులిపి వినియోగంలోకి తెచ్చాడు. యాభై దేశాల మీద వివరాలు ప్రకటించినప్పటికీ కనీసం 100 దేశాలు ప్రభావితం అవుతాయని చెబుతున్నారు. దాంతో దేశాలూ, నేతలూ...కాస్త వెనుకా ముందూ చూసుకొని తమ శస్త్రాలను సంధిస్తారు. విముక్తి దినంగా ప్రకటించిన ఏప్రిల్ రెండవ తేదీ సుంకాలతో 30 లక్షల కోట్ల డాలర్లు లేదా నలుగురున్న కుటుంబం మీద మూడు లక్షల డాలర్ల మేర భారం పడుతుందని అమెరికా మాజీ విత్త మంత్రి, ప్రపంచ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్తగా పని చేసిన లారెన్స్ హెచ్ సమర్స్ హెచ్చరించాడు. ఇది రాసిన సమయానికి ఒక్క నరేంద్ర మోడీ తప్ప అనేక దేశాల నేతలు ఇప్పటికే స్పందించారు. ఔషధాలు, మరికొన్నింటి మీద పన్నులను మినహాయించినట్లు, అందువలన మన మీద పెద్దగా ప్రభావం ఉండదనే విశ్లేషణలు వెలువడినప్పటికీ స్టాక్‌మార్కెట్ వడిదుడుకులకు లోనైంది. కొన్ని పన్నులు గురువారం నుంచి అమల్లోకి రాగా మిగిలినవి క్రమంగా వస్తాయి.

వస్తుసేవల ఎగుమతుల్లో తలసరి 2,638 (2023 జనాభా) డాలర్లు ఉన్న చైనా మీద 34 శాతం, 538 డాలర్లున్న మన మీద ట్రంప్ 26 శాతం పన్ను విధించాడు. మొత్తం మీద కనీసంగా పది శాతం, దేశాల వారీ అమెరికా దిగుమతులు మీద ఎంత పన్ను విధిస్తే దానిలో సగం అమెరికా విధించింది. చైనా 67, భారత్ 52 శాతాలుగా ఉన్నందున వాటి మీద సగం విధించాడు. గరిష్టంగా కంపూచియా మీద 49 శాతం, వియత్నాంపై 46 శాతం మోపాడు. యాభై దేశాలకూ ఇదే ప్రమాణాన్ని పాటించాడు తప్ప నరేంద్ర మోడీతో ఉన్న స్నేహం కారణంగా మనకు ప్రత్యేక రాయితీ ఇచ్చిందేమీ లేదు. గ్రామాల్లో రెండు సామాజిక తరగతులు రైతుల ఇళ్లలో భోజనం చేయరుగానీ వారి నుంచి పాలు, పెరుగు, మజ్జిగల స్వీకరణకు మినహాయింపులు ఇస్తున్నట్లుగానే అమెరికాకు అవసరమైన వాటికి సుంకాల నుంచి మినహాయించారు లేదా నామమాత్రంగా విధించారు. అలా మన దేశం నుంచి ఔషధాలు, ఐటి, సెమీ కండక్టర్లు, రాగి, కలప, కొన్ని ఖనిజాలు వీటిలో ఉన్నాయి. దీని అర్థం మనకు శాశ్వత మేలు కాదు. తక్షణ ఉపశమనం మాత్రమే. తమ వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను దిగుమతి చేసుకొని వాణిజ్య అసమతూకాన్ని సరి చేయాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. దానికోసం వాణిజ్య ఒప్పందం పేరుతో చర్చలు జరుపుతూ ఒత్తిడి తెస్తోంది. దాన్లో మోడీ సర్కార్ లొంగిపోయి దిగుమతులకు తలుపులు బార్లా తెరిస్తే సరే లేకుంటే ఇప్పుడు మినహాయించిన వాటినీ ట్రంప్ వదలడని గ్రహించాలి. తన తొత్తు ఇజ్రాయిల్ మీదా 17 శాతం విధించిన అంశాన్ని మరచిపోరాదు.

ప్రధాని మోడీ మంచివాడు, తనకు గొప్ప స్నేహితుడని అయితే భారత్ చెడ్డది, తమ పట్ల సరిగా వ్యవహరించటం లేదని డోనాల్డ్ ట్రంప్ అన్నాడు. ఇది బిస్కెట్ వేయటం తప్ప మరొకటి కాదు, అందుకే మోడీ మౌనంగా ఉన్నారా! ఏమో ఎవరికి తెలుసు? పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నా ఇంతవరకు పన్ను ప్రతిపాదనలు మనకు మేలు చేసేవా హానికరమా అన్నది ఏదో ఒకటి చెప్పకుండా 140 కోట్ల జనాభాకు తాను జవాబుదారీ, తనవి సురక్షిత హస్తాలని ఎలా చెప్పుకోగలరు? కెనడా, ఇటలీ, బ్రెజిల్, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఐరోపా సమాఖ్య, తదితర దేశాలు వెంటనే స్పందించాయి. ప్రస్తుతం ప్రపంచ దిగుమతుల్లో అమెరికా వాటా 16 శాతం కాగా వాటిన్నింటి మీద పన్నులు పెరుగుతాయి, ఎంత అయితే అంత దాదాపుగా అమెరికా వినియోగదారులే భరించాల్సి ఉంటుంది. ఎప్పటి నుంచో అమెరికా వైపు నుంచి ఇలాంటి బెదిరింపులు వెలువడుతున్న కారణంగా అనేక దేశాలు తమ ఎగుమతులకు వేరే మార్కెట్లను చూసుకుంటున్నాయి. చైనా వద్ద భారీ మొత్తంలో వాణిజ్య మిగులు పేరుకు పోతున్న కారణంగా దాని వద్ద డాలరు నిల్వలు కూడా ఏ దేశం వద్దా లేనన్ని ఉన్నాయి. అందువలన అది ట్రంప్ దాడిని తట్టుకోగలదు, మన వంటి దేశాల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. ట్రంప్ ప్రయాణం నల్లేరు మీద నడక కాదు. కెనడాపై పన్నులు విధించడాన్ని వ్యతిరేకిస్తూ సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో నలుగురు అధికారపక్ష సెనెటర్లతో సహా మెజారిటీ 51 మంది ఒక తీర్మానాన్ని ఆమోదించారు. మిత్రులు, శత్రువులు అని లేకుండా అందరి మీద యుద్ధం ప్రకటించిన అమెరికా ఈ విషయంలో ఒంటరైంది. అన్ని దేశాలూ కలసి దాని మెడలు వంచుతాయా లేదా రాజకీయాలకు తెర లేపుతాయా అన్నదే ప్రపంచం ముందున్న సమస్య.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

యువత ఉసురు తీస్తున్న బెట్టింగ్

అభిప్రాయం



ఆన్‌లైన్ బెట్టింగులలో కాసినో యాప్‌ల నుండి పోకర్, రౌలెట్, బ్లాక్ జాక్, జంగ్లీ, రమ్మీ వంటి వాటితో పాటు లాటరీ యాప్‌లు...ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. ఇవన్నీ ఎక్కడో విదేశాల నుండి నడిపిస్తున్నా మన రాష్ట్రాల్లో మరింత ప్రభావం చూపిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ మెట్రో రైల్లో ఓ బెట్టింగ్ యాప్‌ను అడ్వర్టైజ్ చేసినప్పుడు పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో తొలగించాల్సి వచ్చింది.

ఈ బెట్టింగ్ యాప్‌లను సినీ, క్రీడా స్టార్లు ప్రమోట్ చేయడంతో ఈ మోజులో సామాన్యులూ పడుతున్నారు. వీటికి తోడు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల చెలామణీ విపరీతంగా పెరిగింది. పెద్ద పెద్ద సెలబ్రెటీలు, సినిమా స్టార్లు, రాజకీయ నాయకుల పిల్లలు దొరికిపోవడం చూస్తున్నాం.

ఇక సంక్రాంతి వచ్చిందంటే చాలు. కోడి పందేలు పెద్దఎత్తున జరుగుతాయి. కోర్టులు వీటిని నిషేధించినా రాజకీయ నాయకులే దగ్గరుండి మరీ కోడిపందేలు ఆడించడం చూస్తున్నాం.

యువతతో పాటు స్కూల్ పిల్లలు సైతం వారి తల్లిదండ్రుల ఫోన్లలో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఫోన్ నుండే యుపిఐల ద్వారా లక్షల్లో డబ్బులు పోగొట్టుకున్న ఘటనలు మన కళ్ల ముందే కనబడుతున్నాయి. నిర్దిష్టంగా లెక్కలు లేకపోయినా వీటి పర్యవసానంగా ఆత్మహత్యలు చేసుకున్నవారు, తమ ఆస్తులను అమ్ముకున్నవాళ్లు కూడా ఉన్నారు. ఆర్థికంగా అనేక కుటుంబాలు చితికిపోయాయి. వీటి కోసం హత్యలు కూడా జరిగినట్టు వార్తలు. ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సెలబ్రెటీలు, యూట్యూబర్లు కొంతమంది...ఇవి నిషేధించినవని, వీటి తీవ్రత ఈ స్థాయిలో ఉంటుందని తెలియక ప్రమోట్ చేశామని తప్పించుకుంటున్నారు.

ఇదే బెట్టింగ్ క్రీడలో వందల కోట్ల రూపాయలు కాజేసిన వారిపై ఇక్కడ కేసులు నమోదు కావడంతో దుబాయ్ లాంటి దేశాలకు పారిపోయినా ప్రభుత్వాలు కళ్లప్పగించి చూస్తున్నాయి. ఈ బెట్టింగ్ యాప్‌లపై 'పబ్లిక్ గేంబ్లింగ్ యాక్ట్ 1867' వచ్చినా, అనంతర కాలంలో వీటిపై నిర్ణయాధికారం ఆ యా రాష్ట్రాలకు వదిలేయడంతో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మన రాష్ట్రంలో 1974లో ఎ.పి. గేంబ్లింగ్ యాక్ట్ వచ్చినా గోవా, సిక్కిం తదితర రాష్ట్రాల్లో ఉండడంతో ఇక్కడ నియంత్రణ సాధ్యం కాలేదు. ఈ బెట్టింగ్ ఆటల ప్రభావం మరింత పెరగడంతో 2023లో 174 యాప్‌లను నిషేధించినా ఇంకా అనేక యాప్‌లకు అనుమతులు ఉండడం, మరికొన్నిటిని విదేశాల నుండి నిర్వహిస్తుండడంతో ఈ జూదం మోజు మన దేశంలో కూడా తీవ్రంగా ఉంది.

ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై 28 శాతం జి.ఎస్.టి వసూలు చేస్తున్న మన ప్రభుత్వానికి ఏడాదికి 7 వేల కోట్లు ఆదాయం వస్తున్నది. వచ్చే ఏడాది 14 వేల కోట్లు జిఎస్‌టి వసూళ్ల టార్గెట్‌గా పెట్టుకున్నట్లు కేంద్ర రెవెన్యూ సెక్రటరీయే ప్రకటించారంటే దీని ఆదాయంపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ వున్నదో అర్థమౌతోంది. ప్రజలు ఎలా పోయినా పరవాలేదు. మా ప్రభుత్వానికి ఆదాయం రావాలనే ధోరణి ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. అంటే సులభంగా ఆదాయం రావడమనేది ప్రజలకే కాదు, ప్రభుత్వాలకు కూడా అలవాటయ్యిందనే వాదనలకు బలం చేకూర్చినట్లయ్యింది. పన్నుల రూపంలో ఆదాయం వస్తుందనే పేరుతో దీనిపై నియంత్రణ చేయకపోవడం దుర్మార్గం. ఈ ఆన్‌లైన్ జూదానికి యువత బానిసలు అవుతుంటే...విలాసాల కోసమో, సులువుగా డబ్బు సంపాదించేయాలనే యావతోనో మోసపోతుంటే... అది ప్రమాదమని తెలిసి, తప్పు అని గ్రహించినా ప్రభుత్వాలు ఎందుకని ఎటువంటి నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు? సాంఘికంగా ఇంతటి ప్రభావాన్ని చూపుతున్నవాటిని ఎందుకు నిషేధించలేకపోతున్నవి? కేవలం వీటి ద్వారా ప్రభుత్వాలకు వచ్చే ఆదాయమే కొలమానమా? ఇది పెద్ద మాఫియాగా మారడం, హవాలా రూపంలో డబ్బును చలామణీ చేయడం, ఇవి ప్రభుత్వాలనే శాసించే స్థాయికి వెళ్లాయంటే దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎంత బలమైనవారో ఊహించవచ్చు!

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశభక్తి గురించి నిత్యం వల్లె వేస్తూ వుంటుంది. మరి యువత ఈ బెట్టింగ్, జూదం యాప్‌ల ద్వారా నాశనమైపోతుంటే పట్టనట్లుండడం ఏం దేశభక్తి? ఇటువంటి వాటిని నిషేధించవద్దని ఎవరూ చెప్పలేదు. మరి ఎందుకు నిషేధించడం లేదు? అనేక దేశాల్లో 1949 లోనే ఇటువంటి బెట్టింగ్, జూదాలను సంఘ విద్రోహ చర్యలుగా పరిగణించి నిషేధించాయి. మన దేశంలో కూడా దేశవ్యాప్తంగా ఒకే చట్టం రావాలి. వీటిని అడ్డగోలుగా ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వీటి సూత్రధారులను, మోసగించి విదేశాలకు పారిపోయిన వారిని దేశంలోకి రప్పించి వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి. యువత బెట్టింగ్, జూదం, మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా కౌన్సిలింగ్ సెంటర్ల ద్వారా పరివర్తన కలిగించాలి. యువతకు ఉపాధి కల్పనపై ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయాలి. కుటుంబాల్లో కూడా ఇటువంటి జూదాల జోలికి వెళ్లకుండా రెగ్యులర్‌గా కనిపెట్టుకుంటూ ఉండాలి. అప్పుడే యువతను ఈ బెట్టింగుల నుండి కాపాడుకోగలం.

- వి.వి.శ్రీనివాసరావు,

సెల్ : 9490098799

ఎంటెక్ విద్యార్థి ఆత్మహత్య..

ప్రజాశక్తి – గూడూరు టౌన్ (తిరుపతి జిల్లా)


జశ్వంత్ (ఫైల్)

తిరుపతి జిల్లా గూడూరు పరిధిలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు తెలిపిన కథనం మేరకు.. మనుబోలు కోదండరామపురం ప్రాంతానికి చెందిన జశ్వంత్ (24) ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఎం టెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం తండ్రితో కలిసి జశ్వంత్ కళాశాలకు వచ్చాడు. తండ్రి ఎదుటే భవనం రెండవ అంతస్తు నుండి దూకాడు. హుటాహుటిన హాస్పిటల్కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జశ్వంత్ తండ్రిని విచారించగా తన బిడ్డకు మానసిక స్థితి బాగాలేదని తెలిపారు. కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్యను వివరణ కోరగా విద్యార్థి మృతికి, కళాశాలకు ఎటువంటి సంబంధములేదన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కొనుగోళ్ల లావాదేవీల్లో అక్రమాలు జరిగాయంటూ సిఐడి నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాజంపేట ఎంపి పివి మిథున్ రెడ్డి వేసిన పిటిషన్ను హైకోర్టు డిస్మిస్ చేసింది. సిఐడి నమోదు చేసిన కేసులో మిథున్ రెడ్డి నిందితుడిగా లేనందున ఈ వ్యవహారంలో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని స్పష్టం చేసింది. మద్యం కొనుగోళ్ల అక్రమాల వల్ల ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల మేరకు నష్టం వచ్చిందంటూ సిఐడి పెట్టిన కేసులో తనను అరెస్టు చేసే అవకాశం ఉందంటూ మిథున్రెడ్డి పిటిషన్ వేశారు. దీనిపై గతంలో వాదనలు పూర్తి చేసిన జస్టిస్ హరినాథ్ మల్లికార్జునరావు గురువారం తీర్పు వెలువరించారు. పిటిషనర్పై నిర్దిష్ట నేరాభియోగాలు లేవన్నారు. సిఐడి చర్యలపై అభ్యంతరాలుంటే చట్ట ప్రకారం తగిన వేదికను ఆశ్రయించొచ్చునని చెప్పారు.

కాకాణి బెయిల్ పిటిషన్ వాయిదా

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్రెడ్డి కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్పై గురువారం హైకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. విచారణను శుక్రవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది. అక్రమ మైనింగ్, ఎస్సి, ఎస్టి కేసుల్లో కాకాణి గోవర్ధన్రెడ్డి బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నారు. బెయిల్ పిటిషన్లు ఇప్పటికే రెండుసార్లు న్యాయమూర్తి వాయిదా వేశారు. బెయిల్ రాకపోవడంతో ఆయన ఎవరికి అందుబాటులోకి రావడం లేదు.

లులూకు స్థల కేటాయింపుపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

విశాఖ బీచ్లోని హార్బర్ పార్కు స్థలాన్ని లులూ సంస్థకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన గురువారం సంబంధిత స్థలం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జివిఎంసిలో సిపిఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ.. లులూ మాల్కు స్థల కేటాయింపును తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంస్థకు 2017లో నాటి టిడిపి ప్రభుత్వం 13.83 ఎకరాల స్థలం కేటాయించి శంకుస్థాపన కూడా చేయించిందన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక ఈ స్థల కేటాయింపును ఉపసంహరిస్తూ జిఒ విడుదల చేసిందని తెలిపారు. నేడు టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆఘమేఘాలపై లులూ మాల్కు స్థల కేటాయింపునకు సంబంధించి జిఒను విడుదల చేయడాన్ని సిపిఎం ఖండిస్తోందన్నారు. సముద్రతీర ప్రాంతంలో సిఆర్జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు ప్రభుత్వమే అనుమతులు ఇవ్వడాన్ని తప్పుబట్టారు.

ఈ మాల్ వస్తే 15 వేల ఉద్యోగాలు వస్తాయని బూటకపు ప్రచారం చేయడం సరికాదన్నారు. గతంలో ఇదే చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగాలు వస్తాయని ఆశలు కల్పించి కారుచౌకగా ప్రభుత్వ స్థలాలను బెల్ మహీంద్ర, విప్రో, సిఎంఆర్ సెంట్రల్ వంటి ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిందని గుర్తు చేశారు. అందులో భద్రత లేని ఉద్యోగాలు, తక్కువ జీతాలు ఇచ్చి శ్రమను దోచుకుంటున్నారన్నారు. ఇప్పుడు లులూ మాల్లో ఏడు అంతస్తులతో 20 షాపింగ్ మాల్స్, ఎనిమిది థియేటర్లు, చిల్డ్రన్ పార్కు, హైపర్ మార్కెట్ వంటివి నిర్మిస్తున్నట్లు సంస్థ తెలిపిందని, దీని విలువ రూ.1500 కోట్లు అని చెప్తారని తెలిపారు. 99 ఏళ్లకు లీజుకిచ్చి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఛార్జీలు, విద్యుత్, నీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి పూనుకోవడమంటే ప్రజా ధనాన్ని వృథా చేయడమేనన్నారు. మున్సిపల్ కార్పొరేషన్కు రావాల్సిన ట్యాక్స్లను మినహాయించనున్నారని తెలిపారు. ఈ మాల్ వస్తే తీరంలో ప్రజలు స్వేచ్ఛ కోల్పోయి ప్రతిదానికీ రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్కెఎస్వి.కుమార్ మాట్లాడుతూ.. లులూ మాల్ వస్తే చిరు వ్యాపారులు, హోటళ్లు, సినిమా హాళ్లు, టెక్స్టైల్స్ వ్యాపారులు నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.సుబ్బారావు, వి.నరేంద్ర కుమార్, జివిఎన్.చలపతి, పి.వెంకటరావు, కె.కుమారి, కె.చంద్రశేఖర్, ఎం.చంటి, వై.రాజు పాల్గొన్నారు.


కెజిహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేపట్టిన మహిళా, ప్రజా సంఘాల నాయకులు

ఉన్మాది నవీన్ను కఠినంగా శిక్షించాలి

- విశాఖలో మహిళా సంఘాల ఆందోళన

ప్రజాశక్తి – కలెక్టరేట్ (విశాఖపట్నం)

పెళ్లికి నిరాకరించిన యువతి దీపికపై దాడికి పాల్పడి, అడ్డువచ్చిన ఆమె తల్లిని దారుణంగా హత్య చేసిన నవీన్ను కఠినంగా శిక్షించాలంటూ ఐద్వా, మహిళా సమాఖ్య ఆధ్వర్యాన గురువారం విశాఖ కెజిహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా నాయకులు పి మణి మాట్లాడుతూ తక్షణం రాష్ట్ర హోం మంత్రి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించాలన్నారు. ఆ పేద కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. మధురవాడ ప్రాంతంలో నేరాల సంఖ్య విపరీతంగా ఉన్న నేపథ్యంలో అదనంగా నాలుగు పోలీస్ స్టేషన్లు పెట్టాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ నిమిత్తం ప్రతి ఎసిపి పరిధిలో ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఉండేలా చూడాలన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మద్యం విచ్చలవిడిగా దొరకడం వల్ల మహిళలపై అఘాయిత్యాలు, దారుణాలు పెరుగుతున్నాయన్నారు. ఇటీవల మధురవాడ ప్రాంతంలో ఆరేళ్ల బాలికపై వ్యాయామ ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటనను మరువక ముందే అదే ప్రాంతంలో ఉన్మాది ఇంతటి దారుణానికి ఒడిగట్టాడని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎమ్డి.బేగం, దేవుడమ్మ, పుష్ప, ఐద్వా నాయకులు కొండమ్మ, సుజాత, పద్మ, సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు నాయకులు ఆర్కెఎస్వి కుమార్, ఎం సుబ్బారావు, కె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మే 10, 11 తేదీల్లో ప్రపంచ సాహితీ సంబరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన మే 10, 11 తేదీల్లో ఏలూరు జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి గోపాలస్వామి ఆడిటోరియంలో ప్రపంచ సాహితీ సంబరాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం పలు వరల్డ్ రికార్డ్స్ బుక్లలో స్థానం సంపాదించేలా బృహత్తర సాహితీ యజ్ఞానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి టి పార్థసారధి, ప్రోగ్రాం కన్వీనర్గా జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, కో–కన్వీనర్గా జాతీయ అధ్యక్షులు జి ఈశ్వరి వ్యవహరిస్తారని వివరించారు. తమ వేదిక ద్వారా ఇప్పటివరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో 145 శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహించామన్నారు. 2024లో తిరుపతిలో 48 గంటలపాటు నిరవధికంగా ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు, 2016లో అంతర్వేదిలో 1,500 మంది కవులతో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల ప్రపంచ తెలుగు కవితోత్సవం, మలికిపురంలో 12 గంటల 12 నిమిషాల 12 సెకన్ల నాన్ స్టాప్ కళారూపాల ప్రదర్శనలు, 2022 డిసెంబర్లో తిరిగి మలికిపురంలో రంగస్థల కళాప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. 2022, 2023 డిసెంబర్లో తాడేపల్లిగూడెంలో 33 గంటలపాటు నాన్ స్టాప్గా ప్రపంచ తెలుగు కవితోత్సవం, 2024 అక్టోబర్లో తాడేపల్లిగూడెంలో ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర 34 గంటలు నిర్వహించామన్నారు.


విజయవాడ గాంధీ కాలనీలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్లకు నష్టం చేకూర్చే విధానాన్ని విడనాడాలి

- బిఎస్ఎన్ఎల్, పోస్టాఫీసుల ఎదుట ధర్నా

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్, ఒంగోలు

లక్షలాది మంది పెన్షనర్స్కు నష్టం చేకూర్చే ప్రమాదకరమైన పెన్షన్ చట్టాన్ని సవరిస్తూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆలిండియా బిఎస్ఎన్ఎల్, పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్లు డిమాండ్ చేశారు. విజయవాడ గాంధీ కాలనీలో ఉన్న బిఎస్ఎన్ఎల్ పెన్షన్ పరిష్కార కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆలిండియా బిఎస్ఎన్ఎల్ టెలికం పెన్షనర్స్ అసోసియేషన్, ఆలిండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సంచార నిగం పెన్షనర్స్ అసోసియేషన్, ఆలిండియా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా సర్కిల్ పరిధిలో ఉన్న పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ ఆఫీసర్ తారాచంద్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలిండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వి వరప్రసాద్, సర్కిల్ కార్యదర్శి ఎన్ రామారావు మాట్లాడుతూ.. వేతన సవరణలకు తగ్గట్టుగా పెన్షన్లో కూడా సవరణలు చేసే విధానాన్నికి స్వస్తి చెప్పే ఈ బిల్లును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

ఆల్ఇండియా పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రకాశం డివిజన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఒంగోలులోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతులు చేపట్టిన ఉద్యమ స్ఫూర్తితో పెన్షనర్ల ఉద్యమం చేపడతామని నేతలు పిలుపునిచ్చారు. సంఘం ప్రకాశం డివిజన్ ఉపాధ్యక్షులు డి.మోహనరావు అధ్యక్షత వహించారు.



కోట్ల హర్షవర్ధన్రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు వైఎస్ జగన్ హాజరు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగర శివారులోని జిఆర్సి కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. వధూవరులు శ్రేయ, వివేకానంద విరూపాక్షలను ఆశీర్వదించారు. ఆయనకు వైసిపి నేతలు స్వాగతం పలికారు. అనంతరం తాడేపల్లికి జగన్ తిరుగు ప్రయాణం అయ్యారు. జగన్ వెంట నంద్యాల జిల్లా వైసిపి అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు విరూపాక్షి, బాలనాగిరెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ ఛైర్మన్ పాపిరెడ్డి, కర్నూల్ నగర మేయర్ రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎంఎ హఫీజ్ ఖాన్, కంగాటి శ్రీదేవి, శిల్పా చక్రపాణి రెడ్డి, గంగుల బిజేంద్రనాథ్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కోడుమూరు ఇంఛార్జి ఆదిమూలపు సతీష్ ఉన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చాం

- మూడు విడతల్లో అందరికీ శాశ్వత పట్టాలు : లోకేష్

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)


ఉండవల్లిలో రాజమండ్రి గోవిందు కుటుంబానికి ఇంటి పట్టాతో పాటు నూతన వస్త్రాలను అందజేస్తున్న లోకేష్

దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న పేదవాడి ఇంటి పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని తాను చేపట్టడం ఆనందంగా ఉందని మంత్రి నారా లోకేష్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో కొండవీటి వాగు వాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి తొలిగా ఇంటి పట్టా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో లోకేష్ మాట్లాడారు. నియోజకవర్గంలో ఇరిగేషన్, అటవీ, కొండ పోరంబోకు తదితర ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు వేసుకుని నివాసముంటున్న మూడు వేల మందికి మొదటి విడతలో పట్టాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఉండవల్లిలో రాజమండ్రి గోవిందు కుటుంబానికి ఇచ్చిన పట్టా రిజిస్ట్రేషన్ విలువ రూ.తొమ్మిది లక్షలని, మార్కెట్ విలువ చాలా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో నివసించే ప్రజలకు మూడు విడతలుగా శాశ్వత పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

ప్రస్తుతం 150 గజాల్లోపు ఉంటున్న మూడువేల మందికి పట్టాలు ఇస్తున్నామన్నారు. రెండవ విడతలో ఎండోమెంట్స్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడవ విడత మిగిలిన వారందరికీ పట్టాల అందజేతకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాల్వగట్లపై నివసించే వారికి ప్రత్యామ్నాయం కోసం ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని అన్వేషిస్తున్నామని చెప్పారు. మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్, సిఆర్డిఎ పరిధిల్లో ఉన్న గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం వేర్వేరు మోడల్స్ సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. పాదయాత్ర సందర్భంగా పేదల కష్టాలు తాను స్వయంగా చూశానని, వారి బాధలు తీర్చటమే తన ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. త్వరలోనే మంగళగిరి సమీపంలో వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఐటి రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి పొందటానికి అప్పటి ఉమ్మడి రాష్ట్ర సిఎం చంద్రబాబు కారణమని కొనియాడారు. పేదలను శాశ్వతంగా బయటపడేయడానికి పి4 విధానం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. చేనేతలకు అధునాతన సాంకేతికతపై శిక్షణకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్వర్ణకారుల కోసం 75 ఎకరాల్లో జెమ్స్ అండ్ జ్యువలరీ పార్కు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోందని, దీంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని,కొన్ని రకాల పంటలు ఎక్కువగా వచ్చినపుడు మార్కెట్ ఇంటర్వెన్షన్తో ధరలను స్థిరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్, నందం అబద్దయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రైతు ఉసురు తీసిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

- చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-వాల్మీకిపురం, పాలకొండ

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఓ రైతు ఉసురుతీసింది. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం తాటిగుంటపల్లి గ్రామం పెద్దవంకపల్లిలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పెద్దవంకపల్లికి చెందిన రైతు వెంకటాద్రి (59) తండ్రి లక్ష్మయ్యరెడ్డి ఎక్స్ఆర్మీ. తనకు పెద్దవంకపల్లిలో ప్రభుత్వం ఐదెకరాల పొలం కేటాయించింది. తన పేరు మీదకు ఆ భూమిని మార్చాలని అనేక మార్లు రెవెన్యూ అధికారులు, జిల్లా అధికారులకు వెంకటాద్రి విన్నవించుకున్నారు. అయితే వెంకటాద్రి సమస్యను ఎవ్వరూ పరిష్కరించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తన చావుకు కారణమైన వారి పేర్లను చేతిపై రాసుకుని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చేతిపై రెవెన్యూ అధికారుల పేర్లు, గ్రామానికి చెందిన ఇద్దరి పేర్లు, పీలేరుకు చెందిన ఓ వ్యక్తి పేరు రాశారు. వీరిపై పోలీసులు చర్యలు తీసుకొని, తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తహశీల్దార్ పామిలేటి మాట్లాడుతూ.. సదరు భూమి కుంట, పోరంబోకు కావడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాసుపుస్తకం మంజూరు చేయడం, ఇతర వినియోగ అవసరములకు ఉపయోగించడం వీలుకాదని చెప్పారు. రైతు మృతిపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ఎపి రైతు సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కె.వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. పట్టా మంజూరు చేసినదానికి పాసు పుస్తకాలు చేయకపోవడం దారుణమన్నారు.

అప్పుల బాధతో మరొకరు..

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం సింగనవలస గ్రామంలో అప్పుల బాధ తాళలేక మునుకోటి చిన్నారావు (60) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంటల సాగు, కుటుంబ అవసరాల కోసం సుమరు రూ. నాలుగు లక్షలు అప్పు చేశారు. తండ్రి చేసిన అప్పుతో తనకు సంబంధం లేదని కుమారుడు చెప్పడంతో చిన్నారావు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దీంతో పశువుల పాకలో ఉరివేసుకొని మృతి చెందారు.

కోటి విరాళం చెల్లించే వారికి టిటిడి ఆఫర్లు

- ప్రతి ఏడాది మూడురోజులు సుప్రభాతం, బ్రేక్దర్శనం
- జీవితకాలంలో దాతతో పాటు నలుగురికి అవకాశం

ప్రజాశక్తి – తిరుమల

తిరుమల శ్రీవారికి రూ. కోటి విరాళం ఇచ్చే భక్తులకు టిటిడి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు టిటిడి తెలిపింది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజులలో మినహా మిగిలిన రోజులలో విరాళం ఇచ్చిన దాతలు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది. రూ. కోటి విరాళం ఇచ్చే దాతలకు జీవితకాలంలో దాతతో పాటు నలుగురికి ప్రతి ఏడాదీ మూడు రోజులు సుప్రభాత సేవ, మూడు రోజులు బ్రేక్ దర్శనం, నాలుగురోజుల పాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా శ్రీవారి దర్శనం చేసుకోవచ్చు. వీటితోపాటు పది పెద్ద లడ్డూలు, 20 చిన్న లడ్డూలు, ఒక దుప్పటి, ఒక రవికే, పది మహా ప్రసాదం ప్యాకెట్లు, ఒకసారి వేద ఆశీర్వచనం వంటి సౌకర్యాలను పొందవచ్చు. వీటితో పాటుగా రూ. మూడు వేలు రుసుం విలువ చేసే వసతి గదుల సదుపాయం మూడు రోజులు కల్పిస్తారు. అంతేకాక జీవిత కాలంలో ఒకసారి దాతకు ఒక ఐదు గ్రాముల శ్రీవారి బంగారు డాలర్, 50 గ్రాముల ఒక సిల్వర్ డాలర్ను తగిన ఆధారాలను కార్యాలయం వారికి చూపించి పొందవచ్చని తెలిపింది.

విరాళాలివ్వాల్సిన ట్రస్టులు

దాతలు కింద కనబరిచిన టిటిడి ట్రస్ట్లకు విరాళాలు ఇవ్వవచ్చు. కాటేజ్ డొనేషన్ స్కీం, ఎస్వి ప్రాణదాన ట్రస్ట్, ఎస్వి విద్యాదాన ట్రస్ట్, బర్డ్ ట్రస్టు, శ్రీవేంకటేశ్వర అన్నదాన ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయాస్ ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ ట్రస్ట్, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినీ స్కీమ్ (స్విమ్స్) లకు దాతలు విరాళాలు చెల్లించి సంబంధింత సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్సైట్లో విరాళాలు చెల్లించవచ్చని పేర్కొంది. ఆఫ్లైన్లో ఇఒ, టిటిడి పేరిట డిడి/ చెక్కులను అందజేయవచ్చని ఓ ప్రకటనలో పేర్కొంది.

బుడమేరు ఆధునీకరణ

- గండ్లు పూడ్చివేతకు టెండర్లు
- మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

బుడమేరు ఛానల్ను త్వరలో ఆధునీకరిస్తామని, గండ్లు పూడ్చివేతకు టెండర్లు త్వరలో ఖరారు చేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం ఉదయం వెలగపూడి సచివాలయంలో బుడమేరు పనులపై సమీక్ష నిర్వహించారు. మూడుచోట్ల గండ్లు పడ్డాయని, రూ.39.05 కోట్లతో త్వరలో టెండర్లు పిలిచి పనులు అప్పగిస్తామని అన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో డైవర్షన్ ఛానల్ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా రూ.464 కోట్లతో పనులు అప్పగించి 80 శాతం పూర్తి చేశామని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నిధులున్నా పనులు చేయలేదన్నారు. ఎనికేపాడు నుండి కొల్లేరు వరకూ వెళ్లే ఛానల్ ఆధునీకరణ పనులనూ రద్దు చేశారని తెలిపారు. పనులకు సంబంధించి వెంటనే యాక్షన్ ప్లాను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం ఛానల్ సామర్థ్యాన్ని పెంచే ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇఎన్సి వెంకటేశ్వరరావు, సిఇ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి – యంత్రాంగం

ఠారెత్తిస్తోన్న ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు కాస్తంత ఉపశమనం లభించింది. గురువారం మధ్యాహ్నం పలు జిల్లాల్లో చిరు జల్లులు పడ్డాయి. మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పిడుగుపాటుకు కర్నూలులో ఒకరు, అనంతపురంలో ఒకరు మరణించారు. అనంతపురంలో సాయంత్రం 5–30 గంటల నుంచి రాత్రి 8–30గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయం అయ్యాయి. మురుగునీటి కాలువలు పొంగిపొర్లడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో గంటపాటు వర్షం కురవడంతో యాత్రికులు వసతి సముదాయాలకే పరిమితమయ్యారు.గుంటూరులో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. పిడుగుపాటుకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెందిన రవి (15) మరణించారు. పొలంలో పనులు చేసుకుంటుండగా ఆయనకు సమీపంలో పిడుగుపడింది. దీంతో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు పొలంలో పని చేస్తున్న పలువురికి గాయాలయ్యాయి. వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కదిరిపల్లి గ్రామానికి చెందిన ఇంద్రజ (25) తన భర్త వెంకటరమణతో కలిసి పొలం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా కురిసిన వర్షానికి తోడు పిడుగు పడింది. ఈ ప్రమాదంలో ఆమె మరణించారు.

పెళ్లి కావడం లేదని తల్లిని చంపిన కొడుకు

ప్రజాశక్తి – వినుకొండ (పల్నాడు జిల్లా)

తనకు పెళ్లి సంబంధం కుదరకపోవడానికి తల్లే కారణమని భావించిన కొడుకు ఆమెను దారుణంగా హతమార్చిన ఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరులో గురువారం జరిగింది. వినుకొండ రూరల్ సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లటూరు గ్రామానికి చెందిన సోమమ్మ (65)కు ఐదుగురు సంతానం కలరు. చిన్న కుమారుడైన బాదరయ్యకు కొంతకాలంగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే అతని తల్లి సోమమ్మకు మతిస్థిమితం సరిగా లేదనే కారణంగా సంబంధాలు కుదరడం లేదు. ఈ విషయమై గురువారం ఇంట్లో గొడవ పెట్టుకున్న బాదరయ్య తన తల్లిపై దాడి చేయడంతో ఆమె మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బండ్లమోటు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మూడేళ్లలో రూ.1300 కోట్ల పెట్టుబడులు


- రెట్టింపు ఆదాయం లక్ష్యం
- బిర్లానూ సిఇఒ అక్షత్ సేత్ వెల్లడి

ప్రజాశక్తి – హైదరాబాద్



సికె బిర్లా గ్రూప్లో భాగమైన నిర్మాణ రంగ మెటీరియల్స్ సొల్యూషన్స్ విభాగం బిర్లానూ లిమిటెడ్ వచ్చే మూడేళ్లలో రూ.1300 కోట్ల పెట్టుబడుల వ్యయం చేయనున్నట్లు వెల్లడించింది. గురువారం హైదరాబాద్లో బిర్లానూ సిఇఒ అక్షత్ సేత్ మీడియాతో మాట్లాడుతూ.. అదే సమయంలో కంపెనీ ఆదాయాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంస్థను బిలియన్ డాలర్లకు చేర్చాలని నిర్దేశించుకున్నామన్నారు. పైపులు, నిర్మాణ రంగంలో ఉపయోగించే రసాయనాల వ్యాపార విభాగాలు కీలక వృద్ధిని సాధించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అంతర్జాతీయ ఇంటీరియర్స్ బ్రాండ్ పారాడోర్ వ్యాపారం కూడా వచ్చే మూడు, నాలుగేళ్లలో రెట్టింపు కాగలదన్నారు. అర్జెంటినా, జర్మనీ సహా భారత్లో మొత్తంగా 32 తయారీ యూనిట్లను కలిగి ఉన్నామన్నారు.

ఆ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ విజయ్ లహోటి మాట్లాడుతూ.. తమ కంపెనీ 1946లో హెచ్ఐఎల్ లిమిటెడ్ పేరుతో తొలి తయారీ యూనిట్ను హైదరాబాద్లో నెలకొల్పిన విషయాన్ని గుర్తు చేశారు. హెచ్ఐఎల్ లిమిటెడ్ను ఇటీవలే బిర్లానూ లిమిటెడ్గా మార్చామని వెల్లడించారు. తమ వ్యాపారంలో తెలుగు రాష్ట్రాలు కీలక వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఇక్కడ ఎఎసి బ్లాక్స్, పానెల్స్, బోర్డ్సు అమ్మకాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. పైపుల రంగంలో ప్రతీ ఏడాది 70 శాతం వృద్ధిని సాధిస్తున్నామన్నారు.



హైదరాబాద్కు కాథే పసిఫిక్ సేవలు పునరుద్ధరణ

ప్రజాశక్తి – హైదరాబాద్

విమానయాన సేవల సంస్థ కాథే పసిఫిక్ హైదరాబాద్ నుంచి హాంకాంగ్కు నాన్ స్టాప్ ప్రయాణాలను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఇది భారత్లో తమ నెట్వర్క్ను మరింత బలోపేతం చేయనుందని కాథే దక్షిణాసియా రీజినల్ జనరల్ మేనేజర్ రాకేష్ రైకర్ తెలిపారు. గురువారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాథే పసిఫిక్ ఇప్పుడు ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నయ్ల నుంచి సేవలు అందిస్తోందని.. తాజాగా హైదరాబాద్ నుంచి ఈ సేవలు తిరిగి ప్రారంభం కావడంతో భారత్లో ఐదు నగరాల నుంచి సంస్థ స్వస్థలమైన హాంకాంగ్కు అనుసంధానించే కీలక క్యారియర్గా తన పాత్రను పటిష్టం చేస్తుందన్నారు.

ఎఐ వల్లే జొమాటోలో ఉద్వాసనలు

న్యూఢిల్లీ: కృత్రిమ మేధా (ఎఐ) వల్లే జొమాటోలో వందలాది ఉద్యోగులు ఊడినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఆ కంపెనీ 600 మంది కస్టమర్ సపోర్ట్ ఉద్యోగులను తీసేసిన విషయం తెలిసిందే. ఎఐ ప్రభావంతో ఇంకెంతమంది ఉద్యోగాలు ఊడొచ్చోనని వారు ఆందోళనలో ఉన్నారు. చాలా మంది ఉద్యోగులను మార్చడానికి జొమాటో అసోసియేట్ ఆక్సలరేటర్ ప్రోగ్రామ్ అనే ప్లాన్ను ఆ సంస్థ అమలు చేస్తోంది. దీనివల్ల ఉద్యోగంలో చేరిన ఏడాదికే చాలా మందిని తీసేశారు. గురుగామ్, హైదరాబాద్ ఆఫీసుల్లో పనిచేసిన చాలా మంది ఉద్యోగాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

మోటాన్ కార్యకలాపాల విస్తరణ

చెన్నయ్ : ప్లాస్టిక్ ప్రాసెసింగ్ పరిశ్రమ వినూత్న పరిష్కారాలను అందించే మోటాన్ గ్రూప్ భారత్లో తన కార్యకలాపాలను విస్తరించినట్లు తెలిపింది. చెన్నయ్లో తమ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ వ్యూహాత్మక విస్తరణ భారతీయ ప్లాస్టిక్ రంగం పెరుగుతున్న డిమాండ్లను తీర్చడంలో కీలక పాత్ర పోషించనుందని పేర్కొంది. నూతన ప్లాంట్ కోసం దాదాపు రూ.17 కోట్ల పెట్టుబడులు పెట్టామని తెలిపింది.

భారత్‌కు టారిఫ్‌ల ముప్పు

- ఎగుమతులకు దెబ్బ
- జిడిపి అర శాతం పడిపోవచ్చు
- వ్యవసాయంపైనా ప్రభావం
- మార్కెట్లకు నష్టాలు
- పరిశీలిస్తున్నామన్న వాణిజ్యమంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత సన్నిహితుడిననే చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై టారిఫ్‌ల పిడుగు వేశారు. ఈ దెబ్బతో భారత్‌కు చెందిన అనేక రంగాలు ప్రతికూలతను ఎదుర్కొనున్నాయి. ముఖ్యంగా ఎంఎస్ఎంఇ, అభరణాలు, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల ఎగుమతులు తీవ్ర ముప్పును ఎదుర్కొనున్నాయని ఆ రంగం నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు. మరోవైపు సుంకాలతో భారత జిడిపి అర శాతం పడిపోనుందని హెచ్చరిస్తోన్నారు. ఏప్రిల్ 2న భారత్‌పై 27 శాతం సుంకాలు విధిస్తోన్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయనుందనే విశ్లేషణలు, హెచ్చరికలు ఊపందుకున్నాయి.



అమెరికా ప్రతీకార టారిఫ్‌లతో చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఇ) ఎగుమతులు తీవ్రంగా పడిపోవచ్చని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ) ప్రెసిడెంట్ ఎస్‌సి రాల్హన్ అన్నారు. 10 శాతం వరకు సుంకాలు ఫర్వాలేదని, అంతకు మించి పెంచడం ద్వారా ఇబ్బందులు ఎదురుకానున్నాయన్నారు. అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తుల డిమాండ్‌పై టారిఫ్‌ల ప్రభావం కచ్చితంగా ఉంటుందన్నారు. దిగుమతి సుంకాలపై అనిశ్చితి వల్ల ఇప్పటికే కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లు ఇవ్వడాన్ని తాత్కాలికంగా నిలిపివేశారన్నారు. ప్రభుత్వమే చొరవ తీసుకుని పరిస్థితిని సరిదిద్దాలని, టారిఫ్‌ల సమస్యను ఎదుర్కొనడంలో ఎగుమతిదార్లకు మద్దతుగా నిలవాలని రాల్హన్ కోరారు.

భారత ఆర్థిక వ్యవస్థను యుఎస్ సుంకాలు దెబ్బతీయనున్నాయని ఇవై చీఫ్ పాలసీ అడ్వైజర్ డికె శ్రీవాస్తవ హెచ్చరించారు. వీటితో భారత జిడిపి 50 బేసిస్ పాయింట్లు తగ్గి 6 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించారు. అదే విధంగా అమెరికాకు చేసే ఎగుమతుల్లో 2-3 శాతం క్షీణత ఉండొచ్చన్నారు.

"ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమతులపై అత్యధిక ప్రభావం పడొచ్చు. భారత రొయ్యలు, ఇతర సముద్ర ఆహార ఉత్పత్తులకు అమెరికా ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అక్కడి మార్కెట్‌లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో డిమాండ్ పడిపోనుంది." అని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) పేర్కొంది. అదే విధంగా డెయిరీ ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరడంతో అక్కడ వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు పెరుగుతాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది.

అభరణాలపై..

భారత ఎగుమతుల్లో అభరణాలు కీలక వాటా కలిగి ఉన్నాయి. ప్రతీ ఏడాది అమెరికాకు భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు ఎగుమతి అవుతున్నాయి. వీటిపై 13.32 శాతానికి చేరనున్న సుంకంతో భారత ఉత్పత్తులు అమెరికాతో పోటీ పడలేవు. దీంతో ఈ రంగంలోని ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది. భారత మొత్తం టెక్స్‌టైల్ ఎగుమతుల్లో అమెరికా వాటా 28 శాతంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతయ్యాయి. వీటిపైనా ప్రతికూల ప్రభావం పడనుంది.

చెప్పులనూ వదల్లేదు..

పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం తీవ్రంగా పడనుందని తెలుస్తోంది. 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు అమెరికాకు ఎగమతి అవుతున్నాయి. వీటిపైనా సుంకాలను 15.56 శాతం మేర పెంచడంతో ఈ రంగం దిగాలు పడనుంది. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తోన్నాము. ఈ రంగంపైనా టారీఫ్‌లను పెంచడంతో అక్కడ భారత ఉత్పత్తులు ప్రియం కావడంతో ప్రజలు కొనుగోళ్లను తగ్గించనున్నారు. అంతిమంగా భారత్‌లోని తయారీపై, విదేశీ మారకంపై ప్రభావం పడనుంది.

యుఎస్‌తో చర్చిస్తున్నాం : వాణిజ్య మంత్రిత్వ శాఖ

అమెరికా పెంచిన సుంకాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రానున్న అదనపు 27 శాతం పన్ను టారీఫ్‌లను ఎలా అమలు చేస్తోరో విశ్లేషిస్తున్నామని పేర్కొంది. ఎగుమతిదారులు, పారిశ్రామిక వర్గాలు, ఇతర వాటాదారులను అభిప్రాయాలను సేకరిస్తున్నామని వెల్లడించింది. అమెరికా నూతన వాణిజ్య విధానం వల్ల కొత్త అవకాశాలను అధ్యయనం చేస్తోన్నామని తెలిపింది. ఈ పన్నులపై అమెరికా వాణిజ్య బృందాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్లు వెల్లడించింది.

మార్కెట్లకు నష్టాలు

ట్రంప్ టారీఫ్‌లు భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటి, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు నెలకొన్నాయి. బిఎస్ఇ సెన్సెక్స్ గురువారం ఉదయం నష్టాల్లో ప్రారంభమై.. తుదకు 322 పాయింట్లు కోల్పోయి 76,295కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 82 పాయింట్ల నష్టంతో 23,250 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో టిసిఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్ షేర్లు అధిక నష్టాలు చవి చూసిన వాటిలో ఉన్నాయి. మరోవైపు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టిపిసి, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కిన బిల్లు

- క్రైస్తవుల పేరుతో మొసలి కన్నీరు
- సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లౌకికవాదం, సమానత్వం, ప్రజాస్వామ్యం వంటి రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిందని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో వక్ఫ్ సవరణ చట్టంపై చర్చలో పాల్గొంటూ ఆయన మాట్లాడారు. 2014 మేనిఫెస్టోలో బిజెపి వక్ఫ్ ఆస్తులను కాపాడతామని, వక్ఫ్ బోర్డులకు అధికారం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు వారు ఆ హామీని విస్మరించారని విమర్శించారు. మతం పేరుతో ప్రజలను విభజించిన బిజెపి, కేంద్ర ప్రభుత్వం దేవుళ్ల పేరుతో కూడా విభజన సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. వక్ఫ్‌లకు వర్తించే నిబంధనలు దేవస్థానాలకు వర్తించవని ఏ ప్రాతిపదికన చెబుతున్నారు? ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు దేశ అంతర్గత శత్రువులు అనే ప్రతిచర్యాత్మక ఆలోచనపై కూడా వక్ఫ్ బిల్లు ఆధారపడి ఉందని విమర్శించారు. వక్ఫ్ కౌన్సిల్, బోర్డు ముస్లిమేతర సభ్యులతో సీట్లను భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని బ్రిట్టాస్ విమర్శించారు. వక్ఫ్ బిల్లు పేరుతో క్రైస్తవుల పేరుతో మొసలి కన్నీరు కార్చే వారిని చూసుకునే జ్ఞానం మలయాళీలకు ఉందన్నారు. "దేశంలో ప్రతిరోజూ క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయి." ఈరోజు జబల్పూర్‌లో క్రైస్తవులపై దాడి జరిగింది. గత ఏడాది మాత్రమే క్రైస్తవులపై 700 దారుణాలు జరిగాయి. మణిపూర్‌లో 200కి పైగా చర్చిలు తగలబెట్టబడ్డాయి. గత రెండు మూడు రోజులుగా కేంద్ర ప్రభుత్వం 'క్రైస్తవుడు... క్రీస్తు... మునాంబం' అని చెబుతోంది. కానీ ఈ వ్యక్తులు స్టాన్ స్వామిని ఏమి చేశారో మనం మర్చిపోగలమా? పార్కిన్సన్స్ వ్యాధి వల్ల చుక్క నీళ్లు కూడా తాగలేక, స్టాన్‌స్వామిని జైలులో పెట్టి చంపలేదా? గ్రాహం స్టెయిన్స్ గురించి మనం మరచిపోగలమా? వాళ్ళు అతన్ని, అతని పిల్లలతో సహా కాల్చి చంపలేదా? ఇంకా చాలా చోట్ల దాడులు జరగడం లేదా? బిజెపిలో ఎంపురాన్ సినిమాలోని 'మున్నా' లాంటి పాత్రలు ఉన్నాయి. ఆ గ్రామంలో ఒక్కరు కూడా తమ ఇంటిని కోల్పోరు. ఇది వామపక్ష ప్రభుత్వ హామీ. ఐదు లక్షల మంది నిరాశ్రయులైన ప్రజలకు ఇళ్లు కల్పించే బలం, శక్తి, నిజాయితీ వామపక్షాలకు ఉంది. ముందు వరుసలో ఉన్న ప్రజలను రక్షించాల్సిన బాధ్యత మనపై ఉంది. మేము దానిని నెరవేరుస్తాం. మాకు మీ సహాయం ఏమీ అవసరం లేదు. మసీదును కప్పి ఉంచినట్లుగా కేరళలోని ఏ ప్రార్థనా స్థలాన్ని కూడా కప్పి ఉంచాల్సిన అవసరం ఉండదు. కేరళలో అందరూ సోదరభావంతో జీవించగల వాతావరణం ఉంది. మేము దానిని నిర్వహిస్తాము. "మునాంబం" అంటే "మునాంబం" అని చెప్పుకునే వారు ఉత్తర భారతదేశం నుండి పదివేల మందిని తరిమికొట్టారు. ఎన్ని మసీదులు కూల్చివేయబడ్డాయి? "కేంద్ర ప్రభుత్వానికి భారత రాజ్యాంగంపై కనీస విశ్వాసం ఉంటే, అది వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి" అని బ్రిట్టాస్ డిమాండ్ చేశారు.



భారత్, థాయిలాండ్ మధ్య సాంస్కృతిక బంధం !

- థాయి రామాయణాన్ని వీక్షించిన ప్రధాని మోడీ
- ప్రధాని షినవ్రతతో భేటీ



బ్యాంకాక్ : ఆరవ బిమ్స్‌టెక్ సదస్సులో పాల్గొనేందుకు రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ థాయిలాండ్ ప్రధాని పెటొంగ్‌టార్న్ షినవ్రతతో చర్చలు జరిపారు. ఉదయం ఆయన ఇక్కడకు చేరుకున్న వెంటనే గౌరవ వందనం స్వీకరించారు. థాయి రామాయణ్ ప్రదర్శనను తిలకించారు. భారత్, థాయిలాండ్ భవిష్యత్ భాగస్వామ్యానికి ఒక మార్గాన్ని రూపొందించడంపై ఇరువురు నేతలు విస్తృతాంశాలపై చర్చించారని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ పోస్టులో తెలిపారు. భారత్, థాయిలాండ్ మధ్య గల సుసంపన్నమైన నాగరిక సంబంధాలను రామాయణ ప్రదర్శన కనబరిచిందని ప్రధాన మంత్రి కార్యాలయం ఎక్స్ పోస్టులో పేర్కొంది. "ఎవరికీ లేని ఒక సాంస్కృతిక బంధం ! ఆకర్షణీయమైన థాయి రామాయణ ప్రదర్శనను వీక్షించాం. ఇరు దేశాల మధ్య గల సాంస్కృతిక, నాగరిక సంబంధాలను అందంగా, అద్భుతంగా ప్రదర్శించిన ఇదొక మంచి అనుభవం." అని ప్రధాని మోడీ ఎక్స్ పోస్టులో వ్యాఖ్యానించారు. ఆసియాలోని అనేక ప్రాంతాల్లో ప్రజల హృదయాలను, సాంప్రదాయాలను ఈ రామాయనం కలుపుతుందని మోడీ పేర్కొన్నారు. సాయంత్రం బిమ్స్‌టెక్ సదస్సులో భాగంగా థాయిలాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల నేతలను కలుసుకున్నారు. బంగాళాఖాతం ప్రాంతంలో ప్రాంతీయాభివృద్ధి, అనుసంధానత, ఆర్థిక ప్రగతిని పెంపొందించే వేదిక బిమ్స్‌టెక్ అని మోడీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సముద్ర జలాల సహకారంపై ఒప్పందం కుదుర్చుకోనున్నారు. థాయిలాండ్‌లో పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ శ్రీలంక వెళతారు.

నేపాల్‌లో తగ్గుతున్న దారిద్ర్య రేటు

ఖాట్మండు : ప్రస్తుత సంవత్సరంలో నేపాల్ దారిద్ర్య రేటు 5.6శాతానికి తగ్గుతుందని ప్రపంచ బ్యాంక్ భావిస్తోంది. నేపాలీయుల రోజువారీ ఆదాయం 3.65 అమెరికా డాలర్లుగా వుంది. గత దశాబ్ద కాలంలో పేదరిక నిర్మూలనకు నేపాల్ చేస్తున్న కృషిని ప్రపంచ బ్యాంక్ ప్రశంసించింది. 2022లో 7.5శాతంగా వున్న పేదరికం రేటును ప్రస్తుత సంవత్సరంలో 5.6కి తగ్గించడం ద్వారా గణనీయమైన పురోగతిని సాధించిందని పేర్కొంది. 'దుర్భర దారిద్ర్యం (రోజుకు 2.15 డాలర్లు) దాదాపుగా కనుమరుగైంది.' అని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. నేపాల్ అభివృద్ధిపై తాజా సమాచారం పేరుతో వెలువరించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. పేదరికాన్ని తగ్గించడంలో వలసలు, చెల్లింపుల ముఖ్య పాత్ర పోషించాయని పేర్కొంది. నేపాల్ వ్యాప్తంగా పలు కోణాల్లో ప్రమాణాలు మెరుగుపడ్డాయని నివేదిక పేర్కొంది. విద్యుత్ సదుపాయం చాలామందికి అందుబాటులోకి వచ్చిందని, ప్రభుత్వ ఆస్పత్రులకు దూరాలు తగ్గాయని, మరింత విస్తారంగా రహదారుల సౌకర్యాలు వచ్చాయని పేర్కొంది. అయితే ఇంకా అనేక సవాళ్ళు మిగిలే వున్నాయని నివేదిక హెచ్చరించింది.

ట్రంప్ టారిఫోన్మాదం

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్ గతంలోనే ప్రకటించారు. 'అమెరికా చరిత్రలోని ముఖ్యమైన రోజులలో ఇది ఒకటి. ఇది మా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రకటించిన సందర్భం. అనేక సంవత్సరాలుగా కష్టజీవులైన అమెరికా ప్రజలు నిర్లక్ష్యానికి గురి కావాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు అభివృద్ధి చెందేందుకు మాకు సమయం లభించింది' అని ఆయన తెలిపారు. ఇప్పుడు విధించినవి 'రాయితీతో కూడిన' సుంకాలని ట్రంప్ చెప్పుకున్నారు. అమెరికాపై ఆయా దేశాలు విధిస్తున్న సుంకాలలో ఇవి సగం మాత్రమేనని చెప్పారు.

భారత్‌పై విసుర్లు

శ్వేతసౌధం నుండి చేసిన ప్రసంగంలో ట్రంప్ మరోసారి భారత్ విధిస్తున్న అధిక టారిఫ్‌లను ప్రస్తావించారు. 'భారత్ చాలా చాలా కఠినంగా ఉంటోంది. అవును చాలా చాలా కఠినంగా. ప్రధాని ఇటీవలే మన దేశంలో పర్యటించి వెళ్లారు. ఆయన నాకు చాలా గొప్ప స్నేహితుడు. మీరు నాకు స్నేహితులే కానీ మమ్మల్ని సరిగా చూడడం లేదని నేను ఆయనకు చెప్పాను. వారు మాపై 52 శాతం సుంకం విధిస్తున్నారు. మీరు ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. చాలా సంవత్సరాలుగా...దశాబ్దాలుగా మేము వారిపై ఎలాంటి సుంకాలు విధించడం లేదు. ఏడు సంవత్సరాల క్రితం మాత్రమే...నేను అధికారంలోకి వచ్చినప్పుడు చైనాతో ప్రారంభించాను' అని అన్నారు. ఇతర దేశాల మోటారు సైకిల్స్‌పై తాము 2.4 శాతం టారిఫ్ విధిస్తే భారత్ మాత్రం 70 శాతం విధించిందని చెప్పారు. కాగా ట్రంప్ ప్రకటనపై భారత్ ఇప్పటి వరకూ అధికారికంగా స్పందించలేదు.

వాణిజ్య లోటును తగ్గిస్తాయి

తాజాగా విధించిన సుంకాలు తమ వాణిజ్య లోటును తగ్గిస్తాయని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. గతంలో సుంకాల నుండి మినహాయించిన స్టీల్, అల్యూమినియం, మోటారు వాహనాలను తాజాగా టారిఫ్ పరిధిలో చేర్చారు. ప్రతి దేశానికీ కనీస బేస్‌లైన్ టారిఫ్‌ను పది శాతంగా నిర్ణయించినప్పటికీ అనేక దేశాలపై దాని కంటే ఎక్కువగానే సుంకాలు విధించారు. చైనా దిగుమతులపై మొత్తంగా 54 శాతం సుంకం వేశారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రిటన్ ఉత్పత్తులపై పది శాతం టారిఫ్ మాత్రమే విధించారు. కెనడా, మెక్సికోలను ప్రస్తుతానికి ప్రతీకార సుంకాల నుండి మినహాయించారు. అయితే ఆ దేశాల నుడి దిగుమతి అయ్యే వస్తువులపై మరో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా పాతిక శాతం టారిఫ్ విధించారు. అమెరికా విధించిన టారిఫ్‌లపై కెనడా, ఇయు, చైనా తీవ్రంగా స్పందించాయి. తాము కూడా అదే విధంగా అధిక సుంకాలతో సమాధానం చెబుతామని స్పష్టం చేశాయి.

అమెరికాలో పెరగనున్న ధరలు

ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాల కారణంగా విదేశాలపై పడే ప్రభావం ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేము కానీ అమెరికాలో మాత్రం కొన్ని వస్తువుల ధరలు పెరగబోతున్నాయి. ఆటో దిగుమతులపై ట్రంప్ గతంలోనే పాతిక శాతం సుంకంప్రకటించారు. దానితో పాటు దిగుమతి చేసుకునే వస్తువులపై మరో 10 శాతం సుంకం విధిస్తారు. అమెరికాలో ఉత్పత్తి అవుతున్న కొన్ని వాహనాలలో ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకున్న విడిభాగాలు కూడా ఉన్నాయి కాబట్టి వాటిపై టారిఫ్ ప్రభావం పడుతుంది. అంటే కార్ల కొనుగోలు ధరలు పెరుగుతాయన్న మాట. ఇక అమెరికాలోని స్టోర్స్‌లో అమ్మే దుస్తులు, బూట్లు ఎక్కువగా ఇతర దేశాలలో...ముఖ్యంగా చైనా, వియత్నాం, బంగ్లాదేశ్‌లో తయారైనవే. ఈ మూడు దేశాల పైన ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లు విధించినందున వాటి ధరలు కూడా పెరుగుతాయి. ఇటాలియన్, ఫ్రెంచ్ వైన్లు, స్కాటిష్ విస్కీ ధరలు కూడా పెరగవచ్చు. ఇవి ఎక్కువగా యూరోపియన్ యూనియన్, బ్రిటన్ నుండి దిగుమతి అవుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం సుంకాలు విధించిన బ్రెజిల్, కొలంబియా నుండి అమెరికాకు కాఫీ, చాక్లెట్లు దిగుమతి అవుతున్నాయి. కాబట్టి వాటి ధరలూ పెరుగుతాయి. మెక్సికో నుండి దిగుమతి అవుతున్న అవకాడో ధరలు కూడా పెరుగుతాయి. అమెరికాకు ముడి చమురును సరఫరా చేసే దేశాలలో కెనడాదే ప్రథమ స్థానం. దానిపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించడంతో దాని ధరలు కూడా పెరగబోతున్నాయి.

ఎగుమతిదారుల ఆందోళన

భారత ఉత్పత్తులపై అమెరికా 26 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో దేశీయ ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (బిటిఎ) త్వరగా కుదుర్చుకొని తమకు ఊరట కల్పించాలని వారు కేంద్రాన్ని కోరారు. 'అమెరికా విధించిన సుంకాలు సవాళ్ల విసురుతున్నాయి. అయితే ఇతర దేశాలతో పోలిస్తే మనకు కొంత సానుకూలత కన్పిస్తోంది. ఉదాహరణకు వియత్నాం, చైనా, ఇండోనేషియాపై అమెరికా అధిక టారిఫ్ విధించింది. కీలక పోటీదారులైనవియత్నాం, చైనా, ఇండోనేషియా, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్ కంటే మనం మెరుగైన స్థితిలోనే ఉన్నాము. దుస్తులు, రత్నాలు-ఆభరణాలు, తోలు, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ప్లాస్టిక్స్, ఫర్నీచర్ వంటి కొన్ని రంగాల నుండి ఇతర దేశాలకు ఎగుమతులు జరగవచ్చు. భారత్, అమెరికా మధ్య బిటిఎ సకాలంలో కుదిరితే దేశీయ ఎగుమతిదారులకు కొంత ఊరట లభిస్తుంది' అని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్టర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఐఇఒ) డైరెక్టర్ జనరల్, సిఇఒ అజయ్ సహాయ్ తెలిపారు. సుంకాల కారణంగా అమెరికాకు ఇంజినీరింగ్ ఎగుమతులు తగ్గవచ్చునని ఇఇపిసి ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అదిప్ మిత్రా చెప్పారు. మన దేశం నుండి ఎగుమతి అయ్యే ఉక్కు, ఉక్కు ఉత్పత్తులు, అల్యూమినియం-దాని ఉత్పత్తులు, ఆటో విడిభాగాలు, ఎలక్ట్రికల్ యంత్రాలు-సామగ్రి, పారిశ్రామిక యంత్రాలకు బాగా దెబ్బ తగులుతుందని ఆయన అన్నారు. ఈ పరిస్థితులలో ఈయూ, బ్రిటన్, కెనడా, జిసిసితో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. ఆసియా నుండి అమెరికాకు జరుగుతున్న దుస్తులు, జౌళి సరఫరాలకు విఘాతం కలుగుతుందని కాటన్ టెక్స్‌టైల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ రాజగోపాల్ చెప్పారు. ఈ ఉత్పత్తులు అనతి కాలంలోనే దక్షిణ అమెరికాతో పాటు యూరప్, టర్కీ ప్రాంతాలకు ఎగుమతి అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. కాగా సుంకాల భారాన్ని ఎలాగోలా తట్టుకుంటామని బియ్యం ఎగుమతిదారులు చెబుతున్నారు. అమెరికాలో బియ్యాన్ని వాడే వారిలో ఎక్కువ మంది అక్కడ నివసిస్తున్న భారతీయులేనని వారు గుర్తు చేశారు.

ఆస్తుల వివరాలు బహిరంగ పర్చనున్న 'సుప్రీం' జడ్జీలు

న్యూఢిల్లీ : భారత ప్రధాన న్యాయమూర్తితో సహా సుప్రీంకోర్టు జడ్జీలంతా తమ ఆస్తుల వివరాలను బహిరంగపర్చనున్నారు. ఈ నెల 1 జరిగిన ఫుల్ కోర్ట్ మీటింగ్‌లో న్యాయమూర్తులు ఈ మేరకు ఒక అంగీకారానికి వచ్చారు. సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్ ద్వారా జడ్జీలు తమ ఆస్తులను బహిరంగ పర్చడానికి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ ఆస్తుల ప్రకటన స్వచ్ఛంద ప్రాతిపదికన ఉంటుందని వెబ్‌సైట్ గురువారం తెలిపింది. 'సుప్రీంకోర్టు న్యాయమూర్తులందరూ తమ విధులను చేపట్టే సందర్భంలో లేదా ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో ఆస్తులను వివరాలను వెల్లడిస్తారు' అని వెబ్‌సైట్ తెలిపింది. అలాగే ప్రధాన న్యాయమూర్తి కూడా తమ ఆస్తులను ప్రకటిస్తారని వెల్లడించింది. ఇటీవల ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీగా నోట్ల కట్టలు దొరకడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. విధివిధానాలు ఖరారైన తరువాత జడ్జీలు తమ ఆస్తులను ప్రకటించనున్నారు. కాగా, ఇప్పటి వరకూ జడ్జీలు తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి సమర్పిస్తున్నారు.

మోడీ ప్రభుత్వం నోరు విప్పాలి : రాహుల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమెరికా విధించిన సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాలు దేశ ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా ఆటో పరిశ్రమ, ఔషధాలు, వ్యవసాయ వంటి రంగాలను పూర్తిగా నాశనం చేయబోతున్నాయని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం అమెరికాను మన మిత్ర దేశంగా చెబుతోందని, ఆ మిత్ర దేశం మనపై విధిస్తున్న సుంకాలపై మోడీ ప్రభుత్వం నోరు మెదపడం లేదని ఆయన విమర్శించారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బ

- యురోపియన్ యూనియన్

బ్రస్సెల్స్ : యురోపియన్ యూనియన్‌తో సహా యావత్ ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎదురుదెబ్బ అని యురోపియన్ కమిషన్ (ఇసి) అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ వ్యాఖ్యానించారు. "అనిశ్చిత వ్యాప్తి చెందుతుంది. రక్షణ వాద చర్యలు మరింత పెరగడానికి దారి తీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రజలు విపత్కర పర్యవసానాలు ఎదుర్కొంటారు." అని వ్యాఖ్యానించారు.

అమెరికాతో చర్చిస్తాం : చైనా

"కీలకమైన ఆర్థిక, వాణిజ్య అంశాలపై అమెరికాతో చర్చలకు చైనా సుముఖంగా వుంది. సమాన స్థాయిలో చర్చలు, సంప్రదింపుల ద్వారా పరస్పర ఆందోళనలను పరిష్కరించుకుందాం." అని చైనా వాణిజ్య శాఖ ప్రతినిధి హె యాడాంగ్ చెప్పారు.

ట్రంప్‌కు పోటీగా బ్రెజిల్ బిల్లు

ట్రంప్ సుంకాలు ప్రకటించిన గంటల వ్యవధిలోనే బ్రెజిల్ కాంగ్రెస్ ఒక బిల్లును ఆమోదించింది. విదేశీ ఆంక్షలకు వ్యతిరేకంగా పరస్పర వాణిజ్య, పర్యావరణ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వాన్ని అనుమతిస్తూ ఈ బిల్లు రూపొందించారు. ఈ బిల్లును అధ్యక్షుడు ఇంకా ఆమోదించాల్సివుంది. అయితే చర్చలకు, సంప్రదింపులకు బ్రెజిల్ సిద్ధంగా వుందని అధికారులు తెలిపారు.

దక్షిణాఫ్రికా ఆందోళన

అమెరికా చర్యలపై దక్షిణాఫ్రికా గురువారం ఆందోళన వ్యక్తం చేసింది. వాణిజ్యానికి, భాగస్వామ్య సంక్షేమానికి ఇవొక అవరోధమని వ్యాఖ్యానించింది. అమెరికాతో పరస్పర లబ్ది చేకూర్చే వాణిజ్య సంబంధాలకు తాము కట్టుబడి వున్నామని దక్షిణాఫ్రికా అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

'బుల్డోజ్' చేశారు : సోనియా గాంధీ

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ బిల్లును లోక్‌సభలో 'బుల్డోజ్' చేశారని కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ విమర్శించారు. వివాదాస్పద పరిస్థితులు, ఉద్రిక్త వాతావరణం మధ్య లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు- 2024 ఆమోదం పొందిందని అన్నారు. వక్ఫ్ బిల్లు విషయంలో తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని సోనియా గాంధీ తెలిపారు. ఈ బిల్లును రాజ్యాంగంపై దారుణమైన దాడిగా ఆమె అభివర్ణించారు. ఈ బిల్లుపై లోక్‌సభలో 12 గంటల పాటు చర్చించినప్పటికీ ప్రతిపక్షాల సభ్యులకు ఎక్కువగా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ఈ బిల్లు దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మారుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యసభలోవ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ సభ్యులకు సూచించారు. ప్రతిపక్ష పార్టీల సమన్వయంతో రాజ్యసభలో ఈ బిల్లును తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కేవలం కాగితానికి పరిమితం చేస్తూ మోడీ ప్రభుత్వం దేశాన్ని అగాధంలోకి నెడుతోందని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే బిజెపి ప్రధాన ఉద్దేశమని సోనియాగాంధీ ఆరోపించారు. దేశాన్ని తమ నిఘా నేత్రంగా మార్చుకోవాలని మోడీ ప్రభుత్వ ఉద్దేశాన్ని బహిర్గతం చేయాలని నేతలకు సూచించారు.

జెడియు వైఖరికి నిరసనగా ఆ పార్టీ నేత రాజీనామా

వక్ఫ్ బిల్లుపై జెడియు తీసుకున్న వైఖరికి వ్యతిరేకంగా ఆ పార్టీ నాయకుడు మహ్మద్ ఖాసిం అన్సారీ రాజీనామా చేశారు. ఈ బిల్లు దేశంలోని ముస్లింలకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. బిల్లుపై పార్టీ వైఖరితో నిరాశ చెందానని పేర్కొన్నారు. పార్టీకి, తన అన్ని పదవులకు రాజీనామా చేశారు. బీహార్ ముఖ్యమంత్రి, జెడియు అధినేత నితీష్ కుమార్‌కు రాసిన రాజీనామా లేఖలో అన్సారీ తీవ్ర నిరాశను వ్యక్తం చేశారు. పార్టీ వైఖరి లక్షలాది మంది భారతీయ ముస్లింల విశ్వాసాన్ని దెబ్బతీసిందని పేర్కొన్నారు. "నా జీవితంలో చాలా సంవత్సరాలు పార్టీకి ఇచ్చినందుకు నేను నిరుత్సాహపడ్డాను" అని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఉద్వాసనలు

(మొదటి పేజీ తరువాయి)

డిసెంబరు వరకూ మొత్తం నాలుగు విడతల్లో ఈ నిధులు విడుదల చేయనుంది. అయితే, ఈ నిధులను అప్పులు తీర్చడానికి మాత్రమే ఖర్చు చేయాలని నిబంధన విధించింది. పైగా, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల్లో 5,600 మందిని తొలగించాలని, క్వార్టర్ల వారీగా దీనిని అమలు చేయాలని, ప్రతి క్వార్టర్‌కు కనీసం వెయ్యి మందిని తొలగించాలని షరతు పెట్టినట్టు సమాచారం. స్టీల్‌ప్లాంట్‌లో అత్యధిక మంది కార్మికులు ఉన్నారని కేంద్ర ప్రభుత్వ దుష్ప్రచారం చేస్తోంది. వాస్తవానికి టన్ను ఉత్పత్తికి ఇద్దరు ఉండాలి. కానీ, ఒక్కరితో పని చేయిస్తోంది. ఈ వాస్తవాలను మరుగున పర్చి కేంద్ర ప్రభుత్వ కుట్రలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం భాగమై ప్యాకేజీ గొప్పగా ఉందని ఊదరగొట్టింది.

క్రమంగా తగ్గుతూ వస్తోన్న పర్మినెంట్ కార్మికులు

దేశంలో ప్రభుత్వ స్టీల్‌ప్లాంట్లతో పోల్చితే విశాఖ ఆర్ఐఎన్ఎల్ కార్మికులు చాలా వరకు సౌకర్యాలను వదులుకొని ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి 19 వేల ఉద్యోగులు అవసరం కాగా, దీంట్లో 5,212 ఉద్యోగాలు ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్నాయి. ఫిబ్రవరి వరకూ ప్లాంట్‌లో 12,500 మంది పర్మినెంట్ కార్మికులు ఉండేవారు. వారిలో 80 మంది గత నెలలో రిటైరయ్యారు. 1,126 మంది విఆర్ఎస్ తీసుకున్నారు. దీంతో, పర్మినెంట్ కార్మికుల సంఖ్య 11294కు పడిపోయింది. దేశంలోని ప్రభుత్వరంగ స్టీల్‌ప్లాంట్లలో టన్ను ఉత్పత్తిలో కార్మికుల జీతాలకు రూ.10.50 అవుతుంటే, విశాఖలో రూ.9 మాత్రమే అవుతోంది. అంటే ఎక్కడితో పోల్చినా ఇక్కడ జీతాలు తక్కువే. ఒక టన్ను ఉత్పత్తి జరిగే చోట ఇద్దరు కార్మికులు ఉండాలి. విశాఖలో ఒక్కరితోనే పని చేయిస్తున్నారు. దీనినిబట్టి వైజాగ్ స్టీల్‌లో మ్యాన్‌పవర్ తక్కువ. ఉత్పత్తి ఎక్కువ అనేది స్పష్టమవుతోంది. ఇవన్నీ వాస్తవాలు కాగా ఇటీవల బిజెపి రాష్ట్ర నాయకులు సోము వీర్రాజు మాట్లాడుతూ 'స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కార్మికులు అధికంగా ఉండడమే కారణం' అంటూ స్టేట్‌మెంట్ ఇవ్వడం చూస్తే స్టీల్‌ను నట్టేట ముంచాలన్న కేంద్ర ప్రభుత్వ కుట్ర స్పష్టమవుతోంది. విశాఖ ఉక్కు పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం విషయంలో వెనక్కి తగ్గలేదన్నది ఇటీవల కేంద్రం ఒక ఆర్‌టిఐ లేఖకు సమాధానం ఇచ్చినా రాష్ట్రంలోని టిడిపి, జనసేన అగ్రనేతల నుంచీ ఎలాంటి స్పందనా లేదు.

16 నుంచి ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె

తొలగింపులను నిరసిస్తూ ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్టు విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. గురువారం ఎల్ఎంఎం పార్కులో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిలుపుదల చేయాలని ఇటీవల ఒక రోజు సమ్మె చేసినా, కార్మిక శాఖాధికారులు చెబుతున్నా వినకుండా కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీ షరతుల మేరకు మొత్తంగా 5,600 మందిని తొలగిస్తామని ప్లాంట్ యాజమాన్యం చెబుతోందన్నారు. నిరవధిక సమ్మెకు ముందు ఈ నెల ఐదున సాయంత్రం ఆరు గంటలకు కూర్మన్నపాలెం కూడలి వద్దగల ఉక్కు దీక్షా శిబిరం సమీపాన రాస్తారోకో చేస్తామని చెప్పారు. ఏడున ఆర్ఎల్‌సి వద్ద చర్చలు జరగనున్నాయని, ఎనిమిదిన స్థానిక ఎమ్మెల్యేకు సామూహిక వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. తొమ్మిదిన ప్రతిపక్ష పార్టీల నాయకులకు వినతిపత్రాలు, పదిన స్థానిక ఎంపికి సామూహిక వినతిపత్రం అందజేస్తామని చెప్పారు..

ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని ధర్మాసనం ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. గురువారం తీర్పు వెలువరించింది. ఆ నియామక ప్రక్రియను కలుషితమైనది, కళంకమైనదిగా అభివర్ణించింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు లేవని పేర్కొంది. ఆ నియామకాలు చెల్లవని స్పష్టంచేసింది. అయితే, ప్రభావిత ఉపాధ్యాయులకు కాస్త ఊరట కల్పించింది. ఈ నియామక ప్రక్రియ కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు అప్పటివరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించింది. అలాగే, మూడు నెలల్లో కొత్తగా టీచర్ల నియామకాలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు మమతా ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, వికలాంగ ఉపాధ్యాయులకు మానవతా కోణంలో ఊరట కల్పించింది. వారు విధుల్లో కొనసాగొచ్చని స్పష్టంచేసింది. అలాగే, ఈ కుంభకోణం వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరపాలని గతంలో హైకోర్టు సిబిఐను ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.

కాగా, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. అయితే ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసులో రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి, టిఎంసి సీనియర్ నాయకులు పార్థా ఛటర్జీని ఇడి అరెస్టు చేసింది.

'మిట్టల్' స్టీల్ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

పురస్కారాల కార్యక్రమాన్ని పెద్దయెత్తున రాష్ట్రంలో నిర్వహించామని, అన్ని రకాల కళలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. వీటి నిర్వహణ కోసం ఇటీవల జారీ చేసిన జిఓ 65, 68కు ఆమోదం తెలిపామని చెప్పారు. హడ్కో నుంచి ఎపి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.710 కోట్ల మేర రుణాన్ని తీసుకునేందుకు ప్రభుత్వ హామీ అందించడానికి మార్చిలో జారీ చేసిన జిఓ 35ను ఆమోదించామని తెలిపారు. పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కాంట్రాక్టు విషయంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం వల్ల ఎన్ఇసిఎల్, ఎపిజెన్‌కోకు జరిగిన రూ.1,735.35 కోట్ల నష్టాన్ని భర్తీ చేసేందుకు జారీ చేసిన ఆర్బిట్రేషన్ అవార్డు అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ప్యాకేజ్ నెం 4 ద్వారా నాగార్జున సాగర్ ఎడమ బ్రాంచ్ కెనాల్ వేంపాడు మేజర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.44.60 కోట్ల అదనపు ఆర్థిక సాయం కోసం జలవనరులశాఖ చేసిన ప్రతిపాదనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. గోదావరి నది వరద జలాలను, ఇతర ప్రాజెక్టులను ఉపయోగించుకునేందుకు నిర్దేశించిన 'పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు' పనులను అమలు చేసేందుకు, పూర్తి చేసేందుకు, కంపెనీల చట్టం-2013 ప్రకారం 100 శాతం ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీగా జలవనరులశాఖ 'జలహారతి కార్పొరేషన్' పేరుతో స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటుకు, దానికి అవసరమైన డైరెక్టర్లు, ఇతర సిబ్బందిని సమకూర్చుకునేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని చెప్పారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేసే విషయంలో రూపొందించిన నూతన సమగ్ర నియమ, నిబంధనల పాలసీని సమగ్రంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఈ సమావేశంలో సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు.

లాకౌట్ దిశగా సంకిలి ప్యారీ సుగర్స్

- 35 మంది ఎగ్జిక్యూటివ్ సిబ్బంది, 85 మంది అవుట్ సోర్సింగ్ కార్మికుల తొలగింపు
- అగమ్య గోచరంగా చెరకు రైతులు
- 2026 చెరకు క్రషింగ్ లక్ష్యం తెలియదంటున్న సిబ్బంది

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం సంకిలిలోని ఇఐడి ప్యారీ సుగర్స్ కర్మాగారం పరిధిలో ప్రస్తుతం 6,516 మంది రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీని 20 సంవత్సరాలుగా జిఎంఆర్ సంస్థ నడిపేది. కొన్ని కారణాల వల్ల చెన్నైకు చెందిన మురుగప్ప సంస్థకు ఈ కర్మాగారాన్ని ఏడేళ్ల క్రితం విక్రయించారు. కర్మాగారంలో 173 మంది పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, 60 మంది వరకు ఎగ్జిక్యూటివ్‌లు పనిచేస్తున్నారు. వీరంతా 27 నుంచి 25 సంవత్సరాలు అనుభవం ఉన్నవారు. ఇటీవల చెన్నై మురుగప్ప సంస్థ యాజమాన్యం సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వచ్చి ఎగ్జిక్యూటివ్ సిబ్బంది 45 మందిని, అవుట్ సోర్సింగ్ కార్మికులు 80 మందిని తొలగించింది. 2026 నాటికి లాకౌట్ దిశగా సుగర్ ఫ్యాక్టరీ పయనిస్తోందని కార్మికులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, సుగర్ యాజమాన్యం మధ్య ఉన్న పంచదార అగ్రిమెంటు 2026 నాటికి పూర్తవున వెంటనే ఫ్యాక్టరీ లాకౌట్ గాని, కార్మిక, ఉద్యోగులకు సెటిల్ మెంట్ చేసే పరిస్థితి గాని ఉంటుందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే పర్మినెంట్ కార్మికులను సుగర్ ఫ్యాక్టరీ నుంచి ఇథనాల్ కర్మాగారానికి బదిలీ చేసి, అక్కడ అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే కార్మికులను తొలగించారు.

ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ శ్రీకాకుళం జిల్లాలో మూడేళ్ల క్రితం 12వేల మంది రైతులతో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల చెరకు గానుగ ఆడేది. దీనికి తోడు విజయనగరం జిల్లా లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ నుంచి అగ్రిమెంటు లేని చెరకు కొనుగోలు చేసి ఆడించేవారు. రైతులకు ఎన్నో రాయితీలు అందించేవారు. అప్పుడు రోజుకు 4,500 టన్నుల కెపాసిటీతో చెరకు క్రషింగ్ చేసేవారు. ప్రస్తుతం రెండేళ్ల నుంచి మురుగప్ప సంస్థ సంకిలి షుగర్ ఫ్యాక్టరీని పట్టించుకోకపోవడంతో చెరకు ఉత్పత్తి, రైతులు రాయితీలు వంటివి గాలికి వదిలేసినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు అగమ్యగోచరంలో పడి చెరకు పంటను తగ్గించుకుంటూ మొక్కజొన్న పంటపై మొగ్గు చూపుతున్నారు. వచ్చే ఏడాది క్రషింగ్ ప్రస్తుతం 2.10 మెట్రిక్ టన్నులు చెరకు ఉందని యాజమాన్యం చెబుతోంది. వచ్చే ఏడాది క్రషింగ్ విషయమై ప్రజాశక్తి యాజమాన్యాన్ని వివరణ కోరేందుకు వెళ్లగా తమకేమీ తెలియదని సిబ్బంది సమాధానమిచ్చారు.

జెఎన్‌టియులో స్పోర్ట్స్ డే

విజయనగరం టౌన్ : జెఎన్‌టియులో గురువారం స్పోర్ట్స్‌డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5:30 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు స్పోర్ట్స్ డే, వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీ విసి డి. రాజ్యలక్ష్మి ప్రధాన అతిథిగా, రిజిస్ట్రార్ జి. జయసుమ గౌరవ అతిథులుగా విచ్చేశారు. క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రముఖ పారాఅథ్లెట్ కె.లలిత, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమాన్ని పారా అథ్లెట్ లలిత... జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా 2022-23 విద్యాసంవత్సరం నుండి ఇప్పటివరకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెడల్స్, సర్టిఫికేట్లతో సన్మానించారు.

400 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

పాచిపెంట మండలంలో 400 కేజీల గంజాయి పట్టుబడినట్టు ఎఎస్‌పి అంకిత సురానా వెల్లడించారు. గురువారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. గురువారం ఉదయం నాలుగు గంటలకు పాచిపెంట మండలం ఆలూరు వద్ద గల గ్రీన్ ఫీల్డ్ హైవేలో వాహన తనిఖీలను చేశారని, ఆ సమయంలో రెండు కార్లపై వస్తున్న నిందితులు పోలీసుల తనిఖీలను గమనించి కార్లను యూ టర్న్ తీసుకొని మళ్లీ వెనక్కి వెళ్లారని తెలిపారు. ఇది గమనించిన పోలీసులు ఆ వాహనాలను వెంబడించగా, ఆ వాహనాలను మధ్యలో విడిచి పెట్టి తప్పించుకుపోయారన్నారు. ఆ రెండు కార్లను సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి సోదా చేశామన్నారు. అందులో సుమారు 400 కేజీల గంజాయి పట్టుబడిందని, దీని విలువ సుమారు రూ.39 లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు.

జార్ఖండ్‌లో 21 మంది జువైనల్స్ పరారీ

- గార్డులపై దాడి, సిసిటివి కెమెరాల ధ్వంసం

రాంచీ : ఒక అబ్జర్వేషనల్ హోమ్ గేటును పగలగొట్టి, గార్డులపై దాడి చేసి 21 మంది జువైనల్స్ పారిపోయిన ఘటన జార్ఖండ్‌లో చోటు చేసుకుంది. ఈ క్రమంలో వారు సిసిటివి కెమెరాలను కూడా ధ్వంసం చేశారు. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని చైబాసాలో అబ్జర్వేషనల్ హోమ్ వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటలకు జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. హేమంత్ సోరెన్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. పారిపోయిన వారిని వెంటనే పట్టుకోవాలని, ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు నిర్వహించాలని మాజీ ముఖ్యమంత్రి బాబులాల్ మరాండి డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. పారిపోయిన వారిలో నలుగుర్ని పట్టుకున్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లగా, మరొకర్ని స్థానికుల సహాయంతో పట్టుకున్నారు. మిగిలిన వారందర్నీ కూడా పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

శ్రీసిటీని సందర్శించిన రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్‌జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. కాన్సుల్ జనరల్, ఆయనతో పాటు విచ్చేసిన అధికారుల బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు.

ఇండో-రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తుచేసిన ఆయన, ఈ సందర్శన ఫలితంగా మరిన్ని రష్యన్ పరిశ్రమలు భారత మార్కెట్‌కు తమ ప్రధాన స్థావరంగా శ్రీసిటీని ఎంచుకుంటాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమను సందర్శించారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్యాతో చర్చలు జరిపారు.

బావిలో విషవాయులు పీల్చి ఎనిమిది మంది మృతి


భోపాల్ : శుభ్రం చేయడం కోసం బావిలోకి దిగి అక్కడి విషవాయువులు పీల్చి ఎనిమిది మంది మరణించిన దారుణ సంఘటన మధ్యప్రదేశ్‌లో సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖాండ్వా జిల్లాలో చాయ్‌గావ్ మఖాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండావత్ గ్రామంలో గురువారం సాయంత్రం ఈ దారణం జరిగింది. శుక్రవారం గంగోర్ పండుగ, విగ్రహ నిమజ్జనం నేపథ్యంలో గ్రామ శివారులోని ఒక బావిని శుభ్రం చేయాలని భావించారు. ముందుగా ముగ్గురు వ్యక్తులు బావిలోకి దిగి శుభ్రం చేయడం ప్రారంభించారు. అయితే వీరు కొంత బురదను తొలగించిన తరువాత అక్కడ నుంచి విషవాయువు లీక్ కావడం ప్రారంభించింది. దీంతో ఈ ముగ్గురూ స్పృహ తప్పి పడిపోయారు. దీంతో ఈ తరువాత మరో ఇద్దరు వ్యక్తులు లోపలకు వెళ్లగా వారు కూడా స్పృహ తప్పి పడిపోయారు. ఈ విధంగా మొత్తం ఎనిమిది మంది బావిలో ప్రవేశించి, వారందరూ మరణించారని జిల్లా ఎస్‌పి మనోజ్ రాయ్ తెలిపారు. ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశామని, మృతులంతా 22 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పురుషులని తెలిపారు. గ్రామ శివారుల్లో ఉన్న ఈ బావిని ముఖ్యంగా మతపరమైన ఊరేగింపులు, నిమజ్జనాలకు ఉపయోగిస్తారని చెప్పారు. విషవాయువును మీథేన్‌గా అనుమానిస్తున్నామని, పోస్ట్‌మార్టం నివేదిక తరువాత పూర్తి వివరాలు వెల్లడవుతాయని చెప్పారు.

హెచ్‌సియు భూముల్లో పనులు నిలిపివేయండి

- సుప్రీం కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంచ గచ్చిబౌలిలోని హెచ్‌సియు భూముల్లో చేపడుతున్న పనులు వెంటనే నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు అన్ని చర్యలు నిలిపివేయాలని స్పష్టంచేసింది. హైకోర్టు నివేదికను పరిశీలించిన ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారు..? చెట్లను కొట్టేసే అధికారం ఎవరిచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చిన కోర్టు... అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా, చెట్లు కొట్టే ముందు సిఇసి అనుమతి తీసుకున్నారా అని నిలదీసింది. ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని తెలిపింది. తమ ప్రశ్నలకు సిఎస్ సమాధానం చెప్పాలని సుప్రీం ఆదేశించింది.



మీకోసం

గోడలపై ఇంకు లేక పెన్నుతో గీసిన గీతలు పోవాలంటే.. నెయిల్ పాలిష్ రిమూవర్‌ను కొంచెం దూదిపై వేసుకుని మరకలు ఉన్నచోట రుద్దాలి.

జీవన సౌరభం

గమ్యం స్థిరంగా ఉండాలి. మార్గం కచ్చితంగా నిర్ణయించుకోవాలి. ప్రయత్నం రాజీలేని ధోరణిలో సాగాలి. అప్పుడే విజయం మనదవుతుంది.

చిట్టి మనసు



చిట్టి చదివేది మూడో తరగతి. తన ముద్దు ముద్దు మాటలకు అందరూ మురిసిపోయేవారు. ఒకరోజు చిట్టి ఇంటి పెరట్లో ఉన్న జామ చెట్టు కింద ఆడుకుంటోంది. ఇంతలో ఒక ఉడత పిల్ల కొమ్మ చివారున ఉన్న ఆరముగ్గిన జామ పండును తినబోయింది. అది కాస్తా కిందకు పడిపోయింది. ఆ చప్పుడుకి చిట్టి తల పైకెత్తి చూసింది. ఉడుత పిల్ల కనిపించింది. 'అయ్యో నువ్వు తిందామనుకున్న జామ పండు కిందకు పడిపోయింది. దా! దా! వచ్చి తిను' అని తన ముద్దు ముద్దు మాటలతో రమ్మనమని పిలిచింది చిట్టి. ఉడుత పిల్లకు భయమేసింది. కదలక మెదలక అలా చూస్తూ ఉండిపోయింది. చిట్టి ఇంట్లోకి వెళ్లి అమ్మకు చెప్పింది. ఉడతపిల్ల కావాలని మారాం చేసింది. 'అవి స్వేచ్ఛాజీవులు వాటిని పట్టుకోకూడదు. చూసి ఆనందించాలి' అని తల్లి చెప్పింది. చిట్టి మళ్లీ పెరట్లోకి వెళ్ళింది. ఉడత పిల్లను రమ్మనమని బతిమలాడింది. స్నేహం చేద్దామని చెప్పింది. చిట్టి ముద్దు ముద్దు మాటలకు ఉడత ముచ్చట పడింది. 'నీతో స్నేహం చేస్తాను కానీ, కిందకు రాను' అంది. 'ఒక్కసారి నిన్ను పట్టుకుని ముద్దులాడాలని ఉంది' అని చెప్పింది చిట్టి. ఇలా రోజూ మాట్లాడుకునేవి. కొన్నాళ్లకు చిట్టి, ఉడుత స్నేహితులయ్యారు. ఉడతకి చిన్ని అని పేరు పెట్టింది. అప్పటి నుంచి చిన్ని రోజూ తియ్యని జామ పళ్ళను చెట్టు మీద నుంచి కిందికి జార విడిచేది. ఆ తియ్యని పళ్ళను తిని ఎన్నో కబుర్లు చెప్పేది చిట్టి.

వేసవికాలం వచ్చింది. ఎండలు విపరీతంగా కాచాయి. చిట్టి వాళ్ల వాకిట్లో ఉన్న కుండలోని నీళు తాగడం కోసం కాకులు వచ్చేవి కానీ తాగలేక పోయేవి. ఆ విషయాన్ని గమనించింది చిట్టి. కొన్నాళ్ల క్రితం తన తండ్రి ఇంటి చూరుకు వరి కంకులు కట్టడం. పిచ్చుకలు వచ్చి వాటిని తినడం చిట్టికి గుర్తుకు వచ్చింది. తనూ ఏదైనా చేసి సాయపడాలి అనుకుంది. ఓ మూలన ఉన్న మట్టి ప్రమిదను తెచ్చింది. దాని నిండా నీళ్ళను పోసి జామ చెట్టుకింద పెట్టింది. పక్షులన్నీ నీళ్లు తాగి దాహం తీర్చుకున్నాయి. అది చూసిన చిన్ని 'మిత్రమా నీ ఆలోచన గొప్పది మా అందరి దాహం తీరుస్తున్నావు' అని మెచ్చుకుంది. కూతురి మంచి మనసుకు మనసులోనే పొంగిపోయారు తల్లి తండ్రి..

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ





బల్దే క్షత్రజ్ఞ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీ పూర్,
ఆదిలాబాద్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సెలబ్రిటీలకు రక్షణగా...



ప్రముఖ వ్యక్తులు ఏదేని కార్యక్రమాల్లో పాల్గొంటుంటే, వాళ్ల కంటే ముందు మనకి బాడీగార్డులు (బౌన్సర్లు) కనిపిస్తారు. నల్ల కళ్లజోడు, నల్ల షర్టు, ప్యాంటు, షూస్ వేసుకుని శరీర దారుఢ్యం గల ఈ వ్యక్తులను ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలు నియమిస్తాయి. ఈ రంగంలో ఎక్కువశాతం మంది పురుషులే కనిపిస్తారు. అయితే ఇటీవల మోహన్‌లాల్ హీరోగా మలయాళ సినిమా 'ఎల్ 2 : ఎంపురాన్' తెరకెక్కింది. ఆ సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో మోహన్‌లాల్‌కి రక్షణగా ఆయనకి దారి చూపిస్తూ ఓ లేడీ బాడిగార్డు కనిపించారు. ఫుల్ బ్లాక్ డ్రెస్‌లో ఉన్న ఈ మహిళా బౌన్సర్ ఎవరని, సోషల్ మీడియాలో హీరోతో పాటు ఆమెని కూడా వైరల్ చేశారు. కేరళకి చెందిన ఆమె పేరు అను కుంజుమాన్. ఫొటోగ్రాఫర్‌గా జీవితాన్ని ప్రారంభించిన అను బౌన్సర్‌గా మారడం వెనుక తనకి జరిగిన అవమానం ఉంది. దాన్ని అధిగమించేందుకు ఆమె ఈ రంగాన్ని ఎంచుకుని ఇప్పుడు ఎంతోమంది మహిళలకి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పురుషులకు మాత్రమే ప్రవేశం అన్న రంగాల్లో మహిళలు ప్రతిభ చూపడం ఎప్పటినుండో ఉన్నా బౌన్సర్లగా మాత్రం చాలా అరుదుగా కనిపిస్తారు. డిజె పార్టీలు, బార్స్, పబ్స్ వంటి సమస్యాత్మక ప్రదేశాల్లో బౌన్సర్లగా విధులు నిర్వహించాలంటే శరీర దారుఢ్యం ఒక్కటే సరిపోదు. అంతకు మించి మానసికస్థైర్యం కావాలి. సిట్యువేషన్‌ని హ్యాండిల్ చేసే పరిణతి ఉండాలి. అయితే చిన్న తనం నుండే కుటుంబ భారాన్ని మోస్తున్న కుంజుమన్‌కి వాటిని అధిగమించడం పెద్ద లెక్క కాదు.

తన కుటుంబ పరిస్థితి గురించి కుంజుమన్ ఓ ఇంటర్వ్యూలో ఇలా మాట్లాడారు. 'సమస్యలు నాకు కొత్త కాదు. మా అమ్మ, చెల్లి బాధ్యత నాదే. సమాజంలో గౌరవంగా జీవిస్తూ ఒంటరిగా కుటుంబాన్ని పోషించడం సవాళ్లతో కూడుకున్నది. సవాళ్లని అధిగమించడానికి మానసిక బలం చాలా కావాలి' అన్నారు. ఫొటోగ్రాఫర్‌గా పలు సినిమా ఫంక్షన్లకి ఆమె పనిచేశారు. అప్పుడు జరిగిన ఓ సంఘటన కుంజుమన్‌ని బౌన్సర్‌గా స్థిరపడేలా చేసింది. దాని గురించి కూడా ఆమె గుర్తు చేసుకున్నారు.


'ఒక సినిమా ఫంక్షన్‌లో ఫొటోషూట్ చేస్తున్న నాకు ఆ కార్యక్రమానికి వచ్చిన బౌన్సర్‌తో వాగ్వాదం జరిగింది. అతను చాలా పరుషంగా మాట్లాడాడు. నాకు కోపం వచ్చి కిందికి తోసేశాను. అంత బలమైన వ్యక్తిని అంతే బలంగా ఎదుర్కొన్నాను. అప్పుడే నేను కూడా బౌన్సర్‌గా మారాలని నిర్ణయిం చుకున్నాను. వెంటనే ఏజెన్సీని కలిశాను' అంటూ తనకెదురైన అనుభవాన్ని ఆమె చెప్పారు.

ఏజెన్సీకి వెళ్లిన కుంజుమన్‌కి అంత తేలికగా శిక్షణ దొరకలేదు. మహిళలకు ప్రవేశం లేదు అన్న ఏజెన్సీతో 'మహిళకు మీరు శిక్షణ ఎందుకు ఇవ్వరు?' అని పోట్లాడి మరీ తర్ఫీదు పొందాన'ని ఆమె నవ్వుతూ చెప్పారు. బౌన్సర్‌గా స్థిరపడాలనుకునే మహిళల గురించి మాట్లాడుతూ 'దృఢసంకల్పం ఉండాలని, శారీరక, మానసిక బలం ముఖ్యం' అని చెబుతున్నారు.కొచ్చి ప్రాంతంలో ఇప్పుడు కుంజుమన్ తెలియని వారు లేరు. పబ్ పార్టీల్లో, మహిళా సెలబ్రిటీలకు, వ్యాపారవేత్తలకు ఆమె బౌన్సర్‌గా పనిచేస్తున్నారు. 'సమాజం ఎంత ముందుకు పోతున్నా మహిళలు వివక్షకు గురవుతూనే ఉన్నారు. ఆ వివక్షను రూపుమాపాలని మహిళలు ఇంకా ఇంకా పరుగెడుతూనే ఉన్నారు' అని ఆమె అన్న మాటల్లో ఎంతో నిజం ఉంది.

వట్టి వేరు.. ఉపయోగాలు వేర్వేరు..


సాధారణంగా ఎండాకాలంలో ఇల్లు చల్లదనం కోసం వట్టి వేళ్లతో చేసిన చాపలు వాడుతుంటారు. కొబ్బరి నూనెలో వేసుకుని కూడా కొంతమంది ఉపయోగిస్తుంటారు. వీటిని ఆహారంలో కూడా భాగం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ వేర్లలో ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని ఎక్కువగా ఔషధాల్లో వాడతారని వైద్యులు చెబుతున్నారు.

- వట్టివేరుతో షర్బత్ తయారుచేసుకుని తాగడం వల్ల ఎండాకాలం తరచూ వచ్చే కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి తగ్గుతాయి.
- నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. మెదడుకి రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది.
- వట్టివేరు సారం శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. సువాసన భరితంగా ఉండడం వల్ల ఒత్తిడి కూడా దూరమవుతుంది.
- నిద్రలేమిని పోగొట్టి జీర్ణ సమస్యలని దూరం చేస్తుంది..
- తలనొప్పితో బాధపడుతుంటే ఈ వేర్లని నీటిలో నానబెట్టి ఆ నీటిని తాగొచ్చు. వేర్లని మెత్తని పేస్టులా నూరి దానిని తలపై పట్టిలా వేసుకుని కాసేపయ్యాక శుభ్రం చేసుకున్నా తలనొప్పి తగ్గిపోతుంది.
- వేర్లని ఓ గ్లాసులో వేసి ఓ నాలుగైదు గంటలు లేదా రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగాలి. దీని వల్ల డీహైడ్రేషన్ సమస్య దూరమవుతుంది.
- కుండనీళ్లు వాడేవారు ఈ వట్టివేరుని ఓ తెల్లని వస్త్రంలో మూట కట్టి ఆ నీటిలో వేయాలి. రెండు, మూడ్రోజులకి ఓసారి వట్టివేరును మార్చుకోవాలి.
- కుండ నీటిలో నానబెట్టిన వట్టివేర్లని పారేయకుండా దానిని మెత్తగా నూరుకొని ప్యాక్‌లా ముఖానికి వేసుకోవచ్చు. దీంతో ముఖంపై ఉన్న మచ్చలు, మొటిమలు దూరమవుతాయి.
- వట్టివేర్లని నీటిలో వేసి మరిగించి స్నానానికి వాడే నీటిలో కలిపి స్నానం చేస్తే చెమట వాసన దూరమవుతుంది.





ఆదిత్య 369 సీక్వెల్‌లో మోక్షజ్ఞ ఎంట్రీ



సీనియర్ నటుడు బాలకృష్ణ నట వారసుడు నందమూరి మోక్షజ్ఞ సినీ రంగ ప్రవేశానికి రంగం సిద్ధమైంది. 'ఆదిత్య 369' సినిమా సీక్వెల్స్‌లో ఆయన కథానాయకుడిగా నటించ బోతున్నారనేది స్పష్టమైంది. ఈ విషయాన్ని ఆ సినిమా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు స్వయంగా ప్రకటించారు. తన కుమారుడితో సీక్వెల్ చేయాలని బాలకృష్ణ కోరగా ఆయన దానికి అంగీకరించినట్లుగా చెప్పారు. 34 ఏళ్ల క్రితం విడుదలైన 'ఆదిత్య 369' సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా రీ రిలీజ్ శుక్రవారంనాడు జరగనుంది. తాజాపర్చిన ప్రింట్‌తో ఈ సినిమా సరికొత్తగా అలరించనుంది. బాలకృష్ణ, మోహిని జంటగా సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. హెచ్‌జి వెల్స్ రచించిన 'ది టైమ్ మిషన్' నవల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా సింగీతం శ్రీనివాసరావు తెలిపారు.




సక్సెస్‌మీట్‌కి ఎన్‌టిఆర్

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణంలో వచ్చిన తాజా చిత్రం మ్యాడ్ స్క్వేర్. మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం వచ్చింది. ఈ సినిమాకు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించగా.. నాగవంశీ నిర్మించారు. మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సక్సెస్ వేడుకకు చిత్రయూనిట్ సిద్ధమవుతోంది. ఈ కార్యక్రమానికి జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా రాబోతున్నట్లు ప్రకటించింది.

సత్యరాజ్ కొత్త చిత్రం పాట విడుదల



సత్యరాజ్ కీలకపాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాకు డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. విజయ్ పాల్ రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. సత్యం రాజేష్, వశిష్ట ఎన్ సింహ, సాంచి రాయ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ని విడుదల చేశారు. 'అనగా అనగా కథలా' అంటూ సాగే ఈ పాటని టీకేఆర్ కాలేజీలోని విద్యార్థుల సమక్షంలో చైర్మన్ తీగల కృష్ణారెడ్డి రిలీజ్ చేశారు. సింగర్ కార్తీక్ ఈ పాటని ఆలపించారు. సనరే సాహిత్యం అందించారు.



'జాక్' ట్రైలర్ విడుదల

సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా 'జాక్' నుండి ట్రైలర్ విడుదలైంది. వైష్ణవి చైతన్య ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ప్రకాశ్ రాజ్ వాయిస్‌తో ట్రైలర్‌ను ప్రారంభించారు. ఇందులో వైష్ణవి చైతన్య తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తున్నారు.




నేడు 'శారీ' సినిమా విడుదల

రవిశంకర్‌తో కలిసి రామ్‌గోపాల్‌వర్మ నిర్మించిన చిత్రం 'శారీ'. శుక్రవారంనాడు ఈ సినిమా విడుదల కానుంది. ఆరాధ్యదేవి, సత్యయాదు ప్రధాన పాత్రలు పోషించారు. గిరికృష్ణకమల్ దర్శకత్వం వహించారు. వర్మ మూలకథను అందించారు. శశిప్రీతమ్ సంగీతాన్ని అందించారు. ఈ సందర్భంగా రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'శారీ' సినిమా అద్భుతంగా ఉంటుందన్నారు. నటులంతా చాలా బాగా నటించారన్నారు. ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందనటంలో ఎలాంటి సందేహం లేదన్నారు.


25న ఎర్రచీర విడుదల

తెలుగులో సరికొత్త కథతో తెరకెక్కిన చిత్రం 'ఎర్రచీర : ది బిగినింగ్' నటకిరీటి రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని ప్రధాన పాత్ర పోషించారు. సుమన్‌బాబు స్వీయ దర్శకత్వం వహించారు. బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాలయ ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. ఈనెల 25న ఈ సినిమా విడుదల చేయటానికి చిత్ర నిర్మాతలు ఏర్పాట్లు చేశారు.



కోల్‌కతా పై పైకి

- వెంకటేశ్ అయ్యర్, రఘువంశీ అర్ధ శతకాలు
- వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తికి మూడేసి వికెట్లు
- సన్‌రైజర్స్‌పై 80 పరుగుల తేడాతో గెలుపు



కోల్‌కతా: గత ఏడాది ఐపిఎల్ ఫైనల్లో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవాలన్న సన్‌రైజర్స్ ఆశలు మరోసారి అడియాశలయ్యాయి. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 80 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కోల్‌కతా నిర్దేశించిన 201 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సన్‌రైజర్స్ 16.4ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో భాగంగా సన్‌రైజర్స్ టాపార్డర్ బ్యాటర్లు హెడ్(4), అభిషేక్(2) ఇషాన్(2) సింగిల్ డిజిట్‌కే పెవీలియన్‌కు చేరారు. దీంతో 9పరుగులకే 3వికెట్లు కోల్పోయిన సన్‌రైజర్స్ రక్షణాత్మకంగా ఆడింది. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి(19), కమిందు మెండీస్(27), క్లాసెన్(33), కెప్టెన్ కమిన్స్(14) రెండంకెల స్కోర్ చేసినా.. సన్‌రైజర్స్‌ను గెలిపించలేకపోయారు. దీంతో 80 పరుగుల తేడాతో నెగ్గిన కోల్‌కతా పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి ఎగబాకింది. వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తికి మూడేసి, ఆండ్రీ రస్సెల్‌కు రెండు, హర్షిత్ రాణా, నరైన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్ అర్ధసెంచరీలతో రాణించడంతో కోల్‌కతా జట్టు 200 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే(38), రఘువంశీ(50) కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించారు. వీరిద్దరూ 3వ వికెట్‌కు 81 పరుగులు జతచేశారు. రఘువంశీ 32బంతుల్లో 5ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 50 పరుగులు చేయగా.. వెంకటేశ్ అయ్యర్ కేవలం 29బంతుల్లోనే 7ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 60 పరుగులు చేసి అవుటయ్యారు. సన్ రైజర్స్ బౌలర్లలో షమీ, కమిన్స్, జీషన్ అన్సారీ, కమిందు మెండిస్, హర్షల్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
పంజాబ్	2	2	0	4	+1.48
ఢిల్లీ	2	2	0	4	+1.32
బెంగళూరు	3	2	1	4	+1.14
గుజరాత్	3	2	1	4	+0.80
కోల్‌కతా	4	2	2	4	+0.17
ముంబయి	3	1	2	2	+0.30
లక్నో	3	1	2	2	+0.15
చెన్నై	3	1	2	2	-0.77
రాజస్తాన్	3	1	2	2	-1.11
సన్‌రైజర్స్	4	1	4	2	-1.61

ఆ:ఆడినవి; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్ రన్‌రేట్

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా ఇన్నింగ్స్: డికాక్ (సి)అన్సారి (బి)కమిన్స్ 1, నరైన్ (సి)క్లాసెన్ (బి)షమీ 7, రహానే (సి)క్లాసెన్ (బి)అన్సారి 38, రఘువంశీ (సి)హర్షల్ పటేల్ (బి)కమిందు మెండీస్ 50, వెంకటేశ్ అయ్యర్ (సి)అంకిత్ వర్మ (బి)హర్షల్ పటేల్ 60, రింకు సింగ్ (నాటౌట్) 32, రస్సెల్ (రనౌట్) క్లాసెన్ 1, అదనం 11. (20ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 200 పరుగులు. **వికెట్ల పతనం:** 1/14, 2/16, 3/97, 4/106, 5/197, 6/200 **బౌలింగ్:** షమీ 4-0-29-1, కమిన్స్ 4-0-44-1, సిమ్రన్ 4-0-47-0, అన్సారి 3-0-25-1, హర్షల్ 4-0-43-1, కమిందు 1-0-4-1.

సన్‌రైజర్స్ ఇన్నింగ్స్: హెడ్ (సి)హర్షిత్ రాణా (బి)వైభవ్ 4, అభిషేక్ శర్మ (సి)వెంకటేశ్ అయ్యర్ (బి)హర్షిత్ 2, ఇషాన్ కిషన్ (సి)అజింక్యా రహానే (బి)వైభవ్ అరోరా 2, నితీశ్‌కుమార్ రెడ్డి (సి)నరైన్ (బి)రస్సెల్ 19, కమిందు మెండీస్ (సి)అనుకుల్ రాయ్ (బి)నరైన్ 27, క్లాసెన్ (సి)మొయిన్ (బి)వైభవ్ 33, అంకిత్ వర్మ (సి)వెంకటేశ్ (బి)వరుణ్ 6, పాట్ కమిన్స్ (సి)హర్షిత్ (బి)వరుణ్ చక్రవర్తి 14, హర్షల్ పటేల్ (సి అండ్ బి)రస్సెల్ 3, సిమ్రన్‌జీత్ సింగ్ (బి)వరుణ్ చక్రవర్తి 0, షమీ (నాటౌట్) 2, అదనం 8. (16.4ఓవర్లలో ఆలౌట్) 120పరుగులు. **వికెట్ల పతనం:** 1/4, 2/9, 3/9, 4/44, 5/66, 6/75, 7/112, 8/114, 9/114, 10/120 **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-1-29-3, హర్షిత్ రాణా 3-0-15-1, వరణ్ 4-0-22-3, ఆండీ రస్సెల్ 1.4-0-21-2, నరైన్ 4-0-30-1.

ఐపిఎల్‌లో నేడు

లక్నో సూపర్‌జెయింట్స్ × ముంబయి
వేదిక: లక్నో; రాత్రి 7.30గం॥లకు

గుజరాత్‌కు షాక్

- స్వదేశానికి రబాడ



అహ్మదాబాద్: ఐపీఎల్-2025లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్, దక్షిణాఫ్రికా స్పీడ్ స్టార్ కగిసో రబాడ తన స్వదేశానికి తిరిగి వెళ్లిపోయాడు. వ్యక్తిగత కారణాలతో రబాడ దక్షిణాఫ్రికాకు వెళ్లినట్లు గుజరాత్ టైటాన్స్ మెనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే అతడు ఎప్పుడు తిరిగి భారత్‌కు వస్తాడన్న విషయాన్ని గుజరాత్ వెల్లడించలేదు. కాగా బుధవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌కు కూడా రబాడ దూరమయ్యాడు. అయితే ఈ మ్యాచ్‌లో రబాడ లేనప్పటికి గుజరాత్ టైటాన్స్ మాత్రం ఘన విజయాన్ని అందుకుంది. గుజరాత్ టైటాన్స్ తమ తదుపరి మ్యాచ్ ఏప్రిల్ 6న ఉప్పల్ స్టేడియం వేదికగా ఎస్ఆర్‌హెచ్‌తో తలపడనుంది. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లు ఆడిన రబాడ.. కేవలం రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.



ఇంటివాడైన చెస్ గ్రాండ్‌మాస్టర్ విదిత్

ముంబయి: భారత యువ గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీ వివాహ బంధంలో అడుగుపెట్టాడు. ఏప్రిల్ 2న హెూమియోపతి వైద్యురాలైన నిధి కటారియాను విదిత్ వివాహం చేసుకున్నాడు. మహారాష్ట్ర సంప్రదాయం ప్రకారం కుటుంబసభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో కన్నులపండువగా వీరి వివాహం జరిగింది. 'నా జీవితంలో అత్యుత్తమైన రోజు' అనే క్యాప్షన్‌తో ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు విదిత్. విదిత్ సంగీత్ వేడుకలో చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్‌లు చిందేశారు. నెదర్లాండ్స్ చెస్ ఆటగాడు అనిశ్ గిరీ సతీసమేతంగా హాజరయ్యాడు. ఫిడే ర్యాంకింగ్స్‌లో విదిత్ 25వ ర్యాంక్ ఆటగాడు.

భారత్ @ 127

ఫిఫా ర్యాంకింగ్స్ విడుదల

రోమ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ రెండు ర్యాంకింగ్స్ పడిపోయి 127వ స్థానంలో నిలిచింది. ఫిఫా గవర్నింగ్ బాడీ గురువారం ఫిఫా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. బంగ్లాదేశ్‌తో ఇటీవల జరిగిన ఎఎఫ్‌సి ఆసియాకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో భారత్ గోల్ లేకుండా డ్రాగా ముగించింది. దీంతో బంగ్లాదేశ్ రెండు స్థానాలు మెరుగుపరుచుకొని 183వ ర్యాంక్‌కు ఎగబాకగా.. భారత్ రెండు స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. 2024నుంచి నుంచి భారత ఫుట్‌బాల్ జట్టు 13మ్యాచుల్లో కేవలం ఒకే ఒక మ్యాచ్‌లో మాత్రమే విజయాన్ని నమోదు చేయగల్గింది. భారత ఫుట్‌బాల్ జట్టు వరుసగా మూడోసారి ఆసియాకప్‌కు అర్హత సాధించాలంటే బంగ్లాదేశ్, సింగపూర్, హాంకాంగ్ జట్లు ఉన్న గ్రూప్ టాపర్‌గా నిలవాల్సి ఉంది. ఇక తాజా ఫిఫా ర్యాంకింగ్స్‌లో డిఫెండింగ్ ప్రపంచకప్ ఛాంపియన్ అర్జెంటీనా మరోసారి తన అగ్రస్థానాన్ని నిలుపుకోగా.. స్పెయిన్, ఫ్రాన్స్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.



ప్రజలు కదులుతున్నారు!

ఎన్నికల్లో ప్రతిఫలించేలా చేయడమే సవాల్

పశ్చిమ బెంగాల్‌లో నిరంతరాయంగా చేస్తున్న పోరాటాల కారణంగా ప్రజలు కదులుతున్నారని, ఆందోళనల్లోకి వస్తున్నారని, అయితే, ఈ బలాన్ని, పెరుగుతున్న మద్దతును ఎన్నికలలో ప్రతిఫలింపచేయడమే పార్టీ ముందున్న సవాల్ అని పశ్చిమ బెంగాల్ సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యుడు, పత్రికా రచయిత దేబాశిష్ చక్రవర్తి అన్నారు. మహాసభ ప్రాంగణంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా ...



బెంగాల్‌లో ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది?

బెంగాల్ రాజకీయాల్లో చెప్పుకోదగిన మార్పు ఏమీ లేదని మా రాష్ట్ర మహాసభ విశ్లేషించింది. అయినప్పటికీ, స్వతంత్ర శక్తిని పెంచుకునేందుకు నిరంతర పోరాటాలను పార్టీ చేస్తోంది. ప్రజలకు సంబంధించిన ప్రతి అంశంలోనూ జోక్యం చేసుకుంటోంది. పార్టీ సంస్థాగత పునర్నిర్మాణం ఎక్కువ జిల్లాల్లో జరిగింది. అక్కడ పోరాటాల్లో ప్రాతినిధ్యం కూడా బాగా పెరిగింది. తక్షణ మార్పు సాధ్యపడకపోయినా, ఐదేళ్ల కిందటితో పోల్చితే ఇప్పుడు పరిస్థితి మెరుగైందని స్పష్టంగా చెప్పవచ్చు.

టిఎంసి, బిజెపిల వైఖరి ఎలా ఉంది?

బిజెపి, తణమూల్ కాంగ్రెస్ పరస్పరం బలాన్ని పెంచుకునే విధంగా పని చేస్తున్నాయి. హిందువుల ప్రయోజనాలను కాపాడేది తామేనని బిజెపి చెబుతోంది. ముస్లింల రక్షకురాలు తానేనని మమతా బెనర్జీ చెబుతున్నారు. ఈ రెండు పార్టీలు కేవలం రాజకీయంగానే కాకుండా మతపరంగా కూడా విభజన సష్టించి, రాష్ట్రానికి నష్టం చేకూరుస్తున్నాయి.

సిపిఎం ఎలా పనిచేస్తోంది?

వర్గ పోరాటాల ద్వారా బలాన్ని తిరిగి సాధించుకుంటోంది. వలస కార్మికులు, గిగ్ వర్కర్లు వంటి విభాగాల్లో కూడా పోరాటాలు చేపడుతున్నాం. ఉత్తర బెంగాల్ నుంచి కోల్‌కతా వరకు డివైఎఫ్‌ఐ నిర్వహించిన 2000 కిలోమీటర్ల 'ఇన్సాఫ్ యాత్ర'కు యమంచి ఆదరణ లభించింది. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన యువజన ర్యాలీ, ఆర్జీకర్ అత్యాచార కేసుపై ప్రదర్శనలో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం తదితర సంఘటనలు బెంగాల్‌లో పెరుగుతుతున్న బలానికి సంకేతాలు.

కార్యకర్తలపై ఒత్తిడి ఉందా?

సిపిఐ (ఎం) మద్దతుదారులు కూడా బెదిరింపుల కారణంగా నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వర్గ పోరాటాలను బలహీనపరిచేందుకు బిజెపి, తృణమూల్ రెండు పార్టీలు పోటీపడుతున్నాయి. దీనిని ప్రజలు గమనిస్తున్నారు.

మేధావులు ఎవరి వైపు ఉన్నారు?

ఒక సమయంలో దూరమైన మేధావులు, కళాకారులు ఇప్పుడు మళ్లీ పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారు. తణమూల్ బెదిరింపులను లెక్కచేయకుండా, మమతా ప్రభుత్వంలోని అవినీతి, మత వివక్షను ఎండగడుతూ 'మాయానగర్ (వన్స్ అపాన్ ఎ టైమ్ ఇన్ కోల్‌కతా)' అనే సినిమా ఇటీవల విడుదలైంది. విభజన కాలంలో తీవ్ర మత ఘర్షణల నుంచి బెంగాల్ ప్రజలను కాపాడగలిగింది కమ్యూనిస్టులు నిర్వహించిన రాజకీయ, సాంస్కృతిక పోరాటాలే అన్న విషయాన్ని మేధావులు గుర్తు చేసుకుంటున్నారు. వామపక్షం అధికారంలో ఉన్న సమయంలో మత కలహాలు చోటుచేసుకోని విషయాన్ని కూడా వారు ప్రస్తావిస్తున్నారు. బెంగాల్‌లో ముస్లింలు గెలిచినట్లయితే, వారిని శాసనసభ నుంచి గెంటివేస్తామని బిజెపి నాయకులు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

- సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి


కెకె రాజన్ (కేరళ)


అమన్ పరధా (పశ్చిమ బెంగాల్)


అమిధా దత్త (త్రిపుర)


నూర్ అహ్మద్ (తమిళనాడు)

విచ్ఛిన్న రాజకీయాలకు

సంఘటిత ఉద్యమాలే సమాధానం

చర్చల్లో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

పాలకులు అనుసరిస్తున్న కార్పొరేటు అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ విస్తారంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన ఆవశ్యకతపై సిపిఎం అఖిల భారత మహాసభలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు మాట్లాడారు. తమ రాష్ట్రాల్లో చేపట్టిన వివిధ పోరాటాలు, ఉద్యమాల అనుభవాలను వివరించారు. ప్రజలకు అనేక విధాలుగా తీవ్ర నష్టం కలిగిస్తున్న ఉదారవాద విధానాలపై ప్రజలను సమీకరించటం ద్వారానే ప్రజలను విభజిస్తున్న మతోన్మాద ధోరణులకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు.

కేరళ ప్రతినిధుల తరపున కెకె రాజన్ మాట్లాడుతూ, తమ రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం దేశానికే ఆదర్శవంతమైన పాలన అందిస్తోందని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో చేసిన కృషిని, మూతపడిన ప్రైవేటు సంస్థలను పబ్లిక్ రంగంలో నడపడం గురించి వివరించారు. దేశంలోనే తొలి డిజిటల్ యూనివర్సిటీని కేరళ ఏర్పాటు చేసిందని చెప్పారు. దుర్భర దారిద్ర్యం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వామపక్ష ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు.

త్రిపుర నుంచి మాట్లాడిన హరిపదదాస్ ... తాము అనుసరించిన ఎన్నికల ఎత్తుగడలు, 2024 పార్లమెంట్ ఎన్నికల గురించి వివరించారు. గిరిజన, గిరిజనేతర పేదల ఐక్యతను నిలబెట్టడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

పశ్చిమ బెంగాల్ నుంచి దేబాశిష్ చక్రవర్తి మాట్లాడుతూ, తమ రాష్ట్రంలో సాగిస్తున్న ఉద్యమాలు, పోరాటాలను వివరించారు. విద్యార్థి, యువజన రంగాల్లో చేస్తున్న కృషిని, పొందిన ఫలితాలను తెలిపారు. యువతీ యువకులను పార్టీ వైపు ఆకర్షించడానికి, భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు నిర్వహించగలమన్న విశ్వాసం వ్యక్తపరిచారు.

తమిళనాడు ప్రతినిధి నూర్ మహ్మద్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల వల్ల కలుగుతున్న ముప్పును నివారించేందుకు ప్రజా ఉద్యమాలను మరింత పెంచాలని అన్నారు. శ్రీలంక తమిళుల సమస్యలు, కచ్చితీవు అంశం గురించి ప్రస్తావించారు. రాష్ట్రంలో కులవివక్షకు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమాలు పార్టీ విస్తరణకు ఎలా తోడ్పడిందీ వివరించారు. వలస కార్మికులను సమీకరించడానికి, వారికి రక్షణ కల్పించేందుకు చేస్తున్న కృషిని వివరించారు.

అస్సాం ప్రతినిధి గుయాన్ మాట్లాడుతూ, హిమంత్ బిశ్వశర్మ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజావ్యతిరేకత పెరుగుతోందని అన్నారు. సిఎఎకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పార్టీ సాగించిన ఉద్యమాలను వివరించారు.

కర్ణాటక నుంచి మాట్లాడిన మీనాక్షి సుందరం... దేశవ్యాప్తంగా మతోన్మాదానికి వ్యతిరేకంగా క్యాంపెయిన్ సాగించాలని కోరారు. ఎన్నికల పనిలోనూ సృజనాత్మక పద్ధతులను అవలంబించాలని; మూఢ నమ్మకాలకు, ఛాందసత్వానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలని అన్నారు.

ఒరిస్సా రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాణిగ్రాహి ... గిరిజన ప్రాంతాల్లో పార్టీ కృషిని, అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను వివరించారు. గ్రామీణ సంపన్న కూటమికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటాలు సాగిస్తే మన ప్రజా పునాది పెరుగుతుందని అన్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రతినిధి కె.భారతి మాట్లాడుతూ, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. భరంత భూసేకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు సాగిస్తున్నామని వివరించారు.

ఢిల్లీ రాష్ట్ర కమిటీ ప్రతినిధి ఆశాశర్మ మాట్లాడుతూ, నిరుద్యోగం, మతతత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమాలు సాగించాలని కోరారు. జార్ఖండ్ ప్రతినిధి మాట్లాడుతూ, తమ రాష్ట్రంలో ప్రభుత్వాలు పెద్దఎత్తున బలవంతపు భూసేకరణ చేస్తున్నాయని, బాధితులను సమీకరించి ఉద్యమిస్తున్నామని తెలిపారు.

మధ్యప్రదేశ్ ప్రతినిధి అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, పార్టీ రాజకీయ విధానాన్ని పూర్తిస్థాయిలో ఆకలింపు చేసుకోవాలని అన్నారు. ఉత్తరాఖండ్ ప్రతినిధి మాట్లాడుతూ, మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం విద్వేష విధానాన్ని తీవ్రతరం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

అండమాన్ నికోబార్ దీవుల ప్రతినిధి అయ్యప్పన్ మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు పెంచుతోందని అన్నారు. విభజన రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు.

హిమాచల్ ప్రదేశ్ ప్రతినిధి రాకేష్ సింఘా మాట్లాడుతూ, ట్రంప్ సుంకాలు పెంచినందున వివిధ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, యాపిల్ రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. మిగతా రంగాల్లోనూ దుష్ప్రభావాలను అధ్యయనం చేసి వాటిపై ఉద్యమించాలని అన్నారు.

రాజస్థాన్ ప్రతినిధి కిషన్ పారి మాట్లాడుతూ, వారు సాగిస్తున్న వివిధ ఉద్యమాలను వివరించారు. బీహార్ ప్రతినిధి అజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగిస్తున్న భూపోరాటాలు, ఇతర గ్రామీణ సమస్యలపై కృషిని వివరించారు. కేరళ నుంచి మాట్లాడిన అనిల్ కుమార్ ... పార్టీ స్వతంత్ర బలం పెంపు, వామపక్ష ఐక్యత అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని అన్నారు. అదే సమయంలో ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయాల్సి ఉందని అన్నారు.

పశ్చిమ బెంగాల్ ప్రతినిధి పాథక్ మాట్లాడుతూ, ఉత్తర బెంగాల్‌లో విచ్ఛిన్నకర ఉద్యమాల దుష్ప్రభావం ఎంతగా పడిందో వివరించారు.


త్రిపుర ప్రతినిధి అమితవ ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కారు ఏక పార్టీ నియంతృత్వానికి తెగబడుతోందని అన్నారు.


అజయ్ కుమార్ (బీహార్)


అనీల్‌కుమార్ (కేరళ)


ఆశా శర్మ (ఢిల్లీ)


హార్వేవ్‌బెయిన్స్ (బ్రిటన్,ఐర్లాండ్‌నుంచి ప్రతినిధి)


జార్ఖండ్ ప్రతినిధి


కర్ణాటక ప్రతినిధి


ఎమ్‌డి అబ్బాస్ (కాశ్మీర్)


మీనాక్షి సుందరం (కర్ణాటక)


పురుషోత్తం జేక్ (పంజాబ్)


పవన్ కుమార్ (అస్సాం)


సుదీప్ దుట్టా (సెంట్రల్)


ఉత్తరప్రదేశ్ ప్రతినిధి

మతోన్మాద దాడులను ఎదుర్కొనేందుకు

ప్రజల్లో విస్తృత ప్రచారం

సిపిఎం మహాసభ పిలుపు

సీతారాం ఏచూరి నగర్ నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, సంఘ్‌పరివార్‌ల మతోన్మాద దాడులను ఎదుర్కొనేందుకు ప్రజానీకంలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని సిపిఎం అఖిల భారత మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని మహాసభ గురువారం ఆమోదించింది. 'ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి. సంఘ్‌పరివార్‌ల మతోన్మాద దాడులను, పెంచిపోషిస్తున్న మతపరమైన విద్వేషాన్ని, ముస్లింలు, ఇతర మైనార్టీలపై దాడులను తిప్పికొట్టాలి. దీనికోసం పార్టీ యూనిట్లు సమర్ధవంతమైన విస్తృత ప్రచారాన్ని చేపట్టాలి. సంఘ్ పరివార్ శక్తుల అసలు ఎజెండా ఏమిటో ప్రజలకు అర్థమయ్యేలా చేయడానికి, దాని దాడులను తీవ్రంగా తిప్పికొట్టడానికి లౌకిక, ప్రజాతంత్ర అభ్యుదయ శక్తులతో కలిసి అన్ని రకాల ప్రయత్నాలు చేయాలి' అని తీర్మానం పేర్కొంది.

సంఘ్ పరివార్ వ్యూహాత్మకంగా చేస్తున్న మతపరమైన దాడులను మహాసభ ఖండించింది. 'హిందుత్వ ఎజెండాకు మద్దతు పొందాలంటే సమాజాన్ని మతపరంగా ద్వేషంతో నింపడమే మార్గమని సంఘ్‌పరివార్ భావిస్తోంది. డబుల్ ఇంజన్ సర్కార్లు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేకపోవడం వల్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతప్తిని పక్కదోవ పట్టించేందుకు ఈ దాడులు చేస్తున్నారు' అని తీర్మానంలో పేర్కొంది. ఇప్పటికే ఉన్న పాత సమస్యలకు అనేక కొత్త అంశాలను కూడా చేరుస్తున్నారని, రామనవమి, హనుమాన్ జయంతి వంటి పండుగలను ముస్లింలపై దాడులకు ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. శుక్రవారం రోజున హోలీ రావడంతో ముస్లిములను లక్ష్యంగా చేసుకుని పలు ప్రాంతాల్లో బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపింది.


తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న రాజీవ్

'ఇటీవల దాడుల్లో చిన్న పిల్లలను కూడా మినహాయించలేదు. రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో నెల రోజుల పసికందును పోలీసులే తొక్కి చంపిన ఘటన, మహారాష్ట్రలోని మాల్వాన్‌లో 15 ఏళ్ల ముస్లిం బాలుడిని పాక్ అనుకూల నినాదాలు చేశాడని ఆరోపిస్తూ జైలుకు పంపిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగించే అంశాలు. దీనికి తోడు చరిత్రను వక్రీకరించి ముస్లింలను కించపరిచే సినిమాలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఛావా సినిమా ఔరంగజేబును క్రూరుడిగా చూపించింది. మొత్తం ముస్లిం సమాజాన్ని అపఖ్యాతిపరచేలా చిత్రీకరించింది. మహారాష్ట్ర మంత్రులు దీన్ని ముస్లింలను పండుగలు, యాత్రల నుంచి వేరు చేయడానికి ఉపయోగించుకున్నారు. నాగపూర్‌లో జరిగిన ఘర్షణలు ఈ కుట్ర ఫలితమే! అనేక మంది ముస్లింలను అరెస్టు చేసి, ఒక ముస్లిం నాయకుడి ఇంటిని బుల్డోజర్‌తో కూలగొట్టారు.' అని తీర్మానం వివరించింది. 'దేవాలయాలను కూల్చి మసీదులను నిర్మించారని ఆరోపిస్తూ వాటిపై దాడి చేయడానికి న్యాయవ్యవస్థను ఉపయోగించుకునే ప్రయత్నాలు మరింత పెరిగాయి. అత్యంత దురదష్టకరంగా పలు దిగువ కోర్టులతో పాటు మాజీ సీజేఐ డి.వై.చంద్రచూడ్ కూడా తమ వ్యాఖ్యలు, తీర్పుల ద్వారా ఈ మతపరమైన విద్వేషాన్ని ప్రేరేపించారు. ఉత్తర ప్రదేశ్‌లోని సంబల్‌లో ఈ ఉద్రిక్తతల కారణంగా ఐదుగురు ముస్లిం యువకులను కాల్చివేశారు. వేలాది మంది హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకునే సంపల్ పండుగను 'దేశద్రోహం' పేరుతో నిషేధించారు.

ఇది మత సామరస్యంపై తీవ్రమైన దెబ్బ.' అని సిపిఎం పేర్కొంది. 'ఉత్తరాఖండ్‌లో అమలులోకి తెచ్చిన యూనిఫామ్ సివిల్ కోడ్‌ను మహిళలు, ప్రేమజంటలు హక్కులపై దాడి చేయడమే కాకుండా, ముస్లింల వ్యక్తిగత హక్కులను పూర్తిగా రద్దు చేసేలా రూపొందించారు. ఉత్తర ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు 'మతమార్పిడి నిరోధక చట్టాలు' తీసుకురావడమే కాకుండా, హిందూ మహిళ - ముస్లిం పురుషుడు పెళ్లి చేసుకుంటే మరణదండన విధించాలనే ప్రతిపాదనను కూడా ముందుకు తెచ్చాయి. ఇటువంటి ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాలి.' అని మహాసభ పిలుపునిచ్చింది. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు పి.రాజీవ్ ప్రతిపాదించగా, మధుగార్గ్ బలపరచారు.



కారల్ మార్క్స్ మైనపు విగ్రహం వద్ద కార్యకర్తల కోలాహలం


సాంస్కృతిక వేదిక వద్ద కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం



సిపిఎం 24వ అఖిల భారత మహాసభ




ప్రకాశ్‌కరత్‌తో ముచ్చటిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేరళ సిఎం పినరయి విజయన్


కార్ల్ మార్క్స్, పెరియార్ జ్ఞాపికను స్టాలిన్‌కు అందజేస్తున్న ప్రకాశ్ కరత్, బాలకృష్ణన్, ఎంపీ వెంకటేశన్ తదితరులు


సభా నిర్వహణలో ఉన్న అధ్యక్షవర్గం మాణిక్ సర్కార్, ఎం.ఎ.గఫూర్

లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా
కార్మిక సంఘాల సమ్మెకు సంపూర్ణ మద్దతు

● సిపిఎం మహాసభ తీర్మానం

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

కేంద్రంలో మోడీ నేతత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర అఖిల భారత సమాఖ్యలు మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సమ్మెను జయప్రదం చేయాలని మదురైలోని సీతారాం ఏచూరి నగర్‌లో జరుగుతున్న సిపిఎం అఖిల భారత మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు మహాసభ తీర్మానం చేసింది. '29 ప్రస్తుత కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానే నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది. నిజానికి ఈ 'కార్మిక చట్ట సవరణలు' కార్మికుల ప్రాథమిక హక్కులను హరించడానికి, సిబ్బందిని గణనీయంగా తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా ఇవి పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత, కార్మికుల సంఘటిత హక్కు, సమ్మె హక్కు వంటి అంశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి.' అని పేర్కొన్నారు. నిజానికి ఈ కొత్త కోడ్‌లు భారీ సంఖ్యలో కార్మికులను, చట్టాల పరిరక్షణ పరిధి


తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న డా.కె హేమలత

నుంచి తొలగిస్తాయని, సామాజిక భద్రతను ప్రశ్నార్థకం చేస్తాయని. పిఎఫ్, ఇఎస్‌ఐ వంటి ప్రయోజనాలు నామమాత్రంగా మారుతాయని తీర్మానం పేర్కొంది. బీడి, ఇనుప ఖనిజం, మైకా, సున్నపురాయి, డోలమైట్ గనుల కార్మికుల భవిష్యత్ అనిశ్చితంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేసింది.

సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పేరుతో అమలు చేస్తున్న అన్ని చర్యలు, కార్మిక సంఘాలను బలహీనపరుస్తాయని, కార్మిక వర్గాన్ని తీవ్రంగా అణగదొక్కి, దేశీ-విదేశీ పెద్ద కార్పొరేట్లకు అనుకూలంగా శ్రమదోపిడీని కొనసాగించేందుకు ఉపయోగపడతాయని పేర్కొంది. ఈ నాలుగు కోడ్‌లను 2019-20లో ఆమోదించినా, కార్మికవర్గం ఐక్యంగా ప్రతిఘటిస్తున్నందున ఇప్పటివరకు వాటిని పూర్తిగా అమలు చేయలేకపోయారని పేర్కొంది. ఈ నేపథ్యంలో లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న డిమాండ్‌తో మే 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పార్టీ అన్ని కమిటీలను, శాఖలను, కార్యకర్తలను కోరింది. ఈ తీర్మానాన్ని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. హేమలత ప్రవేశపెట్టగా, మరో కేంద్ర కమిటీ సభ్యులు అమియ పాత్ర బలపరచారు.

నవ యువతే లక్ష్యం..!

● కె.బాలకష్ణన్

సీతారాం ఏచూరి నగర్ (మదురై) నుంచి ప్రజాశక్తి ప్రతినిధి

దేశ రక్షణ, అంతరాల నిర్మూలన లక్ష్యంగా యువతరాన్ని కదిలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం కేంద్ర కమిటీ పభ్యుడు కె.బాలకృష్ణన్ అన్నారు. సిపిఎం అఖిల భారత మహాసభ సందర్భంగా మదురైలోని సీతారాం ఏచూరి నగర్ (తముక్కం గ్రౌండ్)లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమిళనాడులోని రెండు కోట్ల మంది యువతను ఆకర్షించడానికి మహాసభ నిర్వహణ ఉపయోగపడుతుందని చెప్పారు. 'తమిళనాడులో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం నుంచీ అనేక దాడులను, అణచివేతను ఎదుర్కొంది. కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించినప్పటికీ, కమ్యూనిస్టులు అపారమైన త్యాగాలు చేశారు. ప్రజలపై అణచివేతను, వివక్షను వ్యతిరేకించారు' అని చెప్పారు. అందుకే బ్రిటిష్ సామ్రాజ్యవాదం కమ్యూనిస్టులపై తీవ్రమైన దాడిచేసిందని అన్నారు 'అది వార్తాపత్రికలను జప్తు చేసింది. ట్రేడ్ యూనియన్, రైతు సంఘంపై తీవ్రమైన అణచివేతను ప్రారంభించింది. అనేక కుట్ర కేసులను పెట్టింది.' అని అన్నారు. వాటన్నింటినీ అధిగమించి కమ్యూనిస్టు ఉద్యమం దేశంలో బలంగా పెరిగిందని చెప్పారు. 'స్వాతంత్ర్య



పోరాటంలో కమ్యూనిస్టులు అపారమైన త్యాగాలు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత కూడా, ప్రజల ప్రాథమిక హక్కులు, షెడ్యూల్డ్ కులాలు, గిరిజనులు, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కులు, సమాజంలో ప్రబలంగా ఉన్న అంటరానితనం యొక్క దురాగతాలు, మహిళలపై హింస వంటి వివిధ సమస్యలపై పోరాడుతూనే ఉన్నాం. ఫలితంగా తీవ్రమైన అణచివేతను ఎదుర్కొన్నాం. పార్టీని నాశనం చేయడానికి ప్రభుత్వాలు వివిధ ప్రయత్నాలు చేశాయి. కుట్ర కేసులు బనాయించాయి. వాటినన్నింటినీ అధిగమించి సిపిఎం ఎదుగుతోంది' అని వివరించారు.

'వెన్మణిలో 44 మంది వ్యవసాయ కార్మికులను సజీవంగా తగలబెట్టారు. వరి కుట్ర కేసు, మదురై కుట్ర కేసు, చెన్నై కుట్ర కేసు, తంజావూరు కుట్ర కేసుతో సహా అనేక కుట్ర కేసులు పెట్టారు. జైలు లోపల కమ్యూనిస్టులపై పోలీసులు, రౌడీలు కలిసి తీవ్ర దాడులు చేశారు. ఇవన్నీ చేయడం ద్వారా కమ్యూనిస్ట్ పార్టీని నాశనం చేయవచ్చని ఆనాటి పాలకులు భావించారు. కానీ, దానికి భిన్నంగా తమిళనాడులో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా నిర్మితమై, నిలదొక్కుకుంది.' అని బాలకష్ణన్ చెప్పారు. "ఈ రోజు దేశంలో బిజెపికి వ్యతిరేకంగా అనేక రాజకీయ విధులు నిర్వర్తించాల్సి ఉంది. తమిళనాడులో 2 కోట్లకు పైగా ఉన్న యువతను ప్రగతిశీలంగా మార్చటాన్ని లక్ష్యంగా తీసుకొని పనిచేస్తాం." అని ఆయన అన్నారు. "నేటి యువత ఎంతో ప్రతిభావంతంగా ముందుకుపోతోంది. అదే సమయంలో వారిలో కులం, మతం, ఇతర సంకుచిత భావాలను జొప్పించే ప్రయత్నాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. వాటిని మేం ప్రతిఘటిస్తాం. యువతలో సమత, మమతా భావాలను వెలికితీస్తాం. యువశక్తిని పూర్తిగా ఆవిష్కరించడం ద్వారా కుల, మత, తదితర విచ్ఛిన్న భావాలను అధిగమించి, సమాజాన్ని సంరక్షించే నవతరంగా వారిని మారుస్తాం." అని కె. బాలకృష్ణన్ చెప్పారు.

విభజన హామీలపై పోరాడాం

డి.రమాదేవి, ఆంధ్రప్రదేశ్

కన్నూరు మహాసభ నిర్దేశించిన విధంగా 'బిజెపిని ఒంటరిపాటు చేయాలి- ఓడించాలి' అన్న విధానాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయడానికి అన్ని విధాలా కృషి చేశామని ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి డి.రమాదేవి చెప్పారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్ష, రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడం, విభజన హామీలను అమలు చేయకపోవడంపై ప్రత్యేక హోదా సాధన సమితితోసహా వివిధ ప్రజాసంఘాలు, కలిసివచ్చే పార్టీలతో కలిసి ఉద్యమించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ పార్టీలు బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆ విధానాన్ని ఎండగడుతూ పార్టీ నిరంతరం ప్రచారోద్యమాలు నిర్వహిస్తోందని వివరించారు. రాష్ట్రంలో అనుసరించిన ఎన్నికల ఎత్తుగడలు, అమలు తీరును; గిరిజన ప్రాంతంలోని అరకు పార్లమెంట్ స్థానంలో 10.57 శాతం ఓట్లు సాధించిన వైనాన్ని వివరించారు. అయితే, ఇతర



ప్రాంతాల్లో పార్టీ ప్రజాపునాది కొంత చెదిరిపోయిందని, తిరిగి సమీకరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. 'విశాఖ ఉక్కు'ను ప్రైవేటీకరిస్తామని కేంద్రం నాలుగేళ్ల క్రితమే ప్రకటించినా అక్కడి కార్మికవర్గం, పార్టీ సాగించిన ఉద్యమం ద్వారా నిలువరించగలిగామని అన్నారు. పోలవరం నిర్వాసితుల పాదయాత్ర, రాష్ట్రంలో సాగించిన ప్రజా చైతన్యయాత్రలను గురించి వివరించారు. ఉద్యమ బలహీనతలను అధిగమించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



ఉత్తేజకరంగా కళా ప్రదర్శనలు

సిపిఎం అఖిల భారత మహాసభ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కళా సదస్సును కెపి జానకి అమ్మల్ స్మారక వేదికపై నిర్వహించారు. రిసెప్షన్ కమిటీ సభ్యులు మదుకూర్ రామ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తమిళ పండితులు సాల్మన్ బప్పయ్య, దర్శకుడు రాజు మురుగన్, సినీ స్క్రీన్ రైటర్ శశికుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం ఏచూరిపై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సుమారు 30 నిమిషాల పాటు మహిళా బృందం ప్రదర్శించిన వివిధ కళారూపాలు ఆకట్టుకున్నాయి. వారి దప్ప ప్రదర్శన, కర్రసాము అలరించాయి. దర్శకుడు రాజు మురుగన్‌కు కారల్ మార్క్స్ విగ్రహాన్ని ఇచ్చి కె.బాలకృష్ణన్ సన్మానించారు.


కళా రూపాలను తిలకిస్తున్న ప్రతినిధులు

ఐక్య ఉద్యమాలకు కృషి చేస్తున్నాం



మల్లు లక్ష్మి, తెలంగాణ

తెలంగాణలో మతోన్మాద బిజెపిపై పోరులో లౌకిక పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ మెతకగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ ప్రతినిధి మల్లు లక్ష్మి అన్నారు. విభజన హామీల అమలు విషయంలో, తెలంగాణకు రావాల్సిన నిధుల విషయంలో అందరినీ కలుపుకుపోయే విషయంలో కాంగ్రెస్ ముందుకు రావడం లేదన్నారు. తెలంగాణలోని వామపక్ష పార్టీలను కూడగట్టేందుకు సిపిఎం కృషి చేస్తున్నదని, ప్రత్యామ్నాయ ప్రజానుకూల ఎజెండాలో లెఫ్ట్ పార్టీలు ఒక కార్యాచరణ రూపొందించుకొని ముందుకు పోయేందుకు చొరవచూపనున్నాయని అన్నారు.

నాలుగున్నర లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలను సాధించడం బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సాధించిన వామపక్షాల విజయమన్నారు. హెచ్‌సియు భూములను రాష్ట్ర ప్రభుత్వం అమ్మడానికి వ్యతిరేకంగా, రామోజీ ఫిల్మ్‌సిటీ ఆక్రమించుకున్న భూములపై పోరాటం ద్వారా 600 మంది ఇళ్ల పట్టాలు సాధన పోరాటంలో పార్టీ క్రియాశీలకంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజా, వర్గ పోరాటాలను తెలంగాణ రాష్ట్రంలో ఉధృతంగా నిర్వహిస్తూ స్వతంత్ర కార్యాచరణను ఐక్య కార్యాచరణ, ఉద్యమాలను లెఫ్ట్ పార్టీలుగా, మరికొన్ని విషయాల్లో లౌకిక పార్టీలుగా ముందుకు తీసుకుపోతామని, హిందుత్వ - కార్పొరేట్ శక్తుల దోపిడీ విధానాలను ప్రజలకు వివరిస్తూ ఉద్యమాలకు సమీకరిస్తామని ఆమె తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68